మేజిక్ / గత వారం రోజుల పై విశ్లేషణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో **ఒక పూర్తి పేజీ**

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం : fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

1-7-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 151 పేజీలు: 8+4 వెల: 6.50


**భారత్ షేరునే కొనుగోలు చేస్తా: స్టీవ్ డైన్స్** 5లో

**కొత్త ఆర్మీ చీఫ్ ధీరజ్ సేథ్ బాధ్యతల స్వీకరణ**



మంగళవారం మహారాష్ట్ర సిఎం ఫడ్నవిస్‌తో భేటీ అయిన డిసిఎం పవన్

## ఫడ్నవిస్‌తో పవన్ భేటీ

### తూర్పు కనుమల్లో పులుల సంరక్షణ చర్యలపై చర్చ

### ఎపికి రెండు ఆడపులులు ఇస్తున్నందుకు కృతజ్ఞతలు

**విజయవాడ,జూన్ 30,ప్రభాతవార్తప్రతినిధి:** వన్యప్రాణి సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ లక్ష్యాల సాధనలో మహారాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం, ఇతర భాగస్వామ్య సంస్థలతో కలిసి మరింత సమన్వయంతో ముందుకు వెళ్తామని ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్‌అన్నారు. మంగళవారం మహారాష్ట్ర >>2

# వికసిత్ భారత్ మన లక్ష్యం

### గిరిజన సమాజంలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి

### నాణ్యమైన విద్య సమాజంలోని అన్ని వర్గాలకు చేరాలి: రాష్ట్రపతి ముర్ము

### విద్యార్థులను భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దుతాం

### విశాఖలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో మంత్రి లోకేష్



మంగళవారం విశాఖలో గిరిజన విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఎపి గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రి లోకేష్

**విశాఖపట్నం జూన్ 30 ప్రభాతవార్త:** గిరిజన సమాజంలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ పటిమను పెంపొందించే కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఎదగాలి అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు.మంగళవారం బీచ్ రోడ్‌లో గల హోటల్లో గిరిజన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఎపి గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ ఈ గిరిజన విశ్వవిద్యాలయానికి ఎన్నో ప్రత్యేక బాధ్యతలు ఉన్నాయని గుర్తుచేశారు. గిరిజన సమాజంలో ఆత్మవిశ్వాసాన్ని, నాయకత్వ లక్షణాలను విధాన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాలను పెంపొందించే ఒక ప్రధాన కేంద్రంగా ఈ విశ్వవిద్యాలయం రూపాంతరం చెందుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. సామాజిక న్యాయమే ధ్యేయంగా ఏర్పాటైన ఇటువంటి సంస్థలు.. స్థానిక గిరిజన ప్రాంతాల విద్యా, వైద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అటవీ హక్కుల కోసం క్షేత్రస్థాయిలో పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో వెనుకబడిన, గిరిజన వర్గాల యువత సమగ్ర వికాసానికి, అలాగే ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి ఈ వర్సిటీ విశేష కృషి చేస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

**విద్యార్థులకు దిశా నిర్దేశం**

ఘటికోత్సవం అనేది ప్రతి విద్యార్థి జీవితంలో ఒక మైలురాయి లాంటిదని, ఇది కేవలం సంబరాల రోజే కాకుండా భవిష్యత్తుపై ఒక బలమైన నిర్ణయం తీసుకునేసందర్భమని రాష్ట్రపతి అన్నారు. వేగంగా మారుతున్న ప్రపంచానికి అను >>2

## విద్యా బోధనలో ఎపి భేష్

### విద్యా మంత్రిగా లోకేష్ కృషిని అభినందించిన కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్

### భోగాపురంలోని మోడల్ స్కూలును పరిశీలించిన మంత్రులు

**విజయనగరం (భోగాపురం), జూన్ 30 ప్రభాతవార్త:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ విజయనగరం జిల్లా భోగాపురంలోని పిఎంశ్రీ ఎపి మోడల్ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆధునిక విద్యా బోధన, మౌలిక వసతులను మంత్రులు పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ముందుగా పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సి.పార్వతి, విద్యార్థులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

**పాఠశాలలో ఆధునిక విద్యా బోధన, మౌలిక వసతుల పరిశీలన:** పాఠశాల మొత్తం కలియతిరిగిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ >>2





మంగళవారం భోగాపురం పిఎంశ్రీ మోడల్ స్కూల్‌ను సందర్శిస్తున్న కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, మంత్రి లోకేష్ తదితరులు

## 28 జిల్లాలకు బిజెపి కొత్త ఇన్‌ఛార్జిలు

### సంస్థాగత నిర్మాణం పటిష్టం: రాష్ట్ర బిజెపి చీఫ్ మాధవ్

**విజయవాడ, జూన్ 30,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయడానికి రాష్ట్ర నాయకత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు కొత్త జిల్లా ఇన్‌ఛార్జిలను నియమిస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు.పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం, బూత్ కమిటీల బలోపేతం, సంస్థాగత విస్తరణ, సభ్యత్వ నమోదు, ప్రజా సమస్యలపై ఉద్యమాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, పార్టీ కార్యక్రమాల సమ >>2






మంగళవారం కర్ణాటకలో సర్ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా గణన పత్రంపై సంతకం చేస్తున్న సిఎం డికె శివకుమార్

## జిఎడి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి పదవీ విరమణ

**విజయవాడ, జూన్30, ప్రభాతవార్తప్రతినిధి:** జిఎడి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి పదవీ విరమణ చేశారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శంషేర్ సింగ్ రావత్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చారు. శ్రీలక్ష్మి రెండేళ్ల పాటు పోస్టింగ్ కోసం ఎదురుచూసిన నేపథ్యంలో సోమవారం ఆమె ప్రభుత్వ ఉత్వరుల మేరకు జిఎడి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా శ్రీలక్ష్మి బాధ్యతలను స్వీకరించారు. నేడు పదవి విరమణ చేసారు.

## ఇరాన్ అధ్యక్షుడితో ప్రధాని మోడీ ఫోన్ సంభాషణ

### హార్ముజ్ జలసంధిలో నౌకల స్వేఛ్ఛాయుత రవాణాకే ప్రాధాన్యం

**న్యూఢిల్లీ,జూన్ 30:** పశ్చిమ ఆసియాలో నెలకొన్న తాజా పరిణామాల నేపథ్యంలో ప్రధాని మోడీ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తో మంగళవారం ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రాంతీయ పరిస్థితులు, దౌత్యపరమైన ప్రయత్నాలు, హోర్ముజ్ జలసంధిలో నావిగేషన్ స్వేచ్ఛ వంటి కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. పశ్చిమ ఆసియాలో నెలకొన్న తాజా పరిస్థితులు, ప్రాంతంలో కొనసాగుతున్న దౌత్యపరమైన ప్రయత్నాలపై ఇరాన్ అధ్యక్షుడు ప్రధానికి వివరించారు. ఈ సందర్భంగా ప్రపంచ ఇంధన సరఫరాలకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిలో స్వేచ్ఛగా నౌకలరవాణా కొనసాగడం భారత్‌తో పాటు ప్రపంచ దేశాలకూ ఎంతో ముఖ్యమని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. ప్రాంతంలోని అన్ని సమస్యలు చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కారం కావాలని భారత్ ఎప్పటి నుంచో విశ్వసిస్తోందని ప్రధాని పునరుద్ఘాటించారు. శాశ్వత శాంతి, స్థిరత్వం కోసం నిరంతర దౌత్య ప్రయత్నాలు కొనసాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సంభాషణ అనంతరం ప్రధాని మోడీ సోషల్ మీడియా వేదిక లో స్పందిస్తూ పశ్చిమ ఆసియాలో జరిగిన చర్చల పురోగతిని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కొనసాగుతున్న చర్చలు ప్రాంతంలో శాశ్వత శాంతికి దోహదపడ తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. హార్ముజ్ జలసంధిలో నావిగేషన్ స్వేచ్ఛ భారత్‌తో పాటు ప్రపంచానికి అత్యంత కీలకమని మరోసారి స్పష్టం చేశారు.

## జన్మతః పౌరసత్వంపై సుప్రీంకోర్టు తీర్పుపై ట్రంప్ తీవ్రఅసంతృప్తి

**వాషింగ్టన్,జూన్ 30:** అమెరికా సుప్రీంకోర్టు జన్మహక్కు పౌరసత్వం సూత్రాన్ని కొనసాగిస్తూ ఇచ్చిన తీర్పుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తీర్పు అమెరికాకు అనుకూలం కాదని పేర్కొంటూ, కాంగ్రెస్ ద్వారా కొత్త చట్టం తీసుకువచ్చి ఈ అంశాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. మంగళవారం సామాజిక మాధ్యమంలో స్పందించిన ట్రంప్, జన్మహక్కు పౌరసత్వ విధానం అమెరికాపై భారీ ఆర్థిక భారం మోపుతోందని, దేశానికి అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఈ విధానాన్ని రద్దు చేసేలా కాంగ్రెస్ వెంటనే చట్టసభా ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. సుప్రీం కోర్టు జన్మహక్కు పౌరసత్వాన్ని సమర్థించింది. ఇది మన దేశానికి మంచిదికాదు. అయితే కాంగ్రెస్‌లో చట్టం తీసుకువచ్చి దీనిని సులభంగా మార్చవచ్చు. రాజ్యాంగ సవరణ అవసరం లేదు. ఈ విషయంలో కాంగ్రెస్ ఈరోజే చర్యలు ప్రారంభించాలి. వారికి నా సంపూర్ణ మద్దతు ఉంటుంని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. కాగా, అమెరికాలో అక్రమంగా లేదా తాత్కాలిక వీసాలపై నివసిస్తున్న విదేశీయుల పిల్లలకు జన్మతః అమెరికా పౌరసత్వం నిరాకరించేలా ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వును సుప్రీంకోర్టు తిరస్కరించింది. తన ప్రస్తుత కాలపరిమితి చివరి రోజున విచారణ పూర్తి చేసిన సుప్రీంకోర్టు, 6-3 మెజారిటీతో అమెరికా భూభాగంలో జన్మించిన దాదాపు ప్రతి వ్యక్తికి పౌరసత్వ హక్కు కొనసాగుతుందని స్పష్టం చేసింది. అంతకుముందు దిగువ కోర్టులు కూడా ట్రంప్ ఉత్తర్వుపై నిలుపుదల విధించాయి. ఈ తీర్పును ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ వెలువరించారు. అమెరికాలో అక్రమంగా లేదా తాత్కాలికంగా నివసిస్తున్న తల్లి దండ్రులకు జన్మించిన పిల్లలు కూడా అమెరికా చట్టాల పరిధిలోకి వస్తారని, రాజ్యాంగంలోని 14వ సవరణ ప్రకారం వారికి జన్మతః పౌరసత్వ హక్కు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పౌరసత్వం అనేది హక్కులను కలిగి ఉండే ప్రాథమిక హక్కు. అలాగే ప్రజాస్వామ్య వ్యవస్థలో స్వేచ్ఛగా భాగస్వామ్యం అయ్యే అవకాశం. 14వ రాజ్యాంగ సవరణ రూపకర్తలు ఈ హక్కును ఈ దేశంలో జన్మించిన ప్రతి స్వతంత్ర వ్యక్తికి విస్తరించారు. ఆ హామీని మేము ఈరోజు కూడా కొనసాగిస్తున్నా మని ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ వ్యాఖ్యానించారు.

## 35 యేళ్ల తర్వాత మళ్లీ విచారణకు సరళాభట్ హత్యకేసు

**శ్రీనగర్,జూన్ 30:** కశ్మీరీ పండిట్ సామాజిక వర్గానికి చెందిన నర్స్ సరళా భట్ అపహరణ, హత్య కేసు 35 యేళ్ల తర్వాత కీలక మలుపు తిరిగింది. జమ్మూకశ్మీర్ స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఈ ఘటనపై దర్యాప్తును ముగించి, జమ్మూకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ చీఫ్ మహ్మద్ యాసిన్ మాలిక్‌తో పాటు మరికొందరిని నిందితులుగా చేరుస్తూ శ్రీనగర్‌లోని ప్రత్యేక కోర్టులో 737 పేజీల భారీఛార్జ్‌షీట్‌ను దాఖలు చేయడానికిసిద్ధమైంది. 1990 ఏప్రిల్ 18న శ్రీనగర్ లోని షేర్ఇకశ్మీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎస్‌కేఐఎంఎస్) సమీపంలో నర్స్ సరళా భట్‌ను ఉగ్రవాదులు అపహరించారు. ఆ తర్వాత ఆమెను శారీరక హింసకు గురిచేసి, శ్రీనగర్ మాల్‌బాగ్‌లోని ఒమర్ కాలనీలో ఆటోమేటిక్ రైఫిల్స్‌తో కాల్చి అతిక్రూరంగా హత్యచేశారు. అప్పట్లో ఉగ్రవాద సంస్థలు సృష్టించిన బీభత్సం, భయాందోళనల కారణంగా సాక్షులు ఎవరూ ముందుకు రాకపోవడంతో దశాబ్దాలుగా ఈకేసు ఒక మిస్టరీగానే ఉండిపో యింది. 2024 మార్చి 18న జమ్మూకశ్మీర్ డిజిపి ఆదేశాల మేరకు ఈకేసు ఎస్ఐఎ చేతుల్లోకి వచ్చింది. 35 ఏళ్లు గడిచినప్పటికీ, దర్యాప్తు అధికారులు ఎంతో శ్రమించి సాంకేతికంగా, శాస్త్రీయంగా ఆధారాలను సేకరించారు. సాక్షుల వాంగ్మూలాలు, స్వతంత్ర ప్రత్యక్ష సాక్షుల ఆధారాలు, ఫోరెన్సిక్‌నివేదికల ఆధారంగానాటి ఘటన క్రమాన్ని విజయవంతంగా పునర్నిర్మిం చారు. ఈ దర్యాప్తులో తేలిందేంటంటే సరళాభట్ హత్య అనేది ఏదో అకస్మాత్తుగా జరిగిన వ్యక్తిగత దాడి కాదు. కశ్మీర్ లోయ నుంచి కశ్మీరీ పండిట్లను బలవంతంగా తరిమేయడానికి, ప్రజల్లో తీవ్రభయాందోళనలు సృష్టించడానికి జేకేఎల్ఎఫ్ అగ్ర నాయకత్వం పక్కావ్యూహంతో రచించిన ఒక ఉగ్రవాద కుట్రలో భాగమని ఆధారాలతో ఎస్ఐఏ నిర్ధారించింది.

# వికసిత్ భారత్ మన లక్ష్యం

గుణంగా విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, తమ చుట్టూ ఉన్న పర్యావరణం నుండి ప్రాక్టికల్ నైపుణ్యాలను నేర్చుకోవాలని సూచించారు. తమ సొంత సమాజం, సంస్కృతి, సాంప్రదాయాల మూలాలను మరువకుండా దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు విద్యార్థులు కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధిలో ఆధునిక విజ్ఞాన ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి అందాలనే ఉద్దేశంతో, ఈ విశ్వవిద్యాలయం ఉత్తరాంధ్రలోని గిరిజన గిరిజనుల సాధికారత కోసం ఒక 'సైన్స్ అండ్ టెక్నాలజీ హబ్' ను నిర్వహిస్తోందని రాష్ట్రపతి ప్రశంసించారు. గిరిజన సంక్షేమం, ప్రజారోగ్యం, వాతావరణ మార్పులు, ఆహారపోషకాహార భద్రత ఇంధన పరిరక్షణవంటి క్షేత్రస్థాయిఅంశాలపై వర్సిటీ చేస్తున్నకృషి.. సమసమాజ స్థాపనకు, దేశాభివృద్ధికి ఎంతోదోహదపడుతుందని పేర్కొన్నారు.

**2047 నాటికి వికసిత భారత్**

2047వ సంవత్సరం నాటికి వికసిత భారత్‌ను సాధించడమే మన లక్ష్యమని, పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే ఇక్కడి సమ్మిళిత, ప్రాక్టికల్ విద్యా విధానం ద్వారా ఆంధ్రప్రదేశ్ కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఈ లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషిస్తుందని రాష్ట్రపతి ధీమా వ్యక్తం చేశారు. గిరిజన యువతకు ఆధునిక విద్యను అందించడం ద్వారా వారు దేశ సమానాభివృద్ధిలో భాగస్వాములు కాగలరని ఆమె ఆకాంక్షించారు. అనంతరం నారా లోకేష్ మాట్లాడుతూప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే అసలైన విద్య అని, నాణ్యమైన విద్య సమాజంలోని ప్రతి వర్గానికి చేరాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాలు కేవలం డిగ్రీలు అందించే విద్యాసంస్థలు మాత్రమే కావు... అవి కలలకు రూపమిస్తాయి ఆయన తెలిపారు. ఈ రోజు కేవలం ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవం మాత్రమే కాదు... ఇది అవకాశాల, సమ్మిళిత అభివృద్ధి వేడుక. నాణ్యమైన విద్య దేశంలోని ప్రతి మూలకు, సమాజంలోని ప్రతి వర్గానికి చేరాలనే విశ్వాసానికి ప్రతీకగా నిలిచే వేడుక అని చెప్పారు. గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవానికి మన రాష్ట్రపతి కంటే మరింత అర్థవంతమైన ముఖ్య అతిథి మరెవరూ ఉండరు. ఆమె జీవితం స్వయంగా ఈ విశ్వవిద్యాలయం వంటి విద్యాసంస్థలు ఎందుకు అవసరమో చెప్పే అత్యుత్తమ సమాధానం అన్నారు. రాష్ట్రపతి ప్రయాణాన్ని అసాధారణంగా నిలబెట్టింది ఆమె అధిరోహించిన పదవులు మాత్రమే కాదు.. ఆమె జీవితంలో ఎదుర్కొన్న వ్యక్తిగత విషాదాలు కూడా. 2009 నుంచి 2014 మధ్య ఆమె తన పెద్ద కుమారుడు, చిన్న కుమారుడు, భర్త, తల్లి, సోదరుడిని కోల్పోయారు. అలాంటి దుఃఖాన్ని ఊహించడం కూడా మనలో చాలామందికి సాధ్యం కాదు. అయినప్పటికీ ఆమె నిరాశకు గురికాలేదు. ఆధ్యాత్మికతలో బలాన్ని వెతుక్కొని.. కొత్త సంకల్పంతో తిరిగి ప్రజాసేవలోకి వచ్చారు. 2022లో భారత రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం సందర్భంగా.. భారతదేశంలోని పేదలు కలలు కనడమే కాదు, ఆ కలలను నిజం చేసుకోగలరనే విషయానికి నా ఎన్నికే నిదర్శనం అని చెప్పారు. ఉన్నత విద్యను మరింత బలోపేతం చేస్తూ.. భారత యువతకు మరిన్ని అవకాశాలను కల్పిస్తున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కి అభినందనలు తెలియజేశారు. ఈ జాతీయ దార్శనికత నుంచి స్ఫూర్తి పొందుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏపి ఉన్నత విద్యలో సమూల మార్పులు తీసుకువస్తున్నాం. జ్ఞానాన్ని సృష్టించే, ఆవిష్కరణలకు ప్రేరణనిచ్చే విద్యార్థులను కేవలం ఉద్యోగాలకే కాకుండా నాయకత్వానికి సిద్ధం చేసే విశ్వవిద్యాలయాలను నిర్మిస్తున్నాం తెలియజేశారు. ప్రతి విద్యార్థి ఉపాధికి అర్హుడు కావాలి, ప్రతి విశ్వవిద్యాలయం ఆవిష్కరణలకు కేంద్రంగా మారాలి, ప్రతి పరిశోధకుడు సాధికారత పొందాలనేది మా లక్ష్యమన్నారు. అంతకుముందు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా బంగారు పతకాలు అందజేశారు.

# విద్యా బోధనలో ఎపి భేష్

వసతులను పరిశీలించారు. ముందుగా జాదు పిటారా కిట్‌ను కేంద్ర మంత్రి పరిశీలించారు. జాదు పిటారా కిట్ గురించి సిబ్బంది, మంత్రి లోకేష్ కేంద్ర మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాల విద్యాశాఖ అందిస్తున్న స్టూడెంట్ ప్రోగ్రెస్ కార్డ్, అసెస్ మెంట్ బుక్ లెట్‌ను కేంద్ర మంత్రికి లోకేష్ చూపించారు. విలువల విద్య కోసం ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలతో రూపొందించిన పుస్తకాల గురించి మంత్రి లోకేష్ విశదీకరించారు. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్‌ను ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పరిశీలించారు. టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, యూనిఫాం, స్కూల్ బ్యాగ్, షూ, బెల్ట్, సాక్స్ లను పరిశీలించారు. పిక్టోరియల్, ఆక్స్ ఫర్డ్ డిక్షనరీ గురించి సిబ్బంది వివరించారు.

**పాఠశాల విద్యాశాఖ డ్యాష్ బోర్డును పరిశీలించిన కేంద్ర మంత్రి**

ఈ సందర్భంగా విద్యాశాఖ రూపొందించిన డ్యాష్ బోర్డును కేంద్ర మంత్రి ఆసక్తిగా పరిశీలించారు. లీప్ డ్యాష్ బోర్డు గురించి మంత్రి లోకేష్ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వివరించారు. డ్యాష్ బోర్డ్‌లో ఎన్ రోల్ మెంట్, లెర్నింగ్ అవుట్ కమ్స్, అటెండెన్స్, మధ్యాహ్న భోజన పథకం, ఎంఇఒ, డిఇఒల ఇన్‌స్పెక్షన్, డ్రాప్ అవుట్స్, లీప్ యాప్ డౌన్ లోడ్స్, స్మార్ట్ కిచెన్స్, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు భవిత సెంటర్స్, అకడమిక్, ఇన్ ఫ్రా స్ట్రక్చర్ పర్ఫార్మెన్స్ వంటి అంశాల గురించి విశదీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో తీసుకురానున్న స్మార్ట్ కిచేన్ల వ్యవస్థపై రూపొందించిన ఏవీని వీక్షించారు. కడపలో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన స్మార్ట్ కిచెన్ గురించి కేంద్రమంత్రికి వివరించారు. అనంతరం స్పోర్ట్స్ రూమ్, స్కిల్ ల్యాబ్‌ను మంత్రులు పరిశీలించారు. విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పైథాన్ లాంగ్వేజ్‌ను ఉపయోగించి విద్యార్థి రూపొందించిన హోం వర్క్ అండ్ పీరియాడికల్ అసెస్ మెంట్ అప్లికేషన్‌ను ఆసక్తిగా గమనించారు. ప్రీ ఒకేషనల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ గురించి సిబ్బంది వివరించారు. ఇందుకు సంబంధించిన కౌశల్ బోధ్ పుస్తకాలను కేంద్ర మంత్రి పరిశీలించారు. స్కూల్ లైబ్రరీని సందర్శించి విద్యార్థులతో సంభాషించారు. లైబ్రరీలోని పుస్తకాలపై కేంద్ర మంత్రి ఆరా తీశారు.

**చాణక్య అంటే ఎవరో తెలుసా?**

అనంతరం మంత్రులు పాఠశాలలోని 9వ తరగతి బీ సెక్షన్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల మధ్య కూర్చొని ఫిజియోగ్రాఫిక్ డివిజన్ ఆఫ్ ఇండియా అంశంపై రూపొందించిన క్లిక్కర్ వీడియోను వీక్షించారు. సదరు పాఠ్యాంశం గురించి ఉపాధ్యాయురాలు విద్యార్థులకు వివరించారు. క్లిక్కర్ వీడియోకు సంబంధించి ఫ్లిప్ ప్యానల్ ద్వారా క్విజ్ నిర్వహించగా 55 శాతం మంది విద్యార్థులు సరైన సమాధానాలు చెప్పారు. ఈ సందర్భంగా తరగతి గదిలోని విద్యార్థులతో కేంద్ర మంత్రి సంభాషించారు. ఈ రోజు ఏం టిఫిన్ తిన్నావని ఓ విద్యార్థిని ప్రశ్నించగా దోశ తిన్నానని సమాధానం ఇచ్చాడు. మధ్యాహ్న భోజనం గురించి ఆరా తీశారు. అనంతరం ఓ విద్యార్థి పేరు అడగ్గా చాణక్య అని చెప్పాడు. "చాణక్య అంటే ఎవరో తెలుసా? కింగ్ ఆ, కింగ్ మేకరా?" అని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. కింగ్ మేకర్ అని విద్యార్థి సమాధానం చెప్పాడు. మరో విద్యార్థి రాం ప్రసాద్‌ను పాఠ్యాంశాలపై అనుమానాలు ఉంటే ఎవరిని అడుగుతావని ప్రశ్నించగా తన సోదరుడిని అడుగుతానని విద్యార్థి సమాధానం చెప్పాడు. ఏ భాష సౌకర్యంగా భావిస్తావని సదరు విద్యార్థిని ప్రశ్నించగా తెలుగు అని సమాధానం చెప్పాడు. ఈ సందర్భంగా బైలింగ్యువల్ టెక్స్ట్ బుక్స్ గురించి మంత్రి లోకేష్ వివరించారు. అనంతరం విద్యార్థి స్థాయి ఆధారంగా నేర్చుకునే పాల్ ల్యాబ్‌ను పరిశీలించారు. విద్యార్థులను, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమ పేర్లతో రూపొందించిన త్రీడి ప్రింటింగ్ ను కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు ఓ విద్యార్థి బహుమతిగా అందజేశాడు.

## కాకినాడలో మాయాబజార్

### 'స్టాక్ మార్కెట్' పేరిట రూ 400 కోట్లకు టోపీ

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూన్ 30 (ప్రభాతవార్త):** అడ్డదారిలో ఆశ చూపిస్తే అక్షరాలా ముంచేస్తారని కాకినాడలో మరోసారి నిరూపిత మైంది. అధిక లాభాల ఆశచూపి, అమాయక ప్రజల రక్తాన్ని పిండేసి, చివరకు చేతులెత్తేసే మోసపూరిత సంస్కృతికి ఇదో నిదర్శనం. పలువురు బాధితులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలో ఖిజెన్సిస్ఖి అనే స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ కంపెనీ రాత్రికి రాత్రే బోర్డు తిప్పేసేందుకు ప్రయత్నిస్తోందన్న ప్రచారం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. సుమారు 400 కోట్ల రూపాయల మేర పెట్టుబడులు గుంజేసి, ఇప్పుడు బాధితుల పొట్ట గొట్టేందుకు సిద్ధమవ్వడంతో సర్వం కోల్పోతామంటూ బాధితులు సదరు కంపెనీ కార్యాలయాన్ని ముట్టడించారు. స్థానిక సిద్ధార్థ నగర్ లోని ఈ ఖిజెన్సిస్ఖి మాయా బజార్‌లో మా దగ్గర పెట్టుబడి పెట్టండి.. లాభాల పంట పండిస్తామంటూ నిర్వాహకులు నమ్మబలికారు. రెండు లక్షలు పెట్టుబడి పెడితే ప్రతినెల రూ.30 వేలనుండి రూ.40వేల వరకులాభాలు ఇస్తామని ఆశ పెట్టారు. ఇలా ఒక్కొక్కరికి ఒక్కో రకమైన ఆఫర్లతో వలవిసిరి.. ఏకంగా 7 వేల మందిని తమ మాయలోపడేశారు. జిల్లావ్యాప్తంగా పలుప్రాంతాల ప్రజలు తమ కష్టార్జితాన్ని, అప్పులుతెచ్చి మరీ ఈ కంపెనీలోరూ. 400 కోట్లు పెట్టుబడిగా పెట్టారు.

## ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఎక్కడ?

### కొత్తూరు పిఎస్‌కు వెళ్తూ అదృశ్యం!



**టెక్కలి (శ్రీకాకుళం జిల్లా), జూన్ 30 ప్రభాతవార్త:** ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో కొత్తూరు పోలీస్‌స్టేషన్‌లో విచారణ కోసం టెక్కలి నుంచి బయలుదేరిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మార్గమధ్యలో అనూహ్యంగా అదృశ్యమయ్యారు. టెక్కలి నుంచి బయలుదేరి రెండు గంటలు దాటినా ఆయన కొత్తూరు చేరుకోలేదు. అతడి ఫోన్లు స్విచాఫ్ అయినట్లుగా అభిమానులు చెబుతున్నారు. హిరమండలం పోలీస్ స్టేషన్‌లో జనసేన నాయకుడు ఇచ్చిన ఫిర్యాదుపై ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై కేసు నమోదు కాగా విచారణకు రావాలని కొత్తూరు పోలీసులకు ఆయనకు నోటీసులను గతంలో ఇచ్చారు. ఈ మేరకు కొత్తూరు సర్కిల్ కార్యాలయంలో ఆయనను పోలీసులు ఇటీవల విచారించారు. ఆ సమయంలో కొత్తూరు స్టేషన్ వద్ద దివ్వెల మాధురితో పాటు దువ్వాడ అభిమానులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. విచారణ సమయంలో దువ్వాడ శ్రీనివాస్ పోలీసులకు సహకరించకపోవడంతో మరోసారి విచారణకు హాజరు కావాలని అప్పట్లోనే పోలీసులు ఆయనకు సూచించారు. ఈ క్రమంలో మంగళవారం దువ్వాడ శ్రీనివాస్‌ను పోలీసులు మరోసారి విచారించగా గతంలో దివ్వెల మాధురి స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసనలను తెలిపిన నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యలలో భాగంగా ఆమెను టెక్కలిలోని నివాసం వద్దనే గృహనిర్భందం చేశారు. దువ్వాడ శ్రీనివాస్ ఒక్కరే విచారణ కోసం కొత్తూరు బయలుదేరగా మార్గమధ్యలో మిస్సయ్యారు. పోలీసులే అతడిని రహస్య ప్రదేశానికి తరలించి ఉంటారని మాధురితో పాటు ఆయన అభిమానులు ఆరోపిస్తున్నారు. పోలీసులు మాత్రం కొత్తూరు స్టేషన్‌కు ఆయన రాలేదని చెప్పుకొస్తున్నారు. ఈ వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

## వారం - వర్జ్యం

01-07-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆరుద్ర కార్తె
పాడ్యమి ఉ.7.38
పూర్వాషాఢ ఉ.6.51
వర్జ్యం : మ.3.43-సా.5.29
దు.11.45-మ.12.37
శుభసమయం : ఉ.8.00-9.00
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** సంతాన విద్యావిషయంలో నూతన బాధ్యతలు చేపడతారు. సోదరి, సోదరులతో విభేదాలు తలెత్తుతాయి.

**వృషభం:** పట్టుదలతో ముందుకుసాగి వ్యవహారాలు చక్కదిద్దుతారు. అరుదైన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి.

**మిథునం:** ముఖ్యులతో పరిచయాలు ఏర్పడతాయి. మీ తొందరపాటు మాటలవల్ల మిత్రులతో శత్రుత్వం ఏర్పడుతుంది.

**కర్కాటకం :** మీ ప్రతిభాపాటవాలు వెలుగు చూస్తాయి. ఇళ్ల కొనుగోలుయత్నాలు సాగిస్తారు. పెట్టుబడులకు తగిన లాభం పొందుతారు.

**సింహం:** కీలకనిర్ణయాలలో తొందరపాటు వద్దు. ఉద్యోగములలో స్వల్పమార్పులు చోటుచేసుకుంటాయి. వాహనసౌఖ్యం.

**కన్య :** ఇంట్లో వడ్రంగిపనులు, ఫర్నీచర్ పనులు చేస్తారు. ఫాస్ట్‌ఫుడ్స్ వ్యాపారస్థులకు అనుకూలమైన కాలం. వస్త్రలాభం.

**తుల :** ఆర్థికంగా చెప్పుకోదగిన లాభాలు ఉండబోయినా లోటువుండదు. ఖర్చును అదుపుచేయలేకపోతారు.

**వృశ్చికం:** స్థిరత్వము, ధైర్యమువలన చాలా ఫలితములు అనుకూలదిశలో వయనిస్తాయి. స్నేహితుల కలయిక.

**ధనుస్సు:** కుటుంబ ఐకమత్యంకు విఘాత మేర్పడకుండా సంయమనం పాటించండి. ఆస్తివివాదాలు తీరుతాయి.

**మకరం:** మాటలచాతుర్యంతో కార్యాలయంలో ఉన్నతాధికారుల మెప్పు పొందుతారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం వుంటుంది.

**కుంభం:** రాజకీయ, సినీ, కళారంగాల వారికి విదేశీపర్యటనలు. శత్రువులు సైతం మిత్రులుగా మారి సాయం అందిస్తారు.

**మీనం :** పోరాడి దూరప్రాంత అవకాశము లను సాధిస్తారు. మీమీద నిందారోపణలు చేసే వ్యక్తుల విషయంలో జాగ్రత్తలు వహించండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



మంగళవారం వెనుజులాలోని కాటియాలా మాల్‌లో శిథిలాల కింద సహాయక సిబ్బంది గాలిస్తున్న దృశ్యం

# ఫడ్నవిస్‌తో పవన్ భేటీ

ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. మంగళవారం ముంబైలోని మహారాష్ట్ర ముఖ్యమంత్రి వారి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో తూర్పు కనుమల్లో పులుల సంరక్షణ, మహారాష్ట్ర నుంచి రాష్ట్రానికి రెండు ఆడ పులులు ఇచ్చే అంశాలపై ఇరువురు నేతల మధ్య ఫలవంతమైన చర్చలు సాగాయి. ఉమ్మడి ప్రయోజనాలకు సంబంధించి భవిష్యత్తులో మరింత సహకరించుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌లోని తూర్పు కనుమల ప్రాంతంలో ఆడ పులుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో జన్యుపరమైన సమస్యలు తలెత్తాయి. ఈ క్రమంలో పులుల సంఖ్య పునరుద్ధరణకు మహారాష్ట్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటున్నాం. ఆంధ్రప్రదేశ్ కు రెండు ఆడ పులులు ఇచ్చేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. వారు అందిస్తున్న సహకారానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. తూర్పు కనుమలలో పులుల సంరక్షణ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుంది. తూర్పు కనుమల్లో ఆడ పులుల ప్రవేశంతో అంతరసంతానోత్పత్తి సమస్యలను అధిగమించడంతోపాటు, జన్యు వైవిధ్యం పెరిగి, పులుల సంఖ్య దీర్ఘకాలిక స్థిరత్వానికి దోహదపడుతుంది. తద్వారా తూర్పు కనుమలలో ఆరోగ్యకరమైన, స్వయం సమృద్ధి కలిగిన పులుల ఆవాస వ్యవస్థ ఏర్పడుతుంది. శాస్త్రీయ విధానాలు, స్థిరమైన వన్యప్రాణి నిర్వహణ ఆధారంగా జీవ వైవిధ్య పరిరక్షణకు ఇరు రాష్ట్రాలు కట్టుబడి ఉన్నాయన్న అంశాన్ని ఈ సంయుక్త సంరక్షణ కార్యచరణ ప్రతిబింబిస్తోంది. ఆంధ్రప్రదేశ్-మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య ఏర్పడిన ఈ భాగస్వామ్యం తూర్పు కనుమలలో పులుల దీర్ఘకాలిక సంరక్షణకు విశేషంగా దోహదపడుతుందని విశ్వసిస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో మాకు నిరంతరం మార్గదర్శకత్వం అందిస్తున్న కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ కూడా ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.

# బిజెపి కొత్త ఇన్‌ఛార్జిలు

స్వయం వంటి బాధ్యతలను జిల్లా ఇన్‌ఛార్జిలు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర నాయకులు, వివిధ మోర్చాల నాయకులతో సమన్వయం చేసుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా నియమించిన జిల్లా ఇన్‌ఛార్జిల వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాకు పోలిమేర శ్రీనివాసరావు, అల్లూరి సీతారామరాజు జిల్లాకు పుట్ట గంగయ్య. పోలవరం జిల్లాకు గాడే శ్రీనివాసరావు, శ్రీకాకుళం జిల్లాకు రవీందర్ రెడ్డి మేడపాటి, విజయనగరంజిల్లాకు ఎన్. విజయానంద రెడ్డి. విశాఖపట్నం జిల్లాకు రెడ్డి పావని, అనకాపల్లి జిల్లాకు ఎపిఆర్ చౌదరి, కాకినాడ జిల్లాకు ఆకుల శ్రీధర్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు కరంకి శ్రీనివాస్, తూర్పు గోదావరి జిల్లాకు బుద్ధా లక్ష్మీనారాయణ, పశ్చిమ గోదావరి జిల్లాకు శ్రీదేవి రేలంగి, ఏలూరు జిల్లాకు రామ్ కుమార్ చిలుకూరి. కృష్ణా జిల్లాకు భోగిరెడ్డి ఆదిలక్ష్మి, ఎన్‌టిఆర్‌జిల్లాకు వెంకట సుబ్బారావు నార్ని (తాతాజీ), గుంటూరు జిల్లాకు వైవిఆర్ మోహన్ (దొరబాబు), పల్నాడు జిల్లాకు తొగంటి శ్రీనివాస్ (జిల్లా ఇన్‌ఛార్జి), జిల్లాకు అవుల నాగేంద్ర కుమార్ యాదవ్ (జిల్లా కోఇన్‌ఛార్జి) బాపట్ల జిల్లాకు గాజుల వెంకయ్య నాయుడు, ప్రకాశంజిల్లాకు జి. భరత్ కుమార్, మార్కాపురం జిల్లాకు కొక్కెర శ్రీనివాస్ యాదవ్, నెల్లూరు జిల్లాకు చంద్రశేఖర్ భీమినేని, తిరుపతి జిల్లాకు పి.వి. కృష్ణారెడ్డి, చిత్తూరు జిల్లాకు కె.వి. లక్ష్మీనారాయణ రెడ్డి, అన్నమయ్య జిల్లాకు టి.డి. వరప్రసాద్, కడప జిల్లాకు చిట్టిబాబు, శ్రీ సత్యసాయి జిల్లాకు కునిగిరి నీలకంఠ, అనంతపురంజిల్లాకు బెస్తా చంద్రప్ప, కర్నూలు - జిల్లాకు సందిరెడ్డి శ్రీనివాసులు, నంద్యాల జిల్లాకు పిడి పార్థసారథి (జిల్లా ఇన్‌ఛార్జి), జిల్లాకు అంబిలి కాశీ విశ్వనాథ్ (జిల్లా కోఇన్‌ఛార్జి). పార్టీని గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మరింత పటిష్ఠంగా తీర్చిదిద్దేందుకు ఈ నియామకాలు దోహదపడతాయని రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా ఇన్‌ఛార్జిలు స్థానిక నాయకత్వంతో సమన్వయం చేసుకుంటూ సంస్థాగత కార్యక్రమాలను వేగవంతం చేయాలని, పార్టీ విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆయన సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేయడమే ఈ నియామకాల ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.

# ఖనిజ నిల్వలపై మినరల్ మ్యాపింగ్

### రాష్ట్రానికి గరిష్ట ఆదాయం రాబట్టే యత్నం

### టెక్నాలజీద్వారా ఇసుక తవ్వకాల పర్యవేక్షణ కట్టుదిట్టం

### ఖనిజసంపదపై విస్తృతంగా అధ్యయనం: గనులశాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ జూన్ 30,ప్రభాతవార్తప్రతినిధి:** ఖనిజ సంపద ద్వారా రాష్ట్రానికి గరిష్ట ఆదాయం వచ్చేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. ఆదిశలో కీలక కార్యాచరణ, ప్రయత్నం ఉండాలన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో విలువైన ఖనిజ నిల్వల్ని గుర్తించేలా మినరల్ మ్యాపింగ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. క్రిటికల్ మినరల్స్, బల్క్ మినరల్స్‌తో పాటు విలువైన లోహాలు లభ్యం అయ్యే ప్రాంతాల మ్యాపింగ్ జరగాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వెలికి తీసే ఖనిజాలకు విలువ జోడించేలా ప్రాసెసింగ్ ప్రక్రియను నిర్వహించే అంశంపైనా దృష్టి సారించాలని సూచించారు. క్యాంపు కార్యాలయంలో గనుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ఖనిజ సంపదకు సంబంధించి మార్కెట్ క్యాపిటలైజేషన్ కు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. రాష్ట్రప్రభుత్వ రంగ సంస్థ ఎపిఎండిసి ద్వారా విలువైన ఖనిజాల మార్కెట్ క్యాపిటలైజేషన్‌కు అవకాశం ఉందన్నారు. దీనిపై నిపుణులతో కలిసి అధ్యయనం చేయాలని సిఎం స్పష్టం చేశారు. బీచ్ శాండ్, రేర్‌ఎర్త్ మినరల్స్, ముడి ఇనుము, మాంగనీస్, అల్యూమినా లాంటి వివిధ ఖనిజాలకు విలువ జోడింపు ప్రక్రియ ద్వారా గరిష్టంగా రెవెన్యూను ఆర్జించేందుకు ఆస్కారం ఉందని సిఎం అన్నారు. దేశంలోని కొన్ని రాష్ట్రాలు ఖనిజ ఆదాయం కారణం గానే రెవెన్యూ మిగులు సాధించాయని సిఎం వ్యాఖ్యానించారు. ఖనిజాల వ్యాల్యూ అడిషన్‌కు సంబంధించి విస్తృతంగా చర్చించి ఓ ప్రత్యేక విధానం తీసుకువచ్చే అంశాన్ని పరిశీలించాల న్నారు. రాష్ట్రంలోనే ఈ ఖనిజాల విలువ జోడింపు ప్రక్రియ జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎపి, ఒడిశా, కేరళ లాంటి రాష్ట్రాల్లో లభ్య మయ్యే అత్యంత విలువైన రేర్ ఎర్త్ మినరల్స్‌పై క్లస్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు. టైటా నియం, ఇలమనైట్, మోనజైట్ లాంటి హై వాల్యూ మినరల్స్ నిల్వలు ఏమేరకు ఉన్నాయన్న దానిని గుర్తించాలన్నారు. ఎలక్ట్రానిక్స్, మాగ్నెట్స్ సహా విలువైన లోహాలను తయారు చేసేందుకు రేర్ ఎర్త్ మినరల్స్ వెలికితీత జరగాలన్నారు. ప్రత్యేకమైన పరికరాల తయారీకి కీలకమైన ఈ లోహాలు అణు ఇంధనం సహా వ్యూహాత్మకంగా దేశానికి కూడా అత్యంత కీలకమని సిఎం అన్నారు. రాష్ట్రంలో జొన్నగిరి సహా చిత్తూరు జిల్లా చిగురుగుంట వద్ద కూడా బంగారం నిల్వలు ఉన్నాయని మిగతా బ్లాక్స్‌పై కూడా అధ్యయనం చేయాలని ముఖ్య మంత్రి గనుల శాఖకు సూచనలిచ్చారు.

**టెక్నాలజీతో ఇసుక సరఫరా కట్టుదిట్టం..**

రాష్ట్రంలోని 126 ప్రాంతాల్లో క్రిటికల్, బల్క్ ఖని జాలు సహా ఇతర విలువైన ఖనిజాలను గుర్తించామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం మైనింగ్ ఆపరేషన్స్ ద్వారా రెవెన్యూలో 18 శాతం మేర వృద్ధి నమోదైనట్టు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం గనుల తవ్వకాలను కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు. ఇసుక తవ్వకాల, సరఫరా పై కూడా పూర్తి స్థాయి నిఘా ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇసుక రీచ్‌ల వద్ద సిసి కెమెరాలతో పాటు శాటిలైట్ చిత్రాల ద్వారా విశ్లేషించటంతో పాటు వాహనాలకు జిపిఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల కోసమే ఇసుకపై వెయ్యి కోట్ల రూపాయల మేర ఆదాయాన్ని వదిలేసి ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని అన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని అధికారులను సిఎం ఆదేశించారు. ఈ సమీక్షలో గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, సిఎస్ సాయి ప్రసాద్, గనుల శాఖ, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శులు ముఖేష్ కుమార్ మీనా, పీయుష్ కుమార్ సహా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జిల్లా కోర్టుల వద్ద అంబులెన్స్‌లు

**విజయవాడ, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో కోర్టుల వద్ద అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ కలిగిన '108' అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రతి జిల్లా కోర్టు వద్ద ఒక అంబులెన్స్ ఏర్పాటు చేయాలని హైకోర్టు రిజిస్ట్రార్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సిఇఒ పంపిన ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 13 జిల్లా కోర్టుల వద్ద అందుబాటులో ఉంచనున్న అంబులెన్స్‌లకు ఏటా రూ.3.93 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అలాగే సిఆర్‌డిఏ పరిధిలోని రాయపూడి, ఐనవోలు, ఉండవల్లి వద్ద 3 కొత్త 108 అంబులెన్సులు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

## ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారెంటీ స్కీమ్ 5.0లో రూ.1280.43 కోట్ల పంపిణీ

- ఒక్కో రుణ గ్రహీతకు గరిష్ఠంగా రూ.100 కోట్ల పరిమితి
- రాష్ట్రంలో 3606 ఖాతాలకు ప్రయోజనం

**విజయవాడ, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** పశ్చిమ ఆసియా (మిడిల్ ఈస్ట్) దేశాలలో జరుగుతున్న సంక్షోభం వల్ల ఇబ్బందులు పడుతున్న వ్యాపారాలను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారెంటీ స్కీమ్ 5.0ను తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా వ్యాపారాలకు అదనపు రుణ సహాయం అందుతుంది. బ్యాంకులు లేదా ఇతర ఆర్థిక సంస్థలు ఇచ్చే ఈ అదనపు రుణాలపై ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తుంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఇ) 100 శాతం, మిగిలిన సంస్థలకు 90శాతం రుణ భరోసా ఉంటుంది. 'స్టాండర్డ్' లోన్ ఖాతాలు కలిగి ఉన్నవారు ఈ పథకానికి అర్హులు. వీరు 2025-26 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (క్యూ4)లో వాడిన వర్కింగ్ క్యాపిటల్‌పై అదనంగా 20శాతం వరకు రుణం తీసుకోవచ్చు. అయితే ఈ అదనపు రుణం రూ.100 కోట్లకు మించకూడదు. ఈ పథకం కింద 31 మార్చి 2027 లోపు లోన్ మంజూరు కావాలి. అలాగే 30 జూన్ 2027 నాటికి లోన్ డబ్బులు చేతికి అందాల్సి ఉంటుంది. ఈ పథకాన్ని నేషనల్ క్రెడిట్ గ్యారెంటీ ట్రస్టీ కంపెనీ లిమిటెడ్ పర్యవేక్షిస్తుంది.

## నేడు ఢిల్లీకి మంత్రి బిసి జనార్దన్ రెడ్డి

**విజయవాడ, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపి పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి రెండు రోజుల పాటు ఢిల్లీలో పర్యటిస్తారు. ఆయన బుధవారం సాయంత్రం ఢిల్లీ చేరుకుంటారు. జులై 2, 3 తేదీల్లో హస్తినలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు, కేంద్ర పోర్టులు, షిప్పింగ్ జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌తో భేటీ అవుతారు. మంత్రి బిసి జనార్దన్ రెడ్డితో పాటు ఆర్‌అండ్‌బి స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఎం.టి కృష్ణబాబు, మారిటైమ్ బోర్డు సిఇఒ ప్రవీణాదిత్య, ఇతర ఉన్నతాధికారులు పాల్గొంటారు.

## ఇఏపిసెట్ ఫలితాల విడుదల వాయిదా

**విజయవాడ, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపి ఇఏపిసెట్ ఫలితాల విడుదల వాయిదా పడింది. జులై 2న ఫలితాలు విడుదల చేసే అవకాశం ఉన్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలది మంది విద్యార్థులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న ఏపిసెట్ ఫలితాలు మంగళవారం విడుదల చేయనున్నట్లు ప్రకటించినా అవి కాస్తా వాయిదా పడింది. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. అయితే సాంకేతికపరమైన కారణంగా మరో రెండు రోజులు తరువాత విడుదలయ్యే అవకాశం ఉంది. మే 12 నుంచి 20 వరకు ఎపిసెట్ పరీక్షలు జరిగిన సంగతి తెలిసిందే. దాదాపు 3.29లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. షెడ్యూల్ ప్రకారమైతే జూన్ 1 నాటికే ఈ ఫలితాలు వెలువడాల్సి ఉంది. అయితే, ఇంటర్ మార్కులకు 25శాతం వెయిటేజీ ఉండటంతో ఏ ఒక్క విద్యార్థికి నష్టం జరగకూడదన్న ఉద్దేశంతో ద్వితీయ ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు, సిబిఎస్ఇ రెట్రైజ్ ఫలితాలు పూర్తి స్థాయిలో వచ్చే వరకు అధికారులు ఆగడంతో జాప్యం జరిగిందని సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. ఎంతో ఎదురు చూసిన విద్యార్థులకు మళ్లీ నిరాశే ఎదురైంది.

## 3న కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులకు శ్రీకారం


- నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి



**విజయవాడ, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులకు ముహూర్తం ఖరారైంది. జులై 3న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారికంగా నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి తెలిపారు. కడప స్టీల్ ప్లాంట్ రాయలసీమ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్న ఆమె, మాటలకే పరిమితం కాకుండా చేతల్లో చూపించే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ నిర్మాణంలో కనీసం కాంపౌండ్ వాల్ కూడా నిర్మించలేదని విమర్శించారు. 2018 డిసెంబర్ 27న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే కడప స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. రాయలసీమపై వెనుకబడిన ప్రాంతం అనే ముద్రను తొలగించి 'రాయల్ సీమ'గా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆమె చెప్పారు. హార్టికల్చర్, ఎలక్ట్రానిక్స్, పరిశ్రమల హబ్‌గా రాయలసీమను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఎన్నికల ముందు కొబ్బరికాయలు కొట్టి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కడప స్టీల్ ప్లాంట్ కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాదని, వేలాది మంది యువతకు ఉపాధి, అనేక కుటుంబాలకు భవిష్యత్తు భరోసా కల్పించే ప్రాజెక్టు అని పేర్కొన్నారు. విద్యుత్, నీటి సరఫరా, రహదారులు వంటి అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేసిన తర్వాతే నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు దాదాపు 800 కంపెనీలు పెట్టుబడులతో ముందుకొచ్చాయని పేర్కొంటూ, గత ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధికి ఏం చేసిందో సమాధానం చెప్పాలని ఎంపి శబరి డిమాండ్ చేశారు.

# మరింత పటిష్టంగా సమాచార నెట్‌వర్క్

- కనెక్టివిటీ టూ లాస్ట్ మైల్ అనేదే లక్ష్యం
- డిజిటల్ లిటరసికీ ఆపరేటర్ల సహకారం అవసరం
- సెల్ టవర్ నెట్‌వర్క్ బలోపేతంపై సర్వీసు ప్రొవైడర్లకు ఆదేశాలు
- రాష్ట్రంలో కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



**విజయవాడ, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** సమాచార నెట్‌వర్క్ అంశంలో ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయటం ద్వారా సమాచార వ్యవస్థలో లాస్ట్ మైల్ కనెక్టివిటీ దిశగా పని చేస్తున్నామని సీఎం వెల్లడించారు.
కమ్యూనికేషన్ నెట్ వర్క్‌ను మరింత బలోపేతం చేసేలా కృషి చేయాలని సూచించారు. క్యాంపు కార్యాలయంలో రాష్ట్రంలో కమ్యూనికేషన్ నెట్‌వర్క్ పై సిఎం వివిధ సర్వీసు ప్రొవైడర్లు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మొబైల్ కవరేజి విషయంలో సర్వీసు ప్రొవైడర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిఎం చెప్పారు. మారుమూల ప్రాంతాల్లో సెల్ టవర్లు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎపి వ్యాప్తంగా కమ్యూనికేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా మరిన్ని సెల్ టవర్లను ఏర్పాటు చేయాలని వివిధ కంపెనీల ప్రతినిధులకు సూచనలు జారీ చేశారు.
ప్రస్తుతం రాష్ట్రంలో 30,694 సెల్ టవర్లు ఉన్నాయని.. మరో 2310 సెల్ టవర్లను ఏర్పాటు చేయాల్సి ఉందని ఐటీ, కమ్యూనికేషన్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ సిఎంకు వివరించారు. దీనిపై స్పందించిన సిఎం అవసరమైన మేరకు సర్వీసు ప్రొవైడర్‌లకు ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తామని తెలిపారు. వంద రోజుల్లో సెల్ టవర్లను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. భౌగోళికంగా కవరేజి లేని ప్రాంతాల వివరాలను ఇస్తామని స్పష్టం చేశారు. రాజధాని అమరావతిలో ఫైబర్ ద్వారా సమాచార నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఎక్కడా తవ్వకాలు జరక్కుండా ప్రతీ ఇంటికీ ఫైబర్ నెట్‌వర్క్ అందిస్తామ న్నారు. ఎపి వ్యాప్తంగా 1,69,638 కిలోమీటర్ల ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్‌తో పాటు 28.67 లక్షల బ్రాడ్ బ్యాండ్ కనెక్షన్లు ఉన్నాయని అధికారులు తెలిపారు.

**డిజిటల్ లిటరసీకి సహకారం:** రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ వినియోగదారుల్లో డిజిటల్ లిటరసీకి కూడా సర్వీసు ప్రొవైడర్లు సహకారం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ప్రభుత్వం వాట్సప్ గవర్నెన్సు మనమిత్ర ద్వారా అందిస్తున్న వివిధ సేవలు, సంజీవని పథకం సహా వివిధ టచ్ పాయింట్‌ల సేవల్ని సమర్థంగా వినియోగించుకునేలా ఈ డిజిటల్ లిటరసీ ఉపకరిస్తుందన్నారు.
ప్రజలను డిజిటల్ లిటరేట్లుగా మారిస్తే మొబైల్ ఫోన్ ద్వారా ఎక్కువ సేవలు అందించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. త్వరలో ఏఐ ఆగ్రానమిస్ట్, ఏఐ డాక్టర్, ఏఐ ట్యూటర్ లాంటి వేర్వేరు సేవల్ని వినియోగదారులు ఉపయోగించు కునేందుకు అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరించారు. కుప్పం నియోజకవర్గంలో పైలట్ ప్రాతిపదికన అన్ని ప్రాంతాలకూ పూర్తి మొబైల్ కవరేజి అందిస్తున్నట్టు తెలిపారు.
ఈ సమీక్షకు ఐటీ, కమ్యూనికేషన్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, డిపార్ట్ మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్, బిఎస్ఎన్ఎల్, ఎయిర్ టెల్, జియో, వొడాఫోన్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

# జ్యుడీషియల్ జిల్లాల పునర్విభజన, కొత్త కోర్టుల ఏర్పాటు చేయాలి

- సిఎం చంద్రబాబుకు ఎపి జ్యుడీషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ వినతి



**విజయవాడ, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లాల పునర్విభజన తర్వాత తలెత్తిన సాంకేతిక పరమైన ఇబ్బందులను పరిష్కరించాలని, జ్యుడీషియల్ జిల్లాల పునర్విభజన, కొత్త కోర్టులను ఏర్పాటు చేయాలని ఎపి జ్యుడీషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేసింది. ఈమేరకు క్యాంపు కార్యాలయంలో ఎపి జ్యుడీషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సిఎంను కలిసి వివిధ అంశాలను వివరించారు. జ్యుడీషియల్ అధికారుల సమస్యలు, సంక్షేమం సహా అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కోరారు. జ్యుడీషియల్ అధికారుల కుటుంబ సభ్యులకు క్యాష్ లెస్ వైద్య చికిత్స సౌకర్యాన్ని కల్పించటంతో పాటు సాఫ్ట్ లోన్ పరిమితిని కూడా పెంచాలని అసోసియేషన్ ప్రతినిధులు ముఖ్యమంత్రిని కోరారు. అలాగే ఇంటి స్థలాలను కూడా కేటాయించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ ప్రతినిధులు తన దృష్టికి తెచ్చిన అంశాలపై సిఎం సానుకూలంగా స్పందించారు. కొత్త కోర్టుల ఏర్పాటు, జ్యుడిషియల్ జిల్లాల పునర్విభజన వంటి అంశాల గురించి సిఎం అడిగి తెలుసుకున్నారు. ఈ అంశాలన్నిటినీ పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని సిఎం అసోసియేషన్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. జ్యుడిషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.చక్రపాణి, ఉపాధ్యక్షులు జె. శ్రీనివాసరావు, కె.శైలజ, ప్రధాన కార్యదర్శి ఎన్.రమేష్ నాయుడు, సంయుక్త కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, కార్యవర్గ సభ్యుల వెన్నెల, రాధారాణి ముఖ్యమంత్రిని కలిశారు.

## వెదుళ్లవలసలో దారుణం

- ఇద్దరు చిన్నారులను హత్య చేసిన తల్లి
- అనంతరం ఆత్మహత్యాయత్నం

**ఆముదాలవలస (శ్రీకాకుళం జిల్లా), జూన్ 30 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం వెదుళ్ళవలస గ్రామానికి చెందిన కూర్మాపు వరలక్ష్మి భర్త రమణ(30)రజక కులం అను ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు సంతానం, పెద్ద పాప పేరు కూర్మాపు భవాని, వయస్సు 3 సం.లు, రెండో పాప పేరు కూర్మాపు చాందిని, వయస్సు 4 నెలలు. వరలక్ష్మి భర్త రమణ కూలి పనులు నిమిత్తం నల్లగొండలో ఉన్నారు. ఈమెతో పాటు అత్త కూర్మాపు లక్ష్మి వెదుళ్ళవలస గ్రామంలో ఉంటున్నారు. రాత్రి వరలక్ష్మి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇంటిలో పడుకోగా ఆమె అత్త లక్ష్మి, లక్ష్మికి అమ్మమ్మ కూడా ఉన్నారు. ఇంటి బయట ఇద్దరూ పడుకున్నరు. ఉదయం ఇంటి బయట పడుకున్న అత్త లక్ష్మి మంగళవారం వేకువ జామున నాలుగు గంటలకు లేచి ఇంటి తలుపులు తీసేసరికి వరలక్ష్మి తన ఇద్దరు పిల్లలకు పీక కోసి తాను కూడా పీక కోసుకొని ఉన్నది. ఇద్దరు ఆడ పిల్లలు చనిపోయి ఉన్నారు. అత్త లక్ష్మి వారిని చూసి కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వారు వచ్చి వరలక్ష్మి కొన ఊపిరితో ఉండగా గ్రామస్తులు 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి వరలక్ష్మిని తరలించారు. అత్త లక్ష్మి, కోడలు వరలక్ష్మి నిరంతరం గొడవలు పడేవారని చుట్టుపక్కల వారు చెప్పుకుంటున్నారు. అత్త లక్ష్మి నిరంతరం కోడలు వరలక్ష్మికి ఇద్దరు ఆడపిల్లలు పుట్టారని వేధించడంతో మనస్థాపానికి గురై వరలక్ష్మి ఇద్దరు పిల్లలను పీక కోసి తను కూడా పీక కోసుకున్నట్లు పరిసర ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. వరలక్ష్మి పరిస్థితి కూడా విషమంగా ఉందని బోగట్టా. వరలక్ష్మి ఆరోగ్యం బాగుపడితే నిజాలు బయటకు వస్తాయి. వీటిపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తే మరిన్ని నిజాలు బయటికి వస్తాయని ఆయా గ్రామస్తులు అంటున్నారు. క్షతగాత్రులు చిన్న పిల్లలను చూసి గ్రామస్తులు, కుటుంబ సభ్యులు రోదనాలతో బోరుమని విలపించారు. సంఘటన స్థలానికి డిఎస్పీ వివేకానంద, సిఐ శ్రీనివాసరావు పరిశీలించారు. వీటిపై ఆముదాలవలస ఎస్సై సనపల బాలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సిట్ లీగల్ అడ్వైజర్‌గా 'బైరా'



**విజయవాడ కార్పొరేషన్, జూన్ 30 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కల్గించిన గాదె సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో దర్యాప్తు కోసం ఏర్పాటు చేసిన సిట్‌కు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా రామకోటేశ్వరరావును లీగల్ అడ్వైజర్‌గా నియామకం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో సిట్ దర్యాప్తుకు చట్టపరమైన సలహాల ను అందించడం,సాక్ష్యాధారాలను పరిశీలించ డం, దర్యాప్తు నివేదికలను వెట్టింగ్ చేయడం వంటి భాధ్యతలను ఆయన నిర్వహించనున్నారు.

# నేడు నెల్లూరు జిల్లాలో సిఎం పర్యటన

- పొన్న పరివారిపాలెంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ
- గూడూరు నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులతో ఉన్నత సమీక్ష
- ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా



**చిల్లకూరు (నెల్లూరు), జూన్ 30 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జులై 1వ తేదీన చిల్లకూరు మండలం, పొన్నపరవారి పాలెం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. జులై 1న రాష్ట్ర ముఖ్యమంత్రి గూడూరు నియోజకవర్గం, పొన్న పరివారిపాలెంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం సందర్భంగా రానున్న సందర్భంగా, మంగళవారం చిల్లకూరు మండలం, పున్నపువారిపాలెంలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, జేసి మొగిలి వెంకటేశ్వర్లులతో కలసి ఏర్పాట్లపై కలెక్టర్ హిమాన్షు శుక్లా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి జిల్లా అధికారులకు వివిధ బాధ్యతలను అప్పగించడం జరిగింద న్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా ప్రణాళికా బద్ధంగా గట్టి ఏర్పాట్లు చేయాలని విధులను కేటాయించిన అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు. హెల్త్ క్యాంపులు, హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనులు పక్కాగా వుండాలని, అలాగే త్రాగునీటి కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారు లను ఆదేశించారు. హెలిప్యాడ్, బ్యారికేడింగ్ తదితర ఏర్పాట్లను ఆర్ అండ్ బి అధికారులు పటిష్టంగా చేపట్టాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లను పూర్తిచేసి విజయవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో నూతన పరిశ్రమలు రానున్నాయని తద్వారా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు మెరుగుపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. చుట్టుపక్కల గ్రామాల వారిని ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చే అవకాశం ఉందని సుమారు 5000 నుంచి 7000 దాకా హాజరు కానున్నారని ఆయన తెలిపారు. గూడూరు నియోజక వర్గంలో అధిక సంఖ్యలో పెట్టుబడులు రానున్నాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు.
గూడూరు నియోజకవర్గ అభివృద్ధికి ఫర్నిచర్, కృష్ణపట్నం పోర్టు సిటీ తదితరాలపై ముఖ్యమంత్రి రివ్యూ చేయనున్నారని, అలాగే నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి నివేదికలు గౌరవ ముఖ్యమంత్రికి సమర్పించనున్నామని ఆయన తెలిపారు.
భారీ బందోబస్తు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనలో ఎలాంటి సంఘటనలో జరగకుండా నేందుకు 570 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని అందరూ సమన్వయంతో పనిచేసి ముఖమంత్ర పర్యటనను విజయవంతం చేయాలన్నారు
ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఏఎస్‌పి సౌమ్య, గూడూరు ఆర్డీవో అరుణ కుమారి, ఆత్మకూరు ఆర్డీవో పావని, మెప్మా పిడీ, కిరణ్ కుమార్, డిపివో వసుమతి, తెలుగు గంగ ప్రత్యేక అధికారులు వంశీకృష్ణ, కేశవర్ధన్ రెడ్డి, అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో జనసేన బలోపేతమే లక్ష్యం

- మంత్రి కందుల దుర్గేష్



**విజయవాడ, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** క్షేత్రస్థాయిలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, క్షేత్రస్థాయి నుండి బలమైన నాయకత్వాన్ని పెంపొందించాలనేదే జనసేనాని పవన్ కళ్యాణ్ సంకల్పం అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ జనసేన పార్టీ పరిశీలకులు కందుల దుర్గేష్ వెల్లడించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ ఆధ్వర్యంలో జనసేన పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో పనిచేసేందుకు ముందుకు వచ్చిన వారి నుండి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను మంత్రి కందుల దుర్గేష్ అధికారికంగా ప్రారంభించారు. జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో పార్టీ పట్ల నిబద్ధత కలిగిన ప్రతి జనసైనికుడి ఆసక్తి, శక్తి సామర్థ్యాలు, రాజకీయ అనుభవం. పరిజ్ఞానం, ఆర్థిక, సామాజిక నేపథ్యాల ఆధారంగా వారు ఏ స్థాయిలో పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నారో తదనుగుణంగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ స్వయంగా దరఖాస్తుదారుల నుండి అప్లికేషన్లను స్వీకరించారు. దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేసేందుకు క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలైన విజయవాడ ఈస్ట్, విజయవాడ వెస్ట్, విజయవాడ సెంట్రల్, జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, తిరువూరు ఈ ఏడు నియోజకవర్గాలకు విడివిడిగా డెస్కులను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో తొలి రోజే భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. అబ్జర్వర్‌గా వ్యవహరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్‌తో పాటు సీనియర్ మెంబర్స్, సాధక్ రిప్రెజెంటేటివ్స్, పార్లమెంట్ అబ్జర్వర్స్ టీమ్‌కు చెందిన 28 మంది సభ్యులు ప్రతి ఒక్క అప్లికేషన్‌ను అత్యంత సునిశితంగా పరిశీలించారు. దరఖాస్తులు నింపడంలో హెల్ప్ డెస్క్ సభ్యులు దరఖాస్తుదారులకు పూర్తి సహాయసహకారాలు అందించారు. ప్రధానంగా పార్లమెంట్ కమిటీ, అసెంబ్లీ కమిటీ, మండల, గ్రామ కమిటీ, పార్టీ అనుబంధ విభాగాల్లో భాగంగా లోక్ సభ, అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్, లోక్ సభ, అసెంబ్లీ నియోజకవర్గ కమిటీతో పాటు లీగల్ విభాగం, విద్యార్థి విభాగం, మీడియా అండ్ కమ్యూనికేషన్ విభాగం, ఐటీ మరియు డేటా మేనేజ్ మెంట్, పర్యావరణ విభాగం, సేవాదళ్, వీరమహిళ విభాగం, పాడ్ క్యాస్ట్ విభాగం, చేనేత విభాగం, డాక్టర్స్, ఎన్ఆర్ఐ విభాగం, సైన్స్ అండ్ టెక్నాలజీ, లాజిస్టిక్స్, అధికార ప్రతినిధులు, యువజన విభాగం, సాంస్కృతిక విభాగం, మత్స్యకార విభాగం, శిక్షణ, అవగాహన కార్యక్రమాలు, పంచాయతీ, మండల కమిటీ వంటి పలు కీలక కమిటీలలో పనిచేసేందుకు జనసేన పార్టీ ఆశావహులకు అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో మంత్రి కందుల దుర్గేష్ ప్రతి దరఖాస్తుదారుడితో స్వయంగా మాట్లాడారు. అభ్యర్థుల వివరాలు, వారి సేవా నిరతిని అడిగి తెలుసుకున్న మంత్రి దుర్గేష్ దరఖాస్తుదారులందరికీ ప్రత్యేకంగా "ఆల్ ది బెస్ట్ చెప్పారు. అప్లికేషన్ లపై అంతిమ నిర్ణయం జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ దే అని, తాము అందుకు ప్రాతిపదిక అని తెలిపారు.

# రైతుల ప్రయోజనాలే తమకు పరమావధి

- మంత్రి రాంప్రసాద్ రెడ్డి



**విజయవాడ, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** మామిడి రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి రాంప్రసాద్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ మేరకు ఆయన కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.. గత ఏడాది కూడా కూటమి ప్రభుత్వం రైతులకు కేజీకి రూ.4 చొప్పున అదనంగా చెల్లించి ఆదుకుందని గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా అదే రీతిన కేజీకి రూ.4 ముందస్తుగా అందిస్తూ మామిడి కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ఈసారి పంట దిగుబడి ఊహించిన దానికంటే చాలా ఎక్కువగా రావడం వల్లే కొనుగోళ్లపై తాత్కాలికంగా కొంత ఒత్తిడి పెరిగిందని, అంతకుమించి మరేమీ లేదని ఆయన స్పష్టం చేశారు. గత ఏడాది కూడా మామిడి రైతుల కోసం ప్రభుత్వం సుమారు రూ.190 కోట్లు వెచ్చించి అండగా నిలిచిందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఒకవేళ కొనుగోళ్ల ప్రక్రియలో ఎక్కడైనా జాప్యం జరిగితే మాత్రం సంబంధిత ఫ్యాక్టరీలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ముఖ్యంగా వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సంబంధించిన, ఆ పార్టీ సానుభూతి కంపెనీలు కొనుగోళ్ల విషయంలో కావాలని అలసత్వం ప్రదర్శిస్తే మాత్రం ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు. తమ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలే పరమావధి అని స్పష్టం చేసిన మంత్రి. కేవలం రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసం రైతుల సమస్యలను వాడుకోవాలని చూడొద్దంటూ వైసిపి నేతలకు హితవు చెప్పారు.

## మాజీ సిఐ నాగరాజు కస్టడీ పిటీషన్‌పై ముగిసిన వాదనలు... నేడు ఉత్తర్వులకై వాయిదా

**విజయవాడ కార్పొరేషన్, జూన్ 30 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కల్గించిన గాదె సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ సిఐ నాగరాజు కస్టడీ పిటీషన్‌పై విజయవాడ కోర్టులో మంగళవారం వాదనలు ముగిసాయి. నాగరాజును తదుపరి విచారణ నిమిత్తం 12 రోజుల పాటు తమ కస్టడీకివ్వాలంటూ సిట్ ప్రత్యేక దర్యాప్తు బృందం న్యాయస్థానంలో పిటీషన్‌ను దాఖలు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఈ పిటీషన్‌పై నిందితుడైన సిఐ నాగరాజు తరపున అతని న్యాయవాదులు సమాధానాన్ని దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం కస్టడీ పిటీషన్‌ను నేటికి ఉత్తర్వుల నిమిత్తం వాయిదా వేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.,
**ఆర్‌ఎంపి డాక్టర్ విచారణ:** గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులో అతను కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో గాయాలపాలైనప్పుడు ఓ ఆర్‌ఎంపి డాక్టర్‌తో వైద్యం చేయించారు. అతనిని మంగళవారం సిట్ బృందం విచారించినట్లు తెలియవచ్చింది.సాయికృష్ణకు వైద్యం ఎక్కడ చేయించారు,
కృష్ణలంక పోలీస్‌స్టేషన్ లోనా ప్రైవేటు హోటల్ లోనా అనే విషయంతో పాటు సదరు ఆర్‌ఎంపి డాక్టర్‌ను ఎవరు పిలిపించారు అనే విషయంపై కూడ సదరు డాక్టర్‌ను సిట్ బృందం విచారించినట్లు సమాచారం.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)
Rayapudi, Thullur Mandal, Amaravati-522237 (A.P.)
NIT No: 02/MAU61-USI0HB(OTH)/93/2026-HB/3rd call Dt.: 29-06-2026
E PROCUREMENT TENDER NOTICE (Third Call)
Name of Work: "Engaging of Technical persons for Carpenters, Plumbers, Operators for Operation & Maintenance of Secretariat Buildings: 1 to 6 and WTP & STP at AP Secretariat, IGC, Velagapudi for 24 Months" - Estimate Cost Rs.1,44,00,000/-. The bid can be downloaded on AP e-procurement portal from 01.07.2026 to 08.07.2026 up to 14.00 Hrs. Due date for submission of Bid 08.07.2026 up to 15.00 Hrs., Technical bid opening 08.07.2026 @16.00 Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in
Sd/- Commissioner, APCRDA, Rayapudi

వార్త

అభిప్రాయాలు ఎప్పుడూ మార్చుకోని వ్యక్తి నిల్వ నీటితో సమానం. నిల్వ నీటిలో ఎన్నో జీవులు పెరుగుతాయి.

- బెంజిమెన్ ఫ్రాంక్లిన్

# విద్యా ప్రయాణానికి డిజిటల్ చిరునామా

*ఏ సాంకేతికత అయినా విజయవంతం కావాలంటే కేవలం సౌకర్యం మాత్రమే సరిపోదు, వ్యవస్థపై ప్రజల్లో ఉండే నమ్మకం విశ్వసనీయతే కీలకమని గుర్తించాలి. గతంలో విద్యార్థి తన విద్యా ప్రయాణానికి సాక్ష్యంగా సర్టిఫికెట్ల సంచిని మోస్తూ కనిపించేవాడు, కానీ రేపటి రోజున అతని సమగ్ర విద్యా చరిత్ర కేవలం ఒకే ఒక్క డిజిటల్ గుర్తింపులో సురక్షితం కాబోతోంది. ఆధార్ ఏ విధంగానైతే భారత పౌరుడి వ్యక్తిగత గుర్తింపులో విప్లవాత్మక మార్పులు తెచ్చిందో, అదే రీతిలో 'అపార్' భారతీయ విద్యార్థి అకడమిక్ అస్తిత్వాన్ని పునర్నిర్వచించనుంది. ఈ వ్యవస్థ విజయవంతమైతే, మన విద్యావ్యవస్థ కేవలం సర్టిఫికెట్ల సేకరణ నుండి విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి పెద్దపీట వేసే 'అభ్యాసక కేంద్రిత పర్యావరణ వ్యవస్థ'గా రూపాంతరం చెందుతుంది. వికసిత భారత్ లక్ష్య సాధనలో, డిజిటల్ ఇండియా నిర్మాణంలో విద్యారంగానికి ఇది ఒక చారిత్రాత్మక మైలురాయి.*



ఆచార్య దారపురెడ్డి సూర్యచంద్ర రావు

భారతదేశ విద్యా రంగం ప్రస్తుతం ఒక అప్రకటిత డిజిటల్ విప్లవానికి వేదికైంది. ఒకప్పుడు విద్యార్థులు తమ మార్కుల మెమోలు, బదిలీ, ప్రవర్తన్న, మైగ్రేషన్ డిగ్రీ సర్టిఫికెట్లవంటి అమూల్యమైన పత్రాలను భౌతికంగా భద్రపరుచుకోవడానికి ఎంతో ప్రయాస పడాల్సి వచ్చేది. అవి ఏమాత్రం దెబ్బ తిన్నా లేదా పోగొట్టుకున్నా, తిరిగి పొందడం ఒక ప్రహసనంగా ఉండేది. అయితే, సాంకేతికత అందిపుచ్చుకుంటున్న నేటి తరుణంలో, విద్యార్థి అకడమిక్ ప్రస్థానమంతా ఒకే డిజిటల్ గుర్తింపుతో ముడిపడే నూతన శకం ఆరంభమైంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రరి) 'ఒక దేశం ఒకే విద్యార్థి గుర్తింపు' అనే నినాదంతో రూపుదిద్దుకున్న ఈ విధానం, ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్య, వృత్తి నైపుణ్య శిక్షణ వరకు విద్యార్థి సాధించిన ప్రతి విజయానికి ఒక సురక్షితమైన డిజిటల్ చిరునామాగా నిలవబోతోంది. ప్రపంచంలోనే అతి పెద్ద విద్యా వ్యవస్థల్లో ఒకటిగా ఉన్న భారతదేశం, గణాంకాల పరంగా అపారమైన విస్తృతిని కలిగి ఉంది. యుడిఐఎస్ఇ 2023-24 నివేదిక ప్రకారం, దేశవ్యాప్తంగా సుమారు 14.89 లక్షల పాఠశాలలు, 26.5కోట్లకు పైగా విద్యార్థులు, 95 లక్షల మంది ఉపాధ్యాయులు ఈ వ్యవస్థలో భాగస్వాములుగా ఉన్నారు. ఉన్నత విద్యారంగంలోనూ ఎఐఎస్‌హెచ్ఇ 2023గణాంకాల మేరకు 4.33కోట్ల మంది విద్యార్థులు, 1,168 విశ్వవిద్యాలయాలు, 45 వేలకు పైగా కళాశాలలు విస్తరించి ఉన్నాయి. ఇంతటి భారీ వ్యవస్థలో విద్యార్థుల రికార్డులు వేర్వేరు సంస్థల వద్ద విడివిడిగా ఉండటం వల్ల అనేక పరిపాలనాపరమైన చిక్కులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా నకిలీ ధ్రువపత్రాల బెడద, విద్యా చరిత్ర ధృవీకరణలో జాప్యం, విద్యాసంస్థల మార్పు సమయంలో రికార్డుల బదిలీలో ఇబ్బందులు, చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థులు తిరిగి చేరడంలో ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలు విద్యా ప్రగతికి ఆటంకంగా మారాయి. ఈ క్లిష్టతరమైన సవాళ్లను పరిష్కరించి, విద్యార్థి ప్రయోజనాలే పరమావధిగా సాగేలా జాతీయ విద్యా విధానం 2020 ఒక సమగ్రమైన డిజిటల్ విద్యా నిర్మాణాన్ని ప్రతిపాదించింది. అపార్ అనేది ప్రతి విద్యార్థికి కేటాయించే 12 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య. ఇది కేవలం ఒక అంకె మాత్రమే కాదు, విద్యార్థి అకడమిక్ ప్రస్థానానికి జీవితాంతం తోడ్పడే ఒక 'డిజిటల్ అకాడమిక్ పాస్‌పోర్ట్'. విద్యార్థి ప్రవేశ వివరాలు, హాజరు, పరీక్షా ఫలితాల నుంచి మొదలుకొని స్కాలర్‌షిప్లు, డిగ్రీలు, డిప్లొమాలు నైపుణ్య ధ్రువపత్రాల వరకు అన్నింటినీ ఇది ఒకే వేదికపైకి తెస్తుంది. అంతేకాకుండా, క్రీడలు, ఎన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్ వంటి సహపాఠ్య కార్యక్రమాల్లో సాధించిన విజయాలు, మెడల్స్ కూడా ఈ డిజిటల్ ఖాతాలో నిక్షిప్తమవుతాయి. తద్వారా విద్యార్థి సమగ్ర విద్యా చరిత్ర ఎప్పుడైనా, ఎక్కడి నుంచైనా సులభంగా అందుబాటులో ఉంటుంది. ఈ వ్యవస్థ ప్రధానంగా అపార్ రిజిస్ట్రీ, అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్, డిజిలాకర్ వంటి మూడు కీలక డిజిటల్ వ్యవస్థల సమన్వయంతో అత్యంత పటిష్టంగా పనిచేస్తుంది. ఈ నూతన వ్యవస్థలో అత్యంత వినూత్నమైన, విప్లవాత్మకమైన అంశం 'అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్'. ఒక బ్యాంకు ఖాతాలో నగదును ఏ విధంగానైతే భద్రపరుచుకుంటామో, విద్యార్థులు తమఅభ్యాస ప్రక్రియలో ఆర్జించిన క్రెడిట్లు కూడా ఇందులో అలాగే డిజిటల్ రూపంలో నిక్షిప్తమవుతాయి. ఉదాహరణకు, ఒక విద్యార్థి డిగ్రీలో రెండు సంవత్సరాలు పూర్తి చేసి, అని





వార్య కారణాల వల్ల చదువును మధ్యలో ఆపివేసినా, అతను సంపాదించిన క్రెడిట్లు వృథా కావు. కొన్ని ఏళ్ల విరామం తర్వాత చదువు ప్రారంభించాలనుకున్నప్పుడు, అతను మొదటి నుంచి కాకుండా ఎక్కడైతే ఆపారో అక్కడి నుంచే తన విద్యా ప్రయాణాన్ని కొనసాగించవచ్చు. జాతీయ విద్యా విధానం 2020 ఆకాంక్షించిన మల్టీపుల్ ఎంట్రీ, మల్టిపుల్ ఎగ్జిట్ , క్రెడిట్ ట్రాన్స్ఫర్ వంటి అత్యాధునిక భావనలకు ఇది ఊపిరి పోస్తోంది. నిర్ణీత కాలపరిమితిలో డిగ్రీ పూర్తి చేయాలనే పాత సంప్రదాయ సంకెళ్లను తెంచుకుంటూ, విద్యార్థి తన వెసులుబాటును బట్టి నేర్చుకునే 'జీవితాంత అభ్యాస వ్యవస్థ' వైపు భారత విద్యా రంగం వడివడిగా అడుగులు వేస్తోంది. అపార్ వ్యవస్థ కేవలం విద్యార్థులకే కాకుండా, ప్రభుత్వానికి విద్యా పరిపాలనా యంత్రాంగానికి సైతం బహుముఖ ప్రయోజనాలను చేకూరుస్తుంది. నర్సరీ నుండి డాక్టరేట్ స్థాయివరకు విద్యార్థి, సమగ్ర విద్యా చరిత్రను ఒకే గొడుగు కిందకు తీసుకురావడం ద్వారా, రాష్ట్రం లేదా విశ్వవిద్యాలయం మారినా రికార్డులను తక్షణమే సరిచూసుకోవడం సాధ్యమవుతుంది. దేశంలో తరచూ కలకలం రేపుతున్న నకిలీ సర్టిఫికెట్ల ముఠాలకు అడ్డుకట్ట వేయడంలో ఇది ఒక శక్తివంతమైన ఆయుధంగా పనిచేస్తుంది. ప్రస్తుతం భారతదేశ ఉన్నత విద్యలో 'స్థూల నమోదు నిష్పత్తి' సుమారు 28.4 శాతంగానే ఉండటం ఆందోళనకరమైన విషయం. పాఠశాల లేదా కళాశాల స్థాయిలోనే పెద్ద సంఖ్యలో విద్యార్థులు విద్యా ప్రవాహం నుండి వేరుపడుతున్నారని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. ఈ తరుణంలో అపార్, ఎబిసిల సమన్వయం, విద్యా వ్యవస్థ నుండి బయటకు వెళ్లిన వారు తిరిగి తమ చదువును కొనసాగించడానికి అవసరమైన వెసులుబాటును కల్పిస్తూ, వారిని తిరిగి విద్యా స్రవంతిలోకి చేర్చడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రభుత్వ పరిపాలనా కోణంలో చూస్తే, అపార్ ఒక అత్యంత శక్తివంతమైన 'డేటా ఆర్కిటెక్చర్'గా అవతరించనుంది. విద్యార్థుల నమోదు సరళి, బడి మానేస్తున్న వారి ధోరణులు, ప్రాంతీయ అసమానతలు, లింగ వివక్ష వంటి కీలక అంశాలపై ఎప్పటికప్పుడు కచ్చితమైన గణాంకాలను ఇది అందిస్తుంది. ఈ సమాచారం అందుబాటులో ఉండటం వల్ల విధాన నిర్ణేతలు ఊహల ఆధారంగా కాకుండా, వాస్తవ గణాంకాల ఆధారంగా ఆధారిత నిర్ణయాలు తీసుకునే వీలుంటుంది. భారతదేశం వంటి సువిశాల దేశంలో విద్యా సంస్కరణలు విజయవంతం కావాలంటే, ఖచ్చితమైన డేటా ఆధారంగా ప్రణాళికలు రూపొందించడం ఒక ప్రాథమిక అవసరం. కేంద్ర ప్రభుత్వం 2023లో శ్రీకారం చుట్టిన అపార్‌అమలు ప్రక్రియ, ప్రస్తుతం పాఠశాల, ఉన్నత, వృత్తి విద్యా రంగాల్లో దశలవారీగా పురోగతి సాధిస్తోంది. ప్రభుత్వ లక్ష్యంప్రకారం 2026-27 నాటికి దేశవ్యాప్తంగా దీనిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. అయితే, ఈ బృహత్తర వ్యవస్థ ఆశించిన విజయాలను అందుకోవాలంటే కొన్ని క్లిష్టమైన సవాళ్లను అధిగమించక తప్పదు. ముఖ్యంగా కోట్లాది మంది విద్యార్థుల వ్యక్తిగత సమాచార గోప్యత, సైబర్ భద్రతను అత్యున్నత ప్రమాణాలతో కాపాడటం ప్రాధాన్యత సంతరించుకుంది. వీటితో పాటు తల్లిదండ్రులలో అవగాహన కల్పించి వారి అంగీకారాన్ని పొందడం, గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ మౌలిక సదుపాయాల కొరతను అధిగమించడం విద్యాసంస్థలను సాంకేతికంగా సంసిద్ధం చేయడం వంటి అంశాలపై దృష్టి సారించాల్సి ఉంది. అంతిమంగా, ఏ సాంకేతికత అయినా విజయవంతం కావాలంటే కేవలం సౌకర్యం మాత్రమే సరిపోదు, వ్యవస్థపై ప్రజల్లో ఉండే నమ్మకం విశ్వసనీయతే కీలకమని గుర్తించాలి. గతంలో విద్యార్థి తన విద్యా ప్రయాణానికి సాక్ష్యంగా సర్టిఫికెట్ల సంచిని మోస్తూ కనిపించేవాడు, కానీ రేపటి రోజున అతని సమగ్ర విద్యా చరిత్ర కేవలం ఒకే ఒక్క డిజిటల్ గుర్తింపులో సురక్షితం కాబోతోంది. ఆధార్ ఏ విధంగానైతే భారత పౌరుడి వ్యక్తిగత గుర్తింపులో విప్లవాత్మక మార్పులు తెచ్చిందో, అదే రీతిలో 'అపార్' భారతీయ విద్యార్థి అకడమిక్ అస్తిత్వాన్ని పునర్నిర్వచించనుంది. ఈ వ్యవస్థ విజయవంతమైతే, మన విద్యా వ్యవస్థ కేవలం సర్టిఫికెట్ల సేకరణ నుండి విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి పెద్దపీట వేసే 'అభ్యాసక కేంద్రిత పర్యావరణ వ్యవస్థ'గా రూపాంతరం చెందుతుంది. వికసిత భారత్ లక్ష్య సాధనలో, డిజిటల్ ఇండియా నిర్మాణంలో విద్యా రంగానికి ఇది ఒక చారిత్రాత్మక మైలురాయి. ●

## 'సర్' నిష్కళంకమేనా?

ఓటు హక్కు ఒకటే యువత భవిష్యత్‌ను నిర్మించుకునేందుకు ఉన్న ఏకైక ఆయుధమని నమ్ముతుంటాము. యువతే కాదు ఆలోచనా పరులు కూడా ఇలాంటి హక్కు ఉండటం కూడా అవసరం అని నమ్ముతుంటారు. 'ఓటనేది నా కూతుర్లాంటిది. అమ్ముకోను' అంటూ జనం సంబరపడిన రోజులూ ఉన్నాయి. కానీ ఓట్ల కోసం అభ్యర్థులు, పార్టీలు డబ్బులు విరజిమ్మడం ఓటు వేస్తారని డబ్బులు పంచి పెట్టడం నుంచి ఓడిన వాళ్లు తామిచ్చిన డబ్బు తిరిగి వసూలు చేసే పనిలో అకృత్యాలు.. ఇలా ప్రజాస్వామ్యంలో ధనస్వామ్యం చొరబడిన సందర్భాలు ఇప్పుడు వికటిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో 'ఓటు' దుర్వినియోగం పడ్తోందని, స్థానికంగా లేని వారికి ఓటు హక్కు నీయడం, ఆ ఓటును ఎవరో వేసేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో నకిలీ ఓట్లను తొలగించే విధానాన్ని కేంద్ర ఎన్నికల సంఘం (సర్) తెచ్చింది. ప్రక్రియను ప్రవేశ పెట్టడం ఆహ్వానించదగినదే. అయినా ఓటు హక్కుకు మోర బిగించడమే గందరగోళానికి దారితీసింది. 'సర్' ప్రక్రియ చట్టబద్ధమేనని, కానీ వాటి కోసం అవలంబించే పద్ధతుల్లో మార్పులు తెచ్చుకోవాలని ఈ దేశ అత్యున్నత ధర్మాసనం అన్ని రాజకీయ పార్టీలకు, కేంద్ర ఎన్నికల సంఘానికి హితవు చెప్పింది. 'సర్' పేరుతో అసలుసిసలు ఓటర్లను జాబితాలోంచి తీసేస్తున్నారన్న ఆరోపణలమధ్య విపక్షాలు ఎత్తుగడలు తుత్తునియలు చేశారు ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారి. అయినా ఏదో అనుమానం విపక్షాలను వెంటాడుతూనే ఉంది. బీహార్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, తదితర రాష్ట్రాల ఎన్నికలు జరిగాయి. కొన్ని చోట్ల ప్రభుత్వాలు మారడం వేరే అంశం. ఇంత ప్రక్షాళన జరిగినా కొన్ని చోట్ల అక్రమంగా తమ ఓట్లు తొలగించారన్న ఆవేదనలు ఇసిని వదల్లేదు. సాధారణ పౌరులెవరికీ 'సర్' పట్ల ఎలాంటి అసంతృప్తి లేదు. కానీ ప్రత్యేక బిఎల్ఒల ద్వారా ఎంతో జాగరూకతతో నిర్వహించిన ఈ ప్రక్రియలో ఓటు హక్కు కోల్పోయామని ఆందోళన చెందిన ఓటర్లు కూడా ఇప్పుడు ఒక్కక్కరూ బయటపడుతున్నారు. ప్రతి పథకానికి ప్రభుత్వ నిర్ణయాలకు నాణేనికి రెండువైపులా ఉంటాయి. వాటిని పాలకులు ఎప్పటికప్పుడు సరిచేయడంలోనే ఔచిత్యముంటుంది. ఎంతో విజయవంతంగా కొన్ని రాష్ట్రాల ఎన్నికలు నిర్వహించగలిగినా ఎప్పటికప్పుడు లోపభూయిష్టమైన విధానాలకు చెక్ పెట్టాల్సి ఉంది. సుప్రీంకోర్టు జోక్యానికి వెళ్లినప్పుడు వారి సూచనలను మార్పు చేసే పద్ధతి నడుస్తున్నందున అన్నిటికీ సుప్రీం ఆమోద ముద్రకు ఎదురు చూస్తున్నాయి. ఈలోగా ఓటరు హక్కుకు దిక్కులేక కొందరు అభాగ్యులు ఆకాశంలోకి చూడటమే మిగిలింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) జాబితాలో తన పేరు లేకపోతే తనను జైలుకు పంపుతారనే భయంతో తెలంగాణలోని హైదరాబాద్ నగరంలో బోరబండ ప్రాంతవాసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతనో సాధారణ కారు డ్రైవర్. ఎన్నికల సంఘ ప్రక్రియలో తన డాక్యుమెంట్లు సరిపోలడంలేదు. అదే జరిగితే తన కుటుంబం రోడ్డున పడ్తుందనే ఆవేదనతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఓటు హక్కు మీద బాధ్యత పెరిగిన చోట పర్వాలేదు. తాను ఓటు వేసే సమయం, సందర్భాన్ని సద్వినియోగ పరుచుకుంటారు. అవగాహన లేనివారు మాత్రమే ఆందోళనతో అయోమయంలో పడిపోతారు. కనుచూపుమేరలో చెప్పుకోదగిన ఎన్నికలులేని తెలంగాణలో ఓ వ్యక్తి తనువు చాలించాడంటే ఇంతకన్నా ఘోరం ఏమీ కనిపించదు. ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా ఎంతో విశ్వసనీయత కలిగి ఉండటం అవసరమే. కానీ రాజకీయ పార్టీలోనూ, ఓటర్లలోనూ గందరగోళం సందేహాలకు తావిచ్చేవిధానంలో ఇంకా కొన్నిమార్పులు చేయాల్సి ఉంది. మృతిచెందిన వారి ఓట్లు తీయాల్సిందే. శాశ్వతంగా ఒక ప్రాంతంలో నివసించే వారిఓట్లు తొలగించరాదు. కొన్ని చోట్ల తాము వెళ్లినప్పుడు అక్కడ లేరనే సాకుతో సరైన నిర్ధారణ లేకుండా తొలగించడమంటే వారి ఓటు హక్కును ప్రశ్నించడమే. ఇంటింటికీ వెళ్లి ధృవీకరణద్వారా జాబితాలో నాణ్యతను సాధించవచ్చు. ఒకటి కన్నాఎక్కువ ప్రాంతాల్లో పేర్లు నమోదై, వారు మరో చోట శాశ్వతంగా మరో చోట నివసిస్తుంటే వారి 'ఓటు హక్కు' ఆ ప్రాంతానికే మార్చాలి. దీని బాధ్యత ఓటరు కు ఎంత ఉందో, ఎన్నికలు నిర్వహించే సంఘానికి అంతేబాధ్యత ఉంటుంది. కాకతాళీయంగా కాకుండా ఉద్యమంలా చేపట్టిన 'సర్' ప్రక్రియలో లోపాలను ఎన్నికల సంఘం సవరించుకోవాలి. ఎన్నోసార్లు ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ 'సర్' ప్రక్రియలో లోపభూయిష్ట విధానాలను సవరించుకుంటే ఎన్నో లక్షలమంది తమ ఓటు హక్కును కోల్పోతారని ఇవ్వాళ్టికీ కాంగ్రెస్ పార్టీ గొంతెత్తి విమర్శిస్తూనే ఉంది. అంటే 'సర్'లో ఇంకా లోపాలున్న మాటేగా. 'సర్' పూర్తిగా చట్టబద్ధమైన పారదర్శక ప్రక్రియ అనడంలో సందేహమే లేదు. కేంద్ర ఎన్నికల సంఘం తరచు సమీక్షలు చేయడం ద్వారా ఓటర్ల గుర్తింపునకు వెసులు బాటుగా అవగాహన కల్పించడం, వారి ఓటుకు చోటు లభించేటట్లు చేయడం అత్యంతావశ్యకం. అది సందేహమే కావచ్చు కానీ విశ్వసనీయత పెంచుకోవాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘానిదే. అవగాహనలోపం వల్ల అర్హులైన ఓటర్లు కూడా తమ 'ఓటుహక్కు'కు రోడ్డెక్కడం సహించరానిది. నాలుగు రోజుల క్రితమే 'సర్' అమలుకు ఏడాది పూర్తయింది. అయినా వివాదాలు, సద్దుమణగ లేదు. కేంద్ర ఎన్నికల కమిషన్‌కు, విపక్ష పార్టీలకు మధ్య అఘాతం సృష్టించి 6 కోట్ల ఓటర్లకు 'ఓటు' దిక్కు హక్కులేని వ్యవహారాన్ని కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి సమీక్షించాలి. ఆది నుంచి ఈ ప్రక్రియపై నీలినీడలు కమ్ముకున్నందున సిఇసి 'సర్' పారదర్శకతను నిరూపించుకోవాలి.

ఆకలి రుచి ఎరుగనట్లే మనకు అత్యవసరమైన దాంట్లో తప్పులు కనిపించవు.




ఆస్కార్‌వైల్డ్

ఎప్పుడు, ఎలా చనిపోయేదీ నీవు నిర్ణయించలేవు. ఇప్పుడు ఎలా జీవించాలన్నదే నీవు నిర్ణయించగలవు.



రామకృష్ణ పరమహంస

## ప్రజావాక్కు



### పొదుపే భవిష్యత్తుకు భరోసా

ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో దేశంలోని అనేక జలాశయాలకు నీటి ప్రవాహాలు తగ్గుతున్నాయి. వర్షపాతం అనిశ్చితంగా మారడం, భూగర్భ జలాలు క్రమంగా తగ్గిపోవడం, పెరుగుతున్న నీటిఅవసరాలు భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తున్నాయి. ఈపరిస్థితుల్లో నీటి ప్రతి బొట్టును విలువైన సహజ సంపదగా భావించి పొదుపుగా వినియోగించడం అత్యవసరంగా మారింది. వ్యవసాయ రంగంలో నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచేందుకు డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మసాగు పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలి. చెరువులు, కుంటలు, కాలువలను పునరుద్ధరించి వర్షపు నీటిని నిల్వ చేసే చర్యలను వేగవంతం చేయాలి. ప్రతి గ్రామంలో వర్షపు నీటి సంరక్షణకు ప్రజల భాగస్వామ్యంతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. పట్టణాల్లో భవనాలకు వర్షపు నీటిసేకరణ వ్యవస్థలను తప్పనిసరి చేయడం కూడా అవసరం. ఇళ్లలోనూ నీటివృథాను అరికట్టడం ప్రతి పౌరుడి బాధ్యత. అవసరానికి మించి నీటిని వినియోగించకుండా పొదుపు అలవాటును పెంపొందించాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### వనరులను కాపాడుకుందాం

పాలకులు పంచుతున్న ఉచితాలు దేశ ఆర్థిక పరిస్థితిని మరింతక్రుంగదీస్తున్నాయి. అధికారంకోసం ఎవరికి తోచిన విధంగావారు ఉచితాలు ప్రకటిస్తున్నారు. ఉచిత బియ్యం, ఉచిత కరెంటు, ఉచిత బస్సు ఇలా అన్ని ఉచితాలు ఇస్తు పోతూరాష్ట్రాలు అప్పుల్లో కూరుకుపోతున్నాయి. అర్హులను ఆదుకుంటే పర్వాలేదు. కానీ, చాలా మంది అనర్హులు ఉచిత పథకాల వల్ల లబ్ధిపొందుతున్నారు. దాంతో ప్రభుత్వఖజానా ఖాళీఅవుతోంది. మన ఆర్థిక పరిస్థితిని మనమే చేతులారా నాశనం చేసుకుంటున్నాం. ఇప్పటికైనా ఈ విషయంలో ఆలోచించి నిరుపేదలకు మాత్రమే ఉచితాలు ఇస్తే బాగుంటుంది. కష్టం రాక ముందేవనరులను సమకూర్చుకోవడం, వంట ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి.

- కె. నాగేంద్ర, హైదరాబాద్

### సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త

వర్షాకాల సందర్భంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఆరోగ్యం పట్ల తగినంత శ్రద్ధ వహించాలి. వర్షాకాల ప్రభావం వలన తీవ్రమైన వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వీలైనంత వరకు ఇంట్లో నుండి బయటికి వెళ్లకపోవడమే మంచిదని అధికారులు సూచిస్తున్నారు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### దొంగ బాబాలను శిక్షించాలి

కల్తీ మందులు, కల్తీసరుకులు అమ్మినందుకు సుప్రీంకోర్టు రాందేవ్ బాబాకు అరెస్ట్‌వారెంట్లు చాలాసార్లు ఇచ్చింది. క్షమాపణలు చెప్పి తప్పించుకున్నాడు. చాలా రాష్ట్రాలు రాందేవ్ బాబా కల్తీ మందులను, కల్తీ సరుకులను నిషేధించాయి. అలాంటి కల్తీ బాబాకు విజయనగరంలో మందులు తయారుకు ప్రభుత్వ భూములు ఇవ్వడం సిగ్గు చేటు. మోసగాడు అయిన రాందేవ్‌బాబాకు విజయనగరం జిల్లాలో కొత్తవలస మండలం చిన్నరావులపల్లి గ్రామంలో 70 ఎకరాలు సాంక్షన్ చేసిన జీవో నంబర్ 131 తక్షణమే రద్దు చేయాలి. బాబాలందరూ దొంగలే. ప్రభుత్వం ఈరోజు దొంగబాబాలను పెంచి పోషిస్తుంది. కాషాయ గుడ్డలు వేసుకొని, ముఖాన బూడిద పూసుకుని, మెడలో రుద్రాక్షలు వేసుకొని కనిపిస్తే వాడిని తన్ని తరిమెయ్యక, అవతారమూర్తి లాగా నాయకులు సాష్టాంగపడటం, శాలువాలు కప్పడం, ఇలా భూములు ఇవ్వడం, నాయకుల దివాలాకోరు తనానికి చిహ్నం. మీ సొంత భూములు ఇవ్వండి. ప్రజల భూములను ఇలాంటి దొంగలకు ఇవ్వటానికి కాదుమిమ్మల్ని ఎన్నుకుంది, ప్రజలఆస్తులను రక్షించటానికి. బాబాల బతుకేమిటో ప్రజలకు తెలుసు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### రోడ్లపై రేకుల షెడ్లు తొలగించాలి

మండల కేంద్రాలలో ఇరుకుగా ఉండే రోడ్లపై కొందరు ఇంటి యజమానులు బైకులు పెట్టుకోవడానికి గాను రేకుల షెడ్లు నిర్మించడంవలనప్రజలకు రేకులషెడ్లు తలలకు తలిగి గాయాలు అవుతున్నాయి. రాత్రిపూట మరీ విపరీతంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. కనుక ప్రభుత్వం రెవెన్యూ శాఖ, పంచాయతీరాజ్‌శాఖ, గ్రామపంచాయతీ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలోపర్యటించి రేకుల షెడ్లుతొలగించాలి. ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేసి వారం రోజులలో తొలగించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### పెరుగుతున్న వృద్ధుల సంఖ్య

ఈమధ్య దేశం మొత్తం మీద వయోవృద్ధుల సంఖ్య, యువకుల కంటే ఎక్కువ ఉన్నట్లుతెలిసింది. అదిసహజం, వాస్తవం కూడా. యువకుల సంఖ్య బలం ఎక్కువగా ఉన్నప్పుడే మానవవనరులు కాస్త ఎక్కువపొందొచ్చు. ఇది ఆయా పరిస్థితుల్లో వారి ఆరోగ్యాలు, సామాజిక స్తితి, అనుకూల ధోరణి ప్రధానం. పెడత్రోవ ధోరణులు అతిగా పెరిగి వ్యక్తివినాశనం జరుగుతున్నది. ప్రభుత్వం యువకులకు తప్పక ఉపాధి కల్పించాలి.

-బి. మేఘానాదం, విశాఖపట్నం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# వర్షపు నీటిని ఒడిసిపడితేనే జీవకోటికి భద్రత

డాక్టర్. వై. సంజీవ కుమార్

ప్రకృతి మనకు అందించిన అమూల్యమైన వరాలలో నీరు అత్యంత ముఖ్యమైనది. నీరు లేకుండా జీవం లేదు. మానవులు, జంతువులు, పక్షులు, మొక్కలు ఇలా సమస్త జీవకోటి మనుగడకు నీరే ఆధారం. అయితే నేడు ప్రపంచవ్యాప్తంగా తాగునీటి కొరత, భూగర్భ జలాల తగ్గుదల, వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు వంటి సమస్యలు మానవాళిని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం చేయగలిగే అత్యంత సులభమైన, సమర్థవంతమైన పని వర్షపు నీటిని ఒడిసిపట్టడం. ప్రస్తుతం పట్టణాలు, గ్రామాలు అనే తేడాలేకుండా వర్షపు నీరు ఎక్కువగా కాలువల ద్వారా వృథాగా నదులు, సముద్రాలలో కలిసిపోతోంది. ఈనీటిని భూమిలోకి ఇంకే విధంగా చర్యలు తీసుకుంటే భూగర్భ జలాలు పెరుగుతాయి. ప్రతి సంవత్సరం వర్షపాతం తగ్గడం, అసమానంగా కురవడం, అటవీ నిర్మూలన, అధికంగా బోర్లు వేయడం వంటి కారణాలవల్ల భూగర్భ జలాల మట్టాలు క్రమంగా పడిపోతున్నాయి. ఈపరిస్థితిని మార్చాలంటే వర్షపు నీటిని భూమిలోకి చేరేలా చేయడం అత్యవసరం. వర్షపు నీటిని సంరక్షించడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయి. బావులు, బోర్లు ఎండిపోకుండా ఉంటాయి. తాగునీటి సమస్య తగ్గుతుంది. వ్యవసాయానికి అవసరమైన నీరు అందుబాటులోఉంటుంది. పర్యావరణ సమతుల్యత మెరుగుపడుతుంది. వర్షపు నీటిని భూమిలోకి చేర్చడానికి ఇంకుడు గుంతలు అత్యంత ఉపయోగకరమైనవి. ఇళ్లలో, అపార్ట్‌మెంట్లలో, పాఠశాలల్లో, కార్యాలయాల్లో, పార్కుల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తే పైకప్పులపై పడే వర్షపు నీరు నేరుగా భూమిలోకి చేరుతుంది. దీని వల్ల భూగర్భజలాలు పెరిగి సమీప ప్రాంతాల్లోని బోర్లలో నీటి నిల్వలు మెరుగుపడతాయి. ప్రతిపౌరుడు తన ఇంటి వద్ద ఒక ఇంకుడు గుంత ఏర్పాటు చేస్తే మరింతమెరుగైన ఫలితాలు సాధించవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు చెరువులు, కుంటలు, బావులు నీటి నిల్వలకు ప్రధాన ఆధారంగా ఉండేవి. ప్రస్తుతం అనేక చెరువులు పూడికతో నిండిపోవడం, ఆక్రమణలకు గురికావడం వల్ల వాటి నీటి నిల్వసామర్థ్యం తగ్గిపోయింది. వర్షాకాలానికి ముందు చెరువులను శుభ్రపరచి, పూడికతొలగించి, నీటినిల్వసామర్థ్యాన్ని పెంచితే భారీగా వర్షపు నీటిని నిల్వ చేసుకోవచ్చు. అలాగే పొలాల్లో చిన్నచిన్న గుంతలు, కందకాలు ఏర్పాటు చేయడం ద్వారా వర్షపు నీరు పొలంలోనే నిలిచి భూమిలోకి ఇంకే అవకాశం ఉంటుంది. వర్షాకాలంలో నాటిన మొక్కలు సులభంగా భూమిలో స్థిరపడతాయి. మొక్కలు పెరిగి చెట్లుగా మారినప్పుడు వాతావరణంలో తేమను పెంచి వర్షాలను ఆకర్షించడంలో కీలక పాత్రపోషిస్తాయి. రైతులు పొలాల్లో వర్షపు నీటిని నిల్వచేసుకునే పద్ధతులను అనుసరించాలి. కాంటూర్ బండ్లు, ఫార్మ్ పాండ్లు, చెక్‌డ్యామ్‌లు, నీటి నిల్వ గుంతలు ఏర్పాటు చేయడం ద్వారా వర్షపు నీటిని నిల్వచేయవచ్చు. దీనివల్ల భూగర్భజలాలు పెరిగి పంటలకు అవసరమైన నీరు అందుతుంది. వ్యవసాయ ఉత్పత్తికూడా మెరుగుపడుతుంది. వర్షాకాలంలో కురిసే ప్రతి నీటి బొట్టు అమూల్యమైన సంపద నీటిని కాపాడితేనే భవిష్యత్తు తరాలకు ప్రకృతిసంపాదనకు అందించినట్టే, వర్షపునీటిని ఒడిసి పట్టుదాం నీటిభద్రతతో కూడిన భవిష్యత్తును నిర్మిద్దాం. ●

# యుద్ధాల్లో అమెరికా గెలిచినదెప్పుడు?



సరికొండ రవీంద్రనాథ్

ప్రపంచాన్ని శాసిస్తున్నది మేమే అని అమెరికా గొప్పలు చెప్పుకుంటుంది. కానీ అవమానాలతోవెనుతిరగడమేగాని ప్రపంచ చరిత్రలో అమెరికా గెలిచిన యుద్ధం ఏదీలేదు. ఇరాన్ నుంచి కువైట్‌ను విముక్తి చేసి అక్కడ తమ కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా దాన్ని గెలుపు కింద ప్రపంచం పరిగణించడం లేదు. 1945లో రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత నేనే సూపర్ పవర్ అంటూ అనేక దేశాల ప్రభుత్వాల వ్యవహారాల్లో అమెరికా జోక్యం చేసుకుంది. ఆరు భారీ యుద్ధాల్లో అమెరికా ప్రత్యక్షంగా పాల్గొన్నది. సుమారు పదిహేను దేశాల్లో కుట్రలు, కుతంత్రాల ద్వారానే ప్రభుత్వాలను అమెరికా పడదోసి నేతలను మార్చింది. ఇప్పుడు గల్ఫ్ యుద్ధం నుంచి బైట పడటానికి ఇరాన్ పెట్టిన షరతులను అన్నింటిని అమెరికా ఆమోదిస్తూ సంతకాలు చేసింది. ఇది అమెరికా పరాజయంగానేప్రపంచం భావిస్తోంది. వియత్నాం, కొరియా, గల్ఫ్, ఇరాక్, అఫ్గానిస్థాన్, ఇరాన్ యుద్ధాల్లో అమెరికా ప్రత్యక్షంగా పాల్గొంది. వియత్నాం యుద్ధం అమెరికాకు అత్యంత అవమానాన్ని, నష్టాన్ని మిగిల్చింది. కమ్యూనిస్టు దేశాలైన రష్యా, చైనా ప్రాబల్యాన్ని అరికట్టడానికి అమెరికా ఈ యుద్ధం చేసింది. ఆగ్నేయాసియాలో 1955 నుంచి 75వరకు ఇరవై సంవత్సరాలు ఈ యుద్ధం కొనసాగింది. అమెరికాకు చెందిన 59 వేల మంది సైనికులు మృతి చెందగా లక్షా యాభై నాలుగు వేల మంది గాయపడ్డారు. హెచిమిన్ నాయకత్వంలో జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో వియత్నాం సైనికులు, ప్రజలు సుమారు 20లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. వియత్నాంపై గెలవలేమని నిర్ణయించుకుని అమెరికా తమ సైన్యాన్ని అవమానకరమైన రీతిలో ఉపసంహరించుకుంది. యుద్ధానికి ముందు రెండుగా ఉన్న వియత్నాం యుద్ధం తర్వాత కమ్యూనిస్టు దేశంగా ఏకమైపోయింది. ఇది అమెరికా తట్టుకోలేని మరో విషాదం. కొరియా యుద్ధం కూడా వియత్నాం యుద్ధం లాంటిదే. 1950-53 మధ్య జరిగిన ఈ యుద్ధంలో అమెరికా కన్నులొట్టబోయి బైటపడింది. జపాన్ నుంచి దక్కిన దక్షిణ కొరియాను మాత్రం కాపాడుకోగలిగింది. ఈ యుద్ధంలో 37వేల మంది అమెరికా సైనికులు చనిపోయారు. లక్షమంది గాయపడ్డారు. ఇప్పటికీ ఉత్తర కొరియా అమెరికాను అణ్వాయుధాలతో ఆడిస్తూనే ఉంది. దురదృష్టం ఏంటంటే ఈ యుద్ధంలో అపారమైన ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఇప్పటికీ రెండు కొరియాల మధ్య సరిహద్దు వివాదం కొనసాగుతూనే ఉంది. 1990నుంచి ఏడాది పాటు జరిగిన గల్ఫ్ యుద్ధంలో 294మంది అమెరికా సైనికులు చనిపోయారు. సుమారుగా ఉత్తరాంధ్ర వైశాల్యంగల కువైట్‌ను చమురు కోసం ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ ఆక్రమించాడు. అమెరికా దాడి చేసి కువైట్‌ను విడిపించింది. సుమారు 140 బిలియన్ డాలర్లు అమెరికాకు ఖర్చయింది. ఈఖర్చులో ఎక్కువ భాగం ఫ్రాన్స్, బ్రిటన్‌తో సహా అరబ్ మిత్ర దేశాలు భరించాయి. అఫ్ఘానిస్థాన్‌లో అమెరికాకు జరిగిన నష్టం అపారమైనది. దేశంలో విలువైన మినరల్స్ తవ్వి తెచ్చుకోవాలని అమెరికా వెళ్లింది. తీవ్రవాదుల తుపాకుల మోతల మధ్య రాళ్లు కూడా తెచ్చుకోలేమని అర్థమైంది. అవమానకరమైన రీతిలో తిరుగుముఖం పట్టింది. 2001 నుంచి 21వరకు ఇరవై సంవత్సరాల సుదీర్ఘకాలం జరిగిన యుద్ధంలో 7,200 మంది సైనికులు చనిపోయారు. 53వేలమంది గాయపడ్డారు. సుమారు మూడు ట్రిలియన్ డాలర్లువ్యయం చేయాల్సి వచ్చింది. ఈ ఖర్చు చివరికి ఐదు ట్రిలియన్లకు చేరుకుంది. ఇది రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికాపెట్టిన ఖర్చుతో సమానం. ఈ యుద్ధం ఆపేయాలంటూ అమెరికా ప్రజలు వీధుల్లోకి వచ్చిన తర్వాతనే అమెరికా ప్రభుత్వం తమ సేనలను ఉపసంహరించుకుంది. అమెరికా పెంచి పోషించిన తీవ్రవాద సంస్థ అల్ ఖైదా బలహీనపడింది. ఒసామా బిన్‌లాడెన్ చనిపోయాడు. కానీ 2021లో తాలిబన్‌లు తిరిగి అధికారాన్ని చేజిక్కించుకున్నారు. అదీ అవమానం రసాయన ఆయుధాలు ఉన్నాయంటూ ఇరాక్ పై అమెరికా దాడిచేసింది. 2003-11 మధ్య జరిగిన యుద్ధంలో అమెరికా సైనికులు 4 వేల 431 మంది చనిపోయారు. 32 వేల మంది గాయపడ్డారు. 1.5 ట్రిలియన్ డాలర్లు ఖర్చయింది. చివరగా తేల్చిందేమిటంటే ఇరాక్ నుంచి ఆశించిన చమురు రాకపోగా అమెరికాకు రెండు ట్రిలియన్ల వరకూ చేతి చమురు వదిలింది. అమెరికాకు యుద్ధం ఖర్చుల కింద 300బిలియన్ డాలర్లు ఇరాక్ చెల్లించాలని ఐక్యరాజ్య సమితిలో తీర్మానం చేయించారు. కానీ ఖర్చులో డాలర్ కూడా అమెరికాకు తిరిగి రాలేదు. అమెరికా ఇంటెలిజెన్స్ సంస్థ సిఐఎ కుట్రలు, కుతంత్రాలతో సుమారు పదిహేను దేశాల్లో ప్రభుత్వాలను కూలదోస్తారు. తర్వాత తమకు అనుకూలమైన నియంతలను ప్రభుత్వాల్లో నియమించుకున్నారు. ఇలా పరోక్షంగాచేసిన యుద్ధాల్లో క్యూబా క్షిపణుల సంక్షోభం ప్రధానమైంది. ఇది దాదాపు యుద్ధమే. కానీ క్యూబా నాయకుడు, సోషలిస్టు నేత ఫిడెల్ కాస్ట్రోను అధికారం నుంచి తొలగించలేకపోయారు. కాస్ట్రోను హత్య చేయడానికి సిఐఎ సుమారు ముప్పయిసార్లు హత్యాయత్నాలు చేసింది. ఇండోనేషియాలో సుకర్ణో, ఇరాన్‌లో మహమ్మద్ మొసాద్, అఫ్ఘానిస్థాన్‌లో నజీబుల్లా కుట్రల ద్వారా అమెరికా తొలగించిన దేశాధ్యక్షుల జాబితాలో ఉన్నారు. ఈ క్రమంలో కొందరు అధినేతలను అమెరికా కిరాతకంగా హత్య చేయించింది. లిబియా అధ్యక్షుడు గడాఫీని వీధుల్లో పరుగెత్తించి కుక్కను కొట్టినట్టు రాళ్లతో కొట్టి చంపారు. అఫ్ఘానిస్థాన్ అధ్యక్షుడు ముహ్మద్ నజీబుల్లాను నడివీధిలో ట్రాఫిక్ సిగ్నల్‌కు కట్టి ఉరి తీసారు. ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌ను విచారణ పేరుతో ఉరితీసారు. చిలీలో సాల్వడార్ అలెండీ ప్రభుత్వాన్ని కూలదోసి చంపేసారు. ఇటీవల వెనెజులాఅధ్యక్షుడు మదురోను అరెస్టుచేసి తీసుకువచ్చారు. అమెరికా గూఢాచారి సంస్థ సిఐఎ ప్రపంచ వ్యాప్తంగా జరుపుతున్న హింసాత్మక కుట్రల్లో ఇవి కొన్ని మాత్రమే. భారతదేశాన్ని కూడా విడదీయడానికి సిఐఎ కుట్రలున్నాయి. కాశ్మీర్ విభజనకు జెకెఎల్‌ఎఫ్, అస్సాం దేశం కోసం యుఎల్‌ఎఫ్ఎ, తమిళనాడు, శ్రీలంక తమిళ ప్రాంతాలతో ప్రత్యేక దేశం ఏర్పాటుకు ఎల్.టి.టి.ఇ. టియుఎల్ఎఫ్ లాంటి సంస్థలు ఏడు ఏర్పాటు చేసారు. అన్నీ నాలుగు అక్షరాలే. మాజీ ప్రధాని ఇందిర ముందు సిఐఎ ఆటలు సాగలేదు. తెరచాటు కుట్రలతో పెత్తనం చేయడం తప్ప ప్రత్యక్ష యుద్ధంలో గెలిచిన చరిత్ర అమెరికాకు లేదు. ఇప్పుడు గల్ఫ్ యుద్ధం నుంచి అమెరికా ఎలా బైటపడుతుందో చూడాలి. ●



# భారత్ షేరునే కొనుగోలుచేస్తా

## అమెరికా సెనేటర్ స్టీవ్ డైన్స్ ప్రశంసలు



**వాషింగ్టన్,జూన్ 30:** దేశాలను స్టాక్ మార్కెట్లో షేర్లలా చూస్తే, తాను కచ్చితంగా భారత్ షేరునే కొనుగోలు చేస్తానంటూ అమెరికాకు చెందిన రిపబ్లికన్ సెనేటర్ స్టీవ్ డైన్స్ భారత్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో భారత్ వేగంగా ఎదుగుతోందని, అమెరికాతో ఆ దేశ సంబంధాలు అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. వాషింగ్టన్ డీసీలో జరుగుతున్న యూఎస్ఇండియా స్ట్రాటజిక్ పార్ట్నర్‌షిప్ ఫోరమ్ (యూఎస్ఐఎస్‌పీఎఫ్) సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పార్టీ అయిన రిపబ్లికన్ పార్టీ సెనేట్ ఎన్నికల ప్రచార విభాగానికి స్టీవ్ డైన్స్ అధిపతిగా ఉన్నారు. దీంతో ఆయన ట్రంప్ పార్టీ నాయకత్వానికి అత్యంత సన్నిహితుడిగా, రాజకీయంగా కీలక వ్యక్తిగా గుర్తింపు పొందారు. భారత్ ఆర్థిక వృద్ధిని ఉటంకిస్తూ ఆయన తన ప్రశంసలకు కారణాలను వివరించారు. జిడిపి దృష్ట్యా చూస్తే ప్రపంచంలోని టాప్ 20 ఆర్థిక వ్యవస్థలలో భారత్ ఐదో స్థానంలో ఉంది. త్వరలోనే జపాన్‌ను అధిగమించి నాలుగో స్థానానికి చేరుకోనుంది. ఈ టాప్ 20 దేశాలలో ఈ ఏడాది, వచ్చే యేడాది కూడా అత్యధిక జిడిపి వృద్ధి రేటును నమోదు చేయబోయేది భారతే. అందుకే భారత్ ఎదుగుదల స్పష్టంగా కనిపిస్తోందని డైన్స్ పేర్కొన్నారు.

ఇదే సదస్సులో మరో సందర్భంలో మాట్లాడిన డెమోక్రాటిక్ పార్టీకి చెందిన భారత సంతతి నేత రో ఖన్నా మాత్రం ఇందుకు పూర్తి భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత 30 యేళ్లలో భారత్ అమెరికా సంబంధాలు అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయాయని ఆయన ఆరోపించారు. ఇరాన్‌తో యుద్ధానికి దిగాలన్న ట్రంప్ విధానాలు పూర్తిగా విధ్వంసకరమైనవి. ఆ ప్రభావంతో భారత్‌లో గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. నమ్మకం లేకపోతే భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌ను అడగండని ఉటంకిస్తూ రో ఖన్నా అన్నారు. ఒకవైపు డైన్స్ భారత్‌ను నమ్మకమైన భాగస్వామి అని, ప్రధాని నరేంద్ర మోడీతో సంబంధాలను బలోపేతం చేయడానికి ట్రంప్ కట్టుబడి ఉన్నారని చెబుతున్నప్పటికీ, ట్రంప్ ప్రభుత్వ చర్యలు మాత్రం అందుకు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. గత ఏడాది భారత్ నుంచి దిగుమతయ్యే వస్తువులపై ట్రంప్ ప్రభుత్వం 50 శాతం వరకు సుంకాలు విధించింది. ఈ సుంకాల వల్ల 2025 ఆర్థిక సంవత్సరంలో భారత జిఇపి వృద్ధికి ఒక శాతం వరకు గండి పడవచ్చని ఆర్థికవేత్తలు అప్పట్లో అంచనా వేశారు. ప్రస్తుతం ఈ సుంకాలు 18 శాతానికి తగ్గినా, ఇతర ఆసియా దేశాలతో పోలిస్తే ఇది ఇంకా ఎక్కువే. అమెరికాకు భారతీయ విద్యార్థులు, నైపుణ్యం ఉన్న ఉద్యోగులు అవసరమని డైన్స్ చెబుతున్నప్పటికీ, ట్రంప్ ప్రభుత్వం మాత్రం విద్యార్థి వీసాలు, హెచ్1బీ వర్క్ పర్మిట్లపై కఠిన నిబంధనలు విధించింది. ఫారిన్ స్టూడెంట్స్ కోసం ఉద్దేశించిన ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్‌ను తొలగించడం, హెచ్1బీ వీసా దరఖాస్తు రుసుమును ఒక లక్ష డాలర్లకు పెంచడం వంటి చర్యలు భారత విద్యార్థులు, నిపుణులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

భారతీయ అమెరికన్లపై పెరుగుతున్న ద్వేషపూరిత దాడుల గురించి ప్రశ్నించగా, ద్వేషం ఏ రూపంలో ఉన్నా దానిని ఎదుర్కోవాలి. ఇక్కడ భారతీయ అమెరికన్లు చాలా సురక్షితంగానే ఉన్నారని డైన్స్ సమాధానమిచ్చారు. ఎఫ్‌బీఐ డేటాను విశ్లేషిస్తూ ఈ యేడాది ఏప్రిల్‌లో 2015 నుంచి 2025 మధ్య ఆసియన్లపై ద్వేషపూరిత నేరాలు 195 శాతం పెరిగాయని తేలింది.



## 'సర్'పై విపక్షాల అభ్యంతరం

### సిజెఐకి 23 రాజకీయ పార్టీల లేఖ

### ఎన్నికల సంఘం తీరుపైనా ప్రస్తావన

**న్యూఢిల్లీ, జూన్ 30:** భారత ఎన్నికల సంఘం చేపట్టిన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (ఎస్ఐఆర్) ప్రక్రియ, ఎన్నికల ప్రక్రియ విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ అంశాలపై భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ సూర్యకాంత్‌కు 23 రాజకీయ పార్టీలు, ఒక స్వతంత్ర ఎంపి ఉమ్మడిగా లేఖ రాశాయి. ఈ విషయాన్ని మంగళవారం కాంగ్రెస్ ఎంపి జైరాం రమేష్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. "జూన్ 8న జరిగిన 'ఇండియా' కూటమి సమావేశానికి 21 రాజకీయ పార్టీలు, ఒక స్వతంత్ర అభ్యర్థి హాజరయ్యారు. ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియ, ఇతర ఎన్నికల సంబంధిత అంశాలపై భారత ప్రధాన న్యాయమూర్తికి ఉమ్మడి లేఖ రాయాలని ఆ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం మరో రెండు పార్టీలు మద్దతు తెలపడంతో మొత్తం 23 పార్టీలు ఈ లేఖపై సంతకం చేశాయి. ప్రతిపక్ష పార్టీలు సంఘీభావం, ఐక్యత, ప్రతిఘటన అనే సూత్రంపై దృఢంగా నిలిచి ఉన్నాయి. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ, ఎన్నికల పారదర్శకత కోసం కలిసి పోరాడతామని స్పష్టం చేశార్లు" అని జైరాం రమేష్ పేర్కొన్నారు.

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వల్ల కోట్లాది మంది ఓటు హక్కులు ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఇండియా కూటమి ఆందోళన వ్యక్తం చేసింది. సరైన ధ్రువీకరణ లేకుండా పేర్లు తొలగించే పరిస్థితులు తలెత్తితే ప్రజాస్వామ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొంది. అలాగే ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, స్వతంత్రత కొనసాగాలని, ఎన్నికల సంఘం తీసుకునే చర్యలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయకుండా ఉండాలని లేఖలో ప్రస్తావించినట్లు సమాచారం.



## కొత్త ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్

### - బాధ్యతలు స్వీకరణ

**న్యూఢిల్లీ, జూన్ 30:** దేశానికి నాలుగు దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ చేసిన జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానంలో జనరల్ ధీరజ్ సేథ్ ఈ రోజు 31వ ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. జనరల్ సేథ్ పుణెలోని ఖడక్‌వాస్లాలో ఉన్న జాతీయ రక్షణ అకాడమీ పూర్వ విద్యార్థి. ఆయన డిసెంబర్ 1986లో ఆర్మర్డ్ కార్ప్స్‌లో నియమితులయ్యారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సాగిన తన విశిష్ట సైనిక వృత్తిలో, ఆయన కార్యాచరణ, వ్యూహాత్మక, సామర్థ్య అభివృద్ధి, సంస్థాగత రంగాలలో విస్తృతమైన అనుభవాన్ని సంపాదించారు. భారత సైన్యం పోరాట సామర్థ్యానికి, దీర్ఘకాలిక పరివర్తనకు ఆయన గణనీయంగా దోహదపడ్డారు. ఆయన కమాండ్ బాధ్యతలలో ఎడారి సెక్టార్‌లోని ఆర్మర్డ్ రెజిమెంట్, వెస్ట్రన్ థియేటర్‌లోని ఆర్మర్డ్ బ్రిగేడ్, జమ్మూ కాశ్మీర్‌లోని కౌంటర్‌ఇన్సర్జెన్సీ ఫోర్స్ ఉన్నాయి. లెఫ్టినెంట్ జనరల్‌గా, ఆయన భారత సైన్యంలోని ప్రముఖ స్ట్రైక్ ఫార్మేషన్‌లలో ఒకటైన సుదర్శన్ చక్ర కార్ప్స్‌కు కమాండ్‌గా వ్యవహరించారు. తదనంతరం ఆయన ఢిల్లీ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్‌గా పనిచేస్తూ, కీలకమైన జాతీయ, అంతర్జాతీయ సైనిక కార్యకలాపాలు, ఉత్సవ బాధ్యతలను పర్యవేక్షించారు.

## సీషెల్స్ పాలకులకు ప్రధానిమోడీ అపురూప కానుకలు



**విక్టోరియా,జూన్ 30:** ప్రధాని నరేంద్ర మోడీ తన మూడు రోజుల సీషెల్స్ పర్యటనలో ఆ దేశ ఉన్నత స్థాయి నాయకులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. భారత గొప్ప సాంస్కృతిక వారసత్వం, కళా నైపుణ్యానికి అద్దం పట్టేలా ఈ కానుకలను ఎంపిక చేశారు. రెండు దేశాల మధ్య బలమైన స్నేహ బంధాన్ని, భాగస్వామ్య విలువలను ఈ బహుమతులు ప్రతిబింబిస్తున్నాయి. సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినియేకు ప్రధాని మోడీ మురాదాబాదీ ఇత్తడి తాబేలును బహూకరించారు. ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌కు చెందిన ప్రసిద్ధ ఇత్తడి హస్తకళకు ఇది ఒక అద్భుతమైన ఉదాహరణ. అక్కడి నిపుణులైన కళాకారులు చేతితో దీనిని ఎంతో నైపుణ్యంగా రూపొందించారు. జ్ఞానం, స్థిరత్వం, దీర్ఘాయుష్షుకు తాబేలు ప్రతీక. ప్రపంచంలోనే అతిపెద్ద, ఎక్కువ కాలం జీవించే తాబేళ్లలో ఒకటైన అల్డాబ్రా జెయింట్ టార్టాయిస్‌కు సీషెల్స్ ప్రసిద్ధి. ఈ నేపథ్యంలో ఈ కానుకకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. సీషెల్స్ ప్రథమ మహిళ వెరోనిక్ హెర్మినియేకు బిద్రీవేర్ బాక్స్, మహేశ్వరి సిల్క్ శాలువాను ప్రధాని అందజేశారు. కర్ణాటకలోని బీదర్‌కు చెందిన బిద్రీవేర్ హస్తకళ చాలా ప్రత్యేకమైనది. నల్లటి లోహపు ఉపరితలంపై వెండి తీగతో చేసే సున్నితమైన నగిషీ పనితనం ఇందులో కనిపిస్తుంది. మధ్యప్రదేశ్‌లోని మహేశ్వర్‌కు చెందిన మహేశ్వరి సిల్క్ శాలువా తేలికైన బరువు, నాణ్యమైన పట్టు, కాటన్ నూలుతో చేసిన నేతకు ప్రసిద్ధి. సీషెల్స్ ఉపాధ్యక్షుడు సెబాస్టియన్ పిళ్లేకు సిక్కింకు చెందిన ఆర్కిడ్ పెయింటింగ్‌ను, ఆయన అర్ధాంగి లీనా పిళ్లేకు కంచివరం పట్టు నెమలిపై సీషెల్స్ జాతీయ పుష్పం ఆర్కిడ్‌ను అందంగా చిత్రించారు. ఇది ప్రకృతి పట్ల, పర్యావరణ పరిరక్షణ పట్ల రెండు దేశాలకు ఉన్న నిబద్ధతకు నిదర్శనం. తమిళనాడులోని కాంచీపురానికి చెందిన కంచి పట్టు తన నాణ్యత, మన్నిక, బంగారు జరీ పనితనానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. సీషెల్స్ నేషనల్ అసెంబ్లీ స్పీకర్ అజారెల్ ఎర్నెస్టాకు తమిళనాడులోని నీలగిరి కొండల్లో నివసించే తోడా గిరిజన తెగకు చెందిన తోడా ఎంబ్రాయిడరీ శాలువాను మోదీ బహూకరించారు. తెలుపు రంగు కాటన్ వస్త్రంపై ఎరుపు, నలుపు రంగు దారాలతో రేఖాగణిత ఆకృతులలో చేసే ఈ ఎంబ్రాయిడరీ ఆ తెగ కళాత్మక వారసత్వానికి చిహ్నం. ఈ బహుమతుల ద్వారా రెండు దేశాల మధ్య సాంస్కృతిక బంధాన్ని, స్నేహాన్ని మరింత పటిష్టం చేసే ప్రయత్నం చేశారు.

## ఆ అగ్నిపర్వతం నుంచి 18.9 కోట్ల విలువైన

## బంగారం ధూళి గాలిలోకి..



**రాస్ ఐలాండ్, జూన్ 30:** అంటార్కిటిక్‌లోని ఎరెబస్ అగ్నిపర్వతం.. యేటా రూ. 18.9 కోట్ల విలువైన బంగారం ధూళి గాల్లోకి విరజిమ్ముతున్నట్లు జియోఫిజికల్ పరిశోధనలు వెల్లడించాయి. 1991 నాటి సర్వే ప్రకారం.. రాస్ ద్వీపం సమీపంలో ఉన్న ఎరెబస్ అగ్నిపర్వతం రోజుకు 80 గ్రాముల బంగారు ధూళి గాల్లోకి విరజిమ్ముతోంది. ఈఅగ్నిపర్వత లావా నుంచి విడుదలయ్యే వాయువులుస్వచ్ఛమైన బంగారు సూక్ష్మకణాలను మోసుకెళ్తున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. అవి అంటార్కిటిక్ మంచుపై స్థిరపడటానికి ముందు 1,000 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తాయని తెలిపారు. ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్‌ను ఉయోగించి.. 60 మైక్రోమీటర్ల వరకు వ్యాసం కలిగి ఉంటే ఈ బంగారు స్ఫటికాలను గుర్తించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. లావాతోపాటు స్వచ్ఛమైన బంగారు సూక్ష్మ స్ఫటికాలను వాతావరణంలోకి ఈ అగ్నిపర్వతం విడుదల చేస్తోందని చెప్పారు. అగ్నిపర్వత వాయువులలో బంగారం దొరకడం పూర్తిగా అసాధారణ విషయమేమీ కాదని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. హవాయిలోని కిలావుయా, ఇటలీలోని మౌంట్ ఎట్నా, అలాస్కాలోని ఆగస్టిన్, మెక్సికోలోని ఎల్ చిచోన్ వంటి అగ్నిపర్వతాల వద్ద కూడా స్వల్ప మొత్తంలో బంగారాన్ని గుర్తించామన్నారు.

## 'మోడీ నిద్ర లేచే ఉంటారులే..'

### ఉదయం ఆరింటికే ఫోన్ చేయాలనుకున్న ట్రంప్




**వాషింగ్టన్, జూన్ 30:** భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు ఇరు దేశాధినేతల స్నేహం మూలస్తంభం అని యుఎస్ రాయబారి సెర్గియోగోర్ అన్నారు. వాషింగ్టన్ వేదికగా ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సు (యుఎస్ఐఎస్‌పిఎఫ్)లో పాల్గొన్న ఆయన.. మోడీ-ట్రంప్ బంధాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన ఓ సంఘటనను గుర్తు చేసుకున్న ఆయన.. ప్రధాని మోడీకి ఓసారి ట్రంప్ ఉదయం ఆరు గంటలకే ఫోన్ చేయాలనుకున్నట్లు తెలిపారు. 'రెండు నెలల కిందట మియామిలో యుఎఫ్‌సి ఈవెంట్ జరిగింది. ఆ సమయంలో నేను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఉన్నాను. వేదిక పక్కన మేం మాట్లాడుకుంటూ ఉండగా.. 'మోడీకి కాల్ చేద్దాం' అని ట్రంప్ అన్నారు. 'ఇప్పుడు భారత్‌లో సమయం ఉదయం 6 గంటలు' అని నేను చెప్పా. దానికి అధ్యక్షుడు బదులిస్తూ.. 'ఏం ఫర్వాలేదు. ఆయన (మోడీ) నిద్ర లేచే ఉంటారు. ఎక్కువ సేపు పడుకోరు. ఆయనకు నేనంటే ఇష్టం' అని అన్నారు. ఆ తర్వాత ట్రంప్ వేరే బాధ్యతల్లో ఉండటంతో మోడీతో కాల్‌ను మరుసటి రోజుకు షెడ్యూల్ చేశారు. అయితే, ఈ సంఘటన వారిద్దరి మధ్య మైత్రిని చాటి చెబుతుంది. ఎవరితోనైనా స్నేహం చేస్తే.. ప్రతిదాన్ని షెడ్యూల్ చేసుకోవాల్సిన అవసరం లేదని ట్రంప్‌ను చూశాక నాకనిపించింది. మోడీ ఆయనకు గొప్ప స్నేహితుడు' అని సెర్గియో గోర్ వెల్లడించారు.

**తుది దశకు ట్రేడ్ డీల్..**

ఇక, రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం గురించి అమెరికా రాయబారి ప్రస్తావిస్తూ.. 'ట్రేడ్ డీల్‌పై తుది దశకు చేరుకున్నాం. చాలా అంశాల్లో ఏకాభిప్రాయం కుదిరింది. కేవలం ఒకటి లేదా రెండు శాతం ఉత్పత్తులపై అంగీకారానికి రావాల్సి ఉంది. అతి త్వరలోనే ఈ ఒప్పందంపై ప్రకటన వస్తుంది' అని వెల్లడించారు. ఈ సందర్భంగా ట్రంప్ భారత పర్యటన గురించి సెర్గియో గోర్ మాట్లాడారు. భారత్‌లో పర్యటించేందుకు అమెరికా అధ్యక్షుడు ఎదురుచూస్తున్నారని, మధ్యంతర ఎన్నికలకు ముందే ఈ పర్యటన ఉండొచ్చని తెలిపారు.

## సంక్షిప్త వార్తలు

### వెనెజులా భూకంపంలో 58వేల భవనాలు ధ్వంసం



**కారకస్, జూన్ 30:** ఇటీవల సంభవించిన జంట భూకంపాలు వెనుజులాకు భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. ఆ దేశంలో 58 వేలకుపైగా భవనాలు ధ్వంసమైనట్లు నాసా అంచనా వేసింది. జూన్ 25న సేకరించిన ఉపగ్రహ డేటా ఆధారంగా ఈ లెక్కలు వెల్లడించింది. క్షేత్రస్థాయిలో విధ్వంస ప్రభావాన్ని అంచనా వేసి, సహాయక బృందానికి మార్గనిర్దేశం చేసేందుకు ఈ శాటిలైట్ డేటా ఉపయోగపడుతుందని నాసా పేర్కొంది. అయితే.. 855 భవనాలు దెబ్బతిన్నాయని, వాటిలో 189 పూర్తిగా ధ్వంసమయ్యాయని వెనుజులా నేషనల్ అసెంబ్లీ ప్రెసిడెంట్ జార్జ్ రోడ్రిగ్జ్ వెల్లడించడం గమనార్హం. ఈ భవన శిథిలాల కింద వేల సంఖ్యలో ప్రజలు చిక్కుకుని ఉంటారనే ఆందోళన నెలకొంది. వారిని బయటకు తీసినా ప్రాణాలతో ఉంటారనే ఆశలు సన్నగిల్లుతున్నాయి. సమాచార లోటును ఈ గ్రూప్‌లు భర్తీ చేస్తున్నాయని నిపుణులు చెప్తున్నారు.

### 37కేజీల బంగారం సీజ్: గువాహటిలో ఒకరి అరెస్టు

**గువాహటి, జూన్ 30:** గువాహటిలో అసోం పోలీసులు చేపట్టిన ఆపరేషన్‌లో దాదాపు రూ.55 కోట్ల విలువైన 37 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్టు చేసినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. అరెస్టు అయిన వ్యక్తిని మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లాకు చెందిన అక్షయ్ భన్సోరేగా గుర్తించారు. లతాసిల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని, తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని వివరించారు. ఖచ్చితమైన సమాచారం ఆధారంగా చేపట్టిన పోలీసు ఆపరేషన్‌లో ఈ బంగారం స్వాధీనం చేసుకున్నట్లు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సెంట్రల్) సంభవి మిశ్రా తెలిపారు. స్వాధీనం చేసుకున్న బంగారాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు, దర్యాప్తులో భాగంగా దానిని పరిశీలిస్తున్నారు.

### తమిళనాడులో ఇక అన్నీ ఎసి బస్సులే



**చెన్నై,జూన్ 30:** తమిళనాడులో ఇకపై ప్రభుత్వం కొనుగోలు చేసే కొత్త బస్సులన్నీ ఎయిర్ కండిషనింగ్ సౌకర్యంతోనే ఉండనున్నాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి విజయ్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విజయ్ తమిళన్ పార్థిబన్ తెలిపారు. ప్రజలు సౌకర్యంగా ప్రయాణించేలా ప్రజారవాణా వ్యవస్థను ఆధునీకీకరించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని పార్థిబన్ తెలిపారు. రాష్ట్రంలోని మారుమూల గ్రామాలకు కూడా బస్సు సౌకర్యం చేరాలన్నది సిఎం లక్ష్యమనిచెప్పారు. ప్రతి కొత్త బస్సులో ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు ఉండాలని, ఎవరికీ ఇబ్బంది లేకుండా ప్రయాణించే అవకాశం కల్పించాలని సూచించినట్లు వెల్లడించారు.

### బెంగాల్‌లో నాఫ్తా పైప్‌లైన్‌లో భారీ పేలుడు

**హల్దియా,జూన్ 30:** పశ్చిమ బెంగాల్‌లో ఉన్న నాఫ్తా పైప్‌లైన్‌లో పేలుడు ఘటన జరిగింది. పుర్బా మిద్నాపూర్ జిల్లాలోని హల్దియా పెట్రోకెమికల్స్ సంస్థకు చెందిన పైప్‌లైన్ అగ్నిప్రమాదానికి గురైనట్లు అదికారులు చెప్పారు. మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ఆ ప్రమాదంలో 20 మంది గాయపడ్డారు. హల్దియా మున్సిపాల్టీలోని 13వ వార్డులో ఉన్న కొన్ని ఇండ్లు ఆ మంటలకు ధ్వంసం అయ్యాయి. 12 ఫైరింజిన్లు మంటల్ని ఆర్పే ప్రయత్నం చేశాయి. ప్రమాద సమయంలో సమీపంలో ఉన్న కార్మికులకు కాలిన గాయాలు అయ్యాయి. విషమంగా ఉన్న వారిని కోల్‌కతా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మంటల్ని అదుపులోకి తెచ్చినట్లు పోలీసులు చెప్పారు.

### పాక్ మాజీ ప్రధానికి ఇస్లామాబాద్ హైకోర్టులో ఊరట

**ఇస్లామాబాద్,జూన్ 30:** పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్య బుష్రా బీబీలకు అల్‌ఖాదిర్ ట్రస్ట్ అవినీతి కేసులో ఇస్లామాబాద్ హైకోర్టు నుంచి ఊరట లభించింది. ఈ కేసులో తమకు పడిన శిక్షను సవాలు చేస్తూ వారు దాఖలు చేసిన అప్పీల్‌పై తుది వాదనలు వినిపించడానికి కోర్టు రెండు వారాల గడువు మంజూరు చేసింది. దీంతో ఈ వివాదాస్పద కేసులో ఇమ్రాన్ ఖాన్ భవిష్యత్తు మరికొన్ని రోజుల్లో తేలనుంది. ఇస్లామాబాద్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆమిర్ ఫారూఖ్, జస్టిస్ మియాంగుల్ హాసన్ ఔరంగజేబ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ అప్పీళ్లపై విచారణ చేపట్టింది.



## సింధు జలాలు వదలకుంటే భారత్ అంతుచూస్తాం

### పాకిస్థాన్ మంత్రి ప్రేలాపనలు

**కరాచి,జూన్ 30:** పాకిస్తాన్‌కు సింధు నది నీళ్ల ఇవ్వకూడదని భారత్ తీసుకున్న నిర్ణయం పాకిస్థాన్‌ను భారీ దెబ్బకొట్టింది. భారత సరిహద్దులోని పాక్ ప్రాంతాలు తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌ను పాకిస్థాన్ బ్రతిమిలాడాల్సింది పోయి బెదిరింపులకు దిగుతోంది. సింధు నదీజలాలు ఇవ్వకుంటే భారత్ అంతుచూస్తామంటూ హెచ్చరిస్తోంది. తాజాగా, పాకిస్థాన్ వాతావరణ శాఖ మంత్రి ముసాదిక్ మాలిక్ కూడా భారత్‌ను బెదిరించాడు. సింధు నదీ జలాలు పాకిస్థాన్ నీళ్ల అంటూ చెప్పాడు. తమ నీళ్లను ఎవరైనా వాడుకుంటే వారి చేతులు నరికేసామంటూ పరోక్షంగా భారత్‌ను హెచ్చరించాడు. పాకిస్థాన్ సమాచార శాఖ మంత్రి అతౌల్లా తరార్ మాట్లాడుతూ సింధు నదీ జలాలను ఒక ట్యాప్ ద్వారా మన ప్రధానమంత్రి కంట్రోల్ చేస్తున్నారు అంటూ విమర్శించాడు.పాకిస్థాన్‌లోకి ఒక్క చుక్క నీళ్ల కూడా రాకుండా అడ్డుకుంటున్నారన్నాడు. ఇలా ఏకపక్షంగా ఒక దేశం నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేయడం తగదంటూ చెప్పుకొచ్చాడు. సింధు నదికి సంబంధించిన జలాల విషయంలో ఇండియా, పాక్ మధ్య దశాబ్దాలుగా ఒప్పందం ఉంది. అయితే, గత ఏడాది పహల్గాంలో ఉగ్రదాడుల తర్వాత ఈ ఒప్పందాన్ని ఇండియా రద్దు చేసింది. దీంతో పాకిస్థాన్‌కు సింధు నదీ జలాల పంపిణీని భారత్ నిలిపివేసింది.

## పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం ఒక ప్రయోగం

### వచ్చే యేడాది నాటికి ఫలితాలు



**న్యూఢిల్లీ, జూన్ 30:** దేశంలో పెట్రోల్‌లో 20శాతం ఇథనాల్ కలిపే కార్యక్రమం ఇంకా కొనసాగుతున్న ప్రయోగ దశలోనే ఉందని, ఈ విధానం ప్రభావం వచ్చే యేడాది నాటికి స్పష్టమవుతుందని ప్రభుత్వం మంగళవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇ20 పెట్రోల్‌కు, వాహనాల యాంత్రిక నష్టానికి సంబంధం ఉందని చెప్పడానికి గట్టి ఆధారాలు లేవని, ఈ విధానం భారతదేశ ఇంధన భద్రతకు, రైతులకు, పర్యావరణానికి మొత్తంగా ప్రయోజనకరంగా ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. 2025-26 సరఫరా సంవత్సరానికి ఇథనాల్ కేటాయింపులకు సంబంధించి కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. జూన్ 23న ఇచ్చిన తన ఉత్తర్వులో, టెండర్ ప్రక్రియను ఖరారు చేయడానికి ముందే, తమ ఇథనాల్ కేటాయింపులను పెంచాలని కోరుతూ ఒక డిస్టిలరీ చేసిన అభ్యర్థనను పరిశీలించాలని హైకోర్టు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలను (ఒఎంసిలు) బిపిసిఎల్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లను ఆదేశించింది. పెట్రోల్‌లో 20శాతం ఇథనాల్ మిశ్రమాన్ని సాధించాలన్న ప్రభుత్వ లక్ష్యంపై ఈ ఉత్తర్వు విస్తృత ప్రభావం చూపవచ్చని బిపిసిఎల్ కోర్టుకు తెలిపింది. కేంద్రం తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, సరఫరా ఒప్పందాలను ఖరారు చేయడంతో ఇథనాల్ కేటాయింపుల ప్రక్రియ అక్టోబర్ 2025లోనే పూర్తయిందని, వ్యక్తిగత కేటాయింపులను తిరిగి ప్రారంభించడం దేశవ్యాప్త కార్యక్రమానికి అంతరాయం కలిగించవచ్చని హెచ్చరించారు.

## చైనా బిలియనీర్‌కు అమెరికా కోర్టు 30 యేళ్ల జైలుశిక్ష

**న్యూయార్క్,జూన్ 30:** చైనా బిలియనీర్ గువో వెంగుయికి 30 ఏళ్ల జైలుశిక్ష పడింది. అమెరికాలోని మన్‌హటన్ జిల్లా కోర్టు ఆయనకు ఆ శిక్షను విధించింది. చైనాలో ఒకప్పుడు సంపన్న వ్యక్తిగా ఉన్న గువో వెంగుయి కొన్నేళ్ల క్రితం అమెరికాకు పరారీ అయ్యారు. అయితే అమెరికా వేదికగా చైనా కమ్యూనిస్టు పార్టీని ఆయన విమర్శించేవారు. బిలియన్ డాలర్ల స్కామ్‌లో అమెరికా కోర్టు ఆయనకు ఇవాళ శిక్షను ఖరారు చేసింది. ప్రాపర్టీ టైకూన్‌గా పేరున్న గువో వెంగుయి 2017లో చైనాను వీడి అమెరికా వెళ్లారు. అక్కడ కమ్యూనిస్టు పార్టీ విమర్శకుడిగా పేరుగాంచారు. మనీల్యాండరింగ్, ఫ్రాడ్, ముఠా నేరాభియోగాల కింద గువోను అరెస్టు చేశారు. చైనాకు ప్రజాస్వామ్యాన్ని మార్చాలనుకున్న ప్రజలను గువో పీక్కుతిన్నారని న్యూయార్క్ కోర్టు జడ్జీ అనాలిసా తన తీర్పులో పేర్కొన్నారు. చైనీయుల నుంచి ఆన్‌లైన్ ద్వారా డబ్బును దోచుకున్నగువో ఆ సొమ్ముతో సంపన్న జీవితాన్ని గడిపారు. చైనాలో రాజకీయ నేతలు అవినీతికి పాల్పడుతున్నారని భారీ ఆన్‌లైన్ ఉద్యమాన్ని నడిపారు. అమెరికా చేరుకున్న తర్వాత వారి నుంచి భారీ మొత్తంలో సొమ్మును రాబట్టారు. 2018 నుంచి 2023 మధ్య కాలంలో ఇన్వెస్ట్‌మెంట్, క్రిప్టో స్కీమ్‌లతో ప్రజల్ని గువో మోసం చేశారు. అమెరికాలో గువో 50 వేల చదరపు గజాల ఇంటిని నిర్మించుకున్నారు. స్వంత అవసరాల కోసం డబ్బును వాడడంతో గువోపై విమర్శలు వెల్లువెత్తాయి. కానీ తనకు వచ్చిన నిధులను రాజకీయాల కోసం వాడినట్లు ఆయన చెబుతున్నారు. చైనాను విమర్శించే అమెరికా నేతలతో గువో చేతులు కలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు గతంలో సలహాదారుడిగా చేసిన స్టీవ్ బానన్‌తో కలిసి ఆన్‌లైన్ వీడియోలు చేశారు. చైనా కమ్యూనిస్టు పార్టీకి వ్యతిరేకంగా ఆ ఇద్దరూ కలిసి పనిచేశారు.

## తిరుమల సమాచారం




# హుండీ కానుకలు రికార్డు

**● రూ.5.63 కోట్లు ఒక్కరోజే రాబడి**

**తిరుమల, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** వేసవిసెలవులు ముగిసిన తరువాత మళ్ళీ గత వారంలో నాలుగురోజులు కలియుగ వైకుంఠం తిరుమలలో అనూహ్యంగా భక్తుల రద్దీ ఏర్పడి బ్రహ్మోత్సవాలను తలపింపజేసింది. ఇష్టదైవమ్ తిరుమలేశుని దర్శనం కోసం అంతకంతకూ దేశం నలుమూలల నుండి భక్తుల భారీగా తరలిరావడంతో తిరుమలకొండ భక్తజనసంద్రంగా మారింది. ఇదే సమయంలో తమ మొక్కుబడుల్లో భాగంగా హుండీకి కానుకల రూపంలో సమర్పించుకున్న ఆదాయం జూన్ నెలలో ఆదివారం ఒక్కరోజుకే రూ.5.63 కోట్లు చేకూరింది. 95,498 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సోమవారం ఒక్కరోజే 4.34లక్షల లడ్డూలు కొనుగోలు చేశారు. దీన్నిబట్టి భక్తుల రద్దీ ఏమేరకు ఉందో అంచనా వేయవచ్చు. ఇదే జూన్ నెలలో 23వ తేదీ హుండీ రాబడి రూ. 5.18 కోట్లు కాగా 15వ తేదీ రూ.5.04 కోట్లు, 28న రూ.4.90 కోట్లు, 16వ తేదీ రూ.4.72 కోట్లు, 12న రూ.4.60 కోట్లు ఇలా వరుసగా రూ.4 కోట్ల పై మాటగానే ఆదాయం సమకూరింది. తిరుమలకు వచ్చి వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తుల సంఖ్య కూడా గణనీయంగా ఉంది. జూన్ 29న 95,498మంది భక్తులు, జూన్ 14వ తేదీ 95,094మంది, 8వ తేదీ 95,152 మంది, 7న 92,230మంది భక్తులు, 13న 92,830 మంది భక్తులు ఇలా వరుసగా సరాసరి 90వేల మంది వరకు భక్తులు శ్రీవారిని దర్శించుకోవడం విశేషం. కాగా మంగళవారం ఉదయానికి భక్తుల రద్దీ మోస్తరుగా ఉంది. మంగళవారం ఉదయం వైకుంఠమ్ 2లోని 21 కంపార్టుమెంట్లలో భక్తులు నిండి ఉన్నారు. దీంతో సర్వ దర్శనానికి సుమారు 12 గంటల సమయం నిరీక్షిస్తున్నారు. టైమ్‌స్లాట్ టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు శ్రీవారి దర్శనానికి సుమారు 12 గంటల సమయం పడుతుందని టిటిడి ప్రసారం చేసింది. వారాంతం ముగిసినా రద్దీ తగ్గకపోవడంతో కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. సోమవారం 30,231 మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించుకున్నారు.

## ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.కోటి విరాళం



**తిరుమల, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు దాతలు విరాళాలు అందిస్తున్నారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌కు చెందిన అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.కోటి విరాళాన్ని అందించింది. సంస్థ ప్రతినిధులు తరుణ్, రమేష్ తిరుమలలో టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడును కలసి విరాళం డిడిని అందజేశారు. ఈ సందర్భంగా పేద ప్రజల ప్రాణరక్షణకు చేయూతనిచ్చే మహోన్నత సేవలో భాగస్వాములైన అపర్ణ సంస్థ యాజమాన్యాన్ని ఛైర్మన్ నాయుడు అభినందిస్తూ, వారి దాతృత్వాన్ని కొనియాడారు.

## జులై 7న జీడిపప్పు ఖాళీ ప్లాస్టిక్ బకెట్‌ల ఇ వేలం

**తిరుమల, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల్లో ఏప్రిల్ 1వ తేదీ నుండి 2027 మార్చి 31వరకు జీడిపప్పు ప్యాకింగ్‌కు వినియోగించే ఖాళీ ప్లాస్టిక్ బకెట్‌లను ఇ వేలం వేయనున్నారు. జులై 7న రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ ద్వారా ఈ వేలం వేయనున్నారు. ఆసక్తిగల బిడ్డర్లు రూ.25 వేలు ఇఎండి చెల్లించాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు తిరుపతిలోని టిటిడి మార్కెటింగ్ కార్యాలయాన్ని 08772 264429 నంబరుకు కార్యాలయం వేళల్లో, టిటిడి వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.తిరుమల.ఒఆర్‌జి, రాష్ట్ర ప్రభుత్వ పోర్టల్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.కొనుగోలు.ఎపి.జివొవి.ఇన్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

## తిరుమల పవిత్రతకు భంగం

**● గోగుల కోటయ్య కోటిపై పిడి యాక్ట్**



**తిరుమల, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల పవిత్రతకు భంగం కలిగిస్తూ భక్తులను వేధించిన గోగుల కోటయ్య కోటి(22)పై తిరుమల పోలీసులు పిడి యాక్టు నమోదు చేశారు. ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించే వారిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పోలీసు, టిటిడి సిబ్బందిపై దాడులకు పాల్పడుతున్న నేరస్థుడు గోగుల కోటయ్య కోటి (22) పై పిడి యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు అమలు చేశారు. తిరుపతి జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ నిందితుడి నేరచరిత్రను పరిశీలించి ప్రజా శాంతిభద్రతలకు, ముఖ్యంగా తిరుమలకు వచ్చే భక్తుల భద్రతకు ముప్పుగా ఉన్నట్లు నిర్ధారించి పిడి యాక్ట్ కింద ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు నిందితుడిని కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

# మతసామరస్యానికి నిదర్శనం బారాషహీద్ దర్గా

**● భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక నెల్లూరు రొట్టెల పండుగ: మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి**



**నెల్లూరు(వైద్యం), జూన్ 30 ప్రభాతవార్త:** ప్రపంచంలోనే మతసామరస్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన పవిత్ర క్షేత్రం బారాషహీద్ దర్గా అని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మంగళవారం నెల్లూరులోని చారిత్రాత్మక బారాషహీద్ దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, దర్గా కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి బారాషహీదులను దర్శించుకుని దేశ ప్రజల సుఖశాంతులు, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచంలోనే మతసామరస్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన పవిత్ర క్షేత్రం బారాషహీద్ దర్గా అని పేర్కొన్నారు. భిన్న మతాలు, భిన్న సంప్రదాయాలు, భిన్న సంస్కృతులు కలిగిన ప్రజలు ఒకే వేదికపై కలుసుకుని పరస్పర గౌరవం, సోదరభావాన్ని చాటుకునే అపూర్వ ఆధ్యాత్మిక ఉత్సవం రొట్టెల పండుగ అని అన్నారు.

భారతదేశం వైవిధ్యంలో ఏకత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన దేశమని, ఆ గొప్ప సంస్కృతికి ప్రతిబింబమే నెల్లూరులో జరిగే రొట్టెల పండుగ అని మంత్రి పేర్కొన్నారు. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, జైనులు, సిక్కులు తదితర అన్ని మతాలకు చెందిన భక్తులు ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా ఒకే చోట చేరి రొట్టెలను మార్చుకోవడం భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం కేవలం ఆధ్యాత్మిక విశ్వాసానికి మాత్రమే పరిమితం కాకుండా, సర్వమత సౌభ్రాతృత్వానికి, సామాజిక ఐక్యతకు, మానవ విలువలకు ప్రతీకగా నిలుస్తోందన్నారు.

మతం ఏదైనా మనుషులందరూ ఒక్కటేనని, పరస్పర ప్రేమ, గౌరవం, సహజీవనమే భారతీయతకు మూల సూత్రమని ఈ పండుగ ప్రపంచానికి చాటి చెబుతోందని తెలిపారు. ప్రతి ఏటా దర్గాపై ప్రగాఢ విశ్వాసంతో, స్వర్ణాల చెరువులో జరిగే రొట్టెల పండుగలో పాల్గొనేందుకు లక్షలాది మంది భక్తులు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి తరలివస్తున్నారని చెప్పారు. గతంలో కొన్ని వేల మంది భక్తులతో ప్రారంభమైన ఈ ఉత్సవం నేడు లక్షలాది మంది పాల్గొనే మహోత్సవంగా రూపాంతరం చెందడం ఈ పండుగ విశిష్టతకు నిదర్శనమన్నారు. దివంగత ఆనం వివేకానంద రెడ్డి హయాం నుంచే బారాషహీద్ దర్గా అభివృద్ధికి తమ కుటుంబం కృషి చేస్తోందని, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎన్డీఏ కూటమి నాయకులు, జిల్లా ప్రజాప్రతినిధుల సహకారంతో రొట్టెల పండుగ మరింత వైభవంగా నిర్వహించబడుతోందని పేర్కొన్నారు.

# 'సంజీవని' ఒక గేమ్‌ఛేంజర్

**● వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**

**విజయవాడ, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపిలో అమలవుతున్న 'సంజీవన్ని ఒక గేమ్ ఛేంజర్ పథకంగా జాతీయ స్థాయిలో గుర్తింపులోకి వచ్చిందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఢిల్లీలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంరక్షణ మండలి సమావేశానికి హాజరైన సందర్భంగా మంత్రి సత్యకుమార్ సామాజిక మాధ్యమాల ద్వారా వివరించారు. రాష్ట్రాల ఆరోగ్య శాఖ మంత్రులకు సంజీవని పథకం గురించి వివరించినట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వ్యాధులు సోకిన అనంతరం చికిత్సను అందించే సాంప్రదాయ విధానం నుండి(రియాక్టివ్) వ్యాధుల నివారణకు (ప్రివెంటివ్) దిశగా సమగ్ర మార్పునకు 'సంజీవన్ని పథకం ఒక గేమ్ ఛేంజర్ కానున్నదని మంత్రి సత్యకుమార్ యాదవ్ సమావేశంలో వివరించారు. డిజిటల్ వైద్య సేవలను అట్టడుగు స్థాయికి అందుబాటులోకి తెచ్చి వైద్య సేవల్ని పొందడంలో ప్రస్తుతం గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య నెలకొన్న అంతరాన్ని తొలగించడానికి 'సంజీవన్ని ఇతోధికంగా ఉపకరిస్తుందని మంత్రి తెలిపారు. దార్శనికుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనల మేరకు సంజీవని పథకాన్ని రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు.

గతేడాది జులై మాసంలో కుప్పం నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమై, ప్రస్తుతం చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమలవుతున్న 'సంజీవన్ని పథకాన్ని ఆగస్టు మాసంలో రాష్ట్రమంతటా విస్తరిస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ప్రజలకు వైద్య సేవలను అందించే దిశగా పలు అంశాల్లో రాష్ట్రం ముందంజలో ఉందని రాష్ట్ర మంత్రుల సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు. టెలీ వైద్య సేవలు, ఎన్‌సిడి స్క్రీనింగ్, ఎయిడ్స్ నియంత్రణ, ఎనీమియా నివారణ, ఆసుపత్రుల్లో ప్రసవాలు, క్షయ వ్యాధి నోటిఫికేషన్, ప్రసవకాలంలో మాతృ మరణాల నివారణ వంటి పలు అంశాల్లో రాష్ట్రం ముందంజలో ఉన్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ సోదాహరణంగా వివరించారు.

# దోచుకునే వారిదే నేడు కాలం

**● సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బివి రాఘవులు**




**తిరుపతి, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రస్తుతం శ్రమ చేసే వారికి విలువ లేదని దోచుకునే వారిదే కాలమని సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యుడు బివి రాఘవులు ఎద్దేవా చేశారు. నేటి పాలకులు జాతీయ సంపదను దోచేస్తూ, లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికుల జీవితాలను కాలరాస్తున్నారని విమర్శించారు. ఇలాంటి సమయంలో ఐక్య ఉద్యమాల అవసరం అన్నారు. అమెరికా ఇరాన్ యుద్ధం ఫిబ్రవరి 8న ప్రారంభమైందని, ఇంకా కొనసాగుతుందన్నారు. ఆ యుద్ధ ప్రభావం భారత దేశంలో అధికంగా ఉందని, క్రూడ్ ఆయిల్, గ్యాస్, నూనె ధరలు విపరీతంగా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధానికి ముందు చమురు బ్యారెల్ ధర 70 డాలర్లు ఉంటే, యుద్ధం సమయంలో 120 డాలర్లు ఉండేదని, ప్రస్తుతం 70 డాలర్లకు తగ్గిందని, అయినా దేశంలో ధరలు మాత్రం తగ్గలేదన్నారు. దేశంలో ప్రజలపై భారాలు పెరుగుతున్న యుద్ధాన్ని ఆపాలని ప్రధాని మోడీ కనీసం ప్రకటన చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రస్తుత పాలకులు అమెరికాకు సహాయం చేయడానికి దేశానికి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. దేశ ప్రజలందరూ ఇబ్బందుల్లో ఉన్న అదానీ, అంబానీ ఆదాయాలు మాత్రం రోజురోజుకు పెరిగిపోతుందన్నారు. అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాలు అన్ని కూడా కార్పొరేట్ శక్తులకు ఆదాయంగా మార్చేస్తున్నారని గజమెత్తారు.

**వర్మది వసుదైక కుటుంబం:**

వర్మ కుటుంబం నిజమైన వసుదైక కుటుంబం అని, కుల మతాలకు అతీతంగా లౌకికవాదాన్ని ప్రోత్సహించిన వ్యక్తి ఆయన అని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బివి రాఘవులు పేర్కొన్నారు. వర్మ 84వ జయంతి సందర్భంగా తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో నేటి తరం ఎదుర్కొంటున్న సవాల్ అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందరపు మురళి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ వర్మ చిన్నతనం నుంచే పోరాట పటిమ కలిగిన వ్యక్తి అన్నారు. పోస్టల్ ఉద్యోగ సంఘంలో ఉన్నప్పుడే ఉద్యమాల్లో పని చేశారని తెలిపారు. ఆయన కుటుంబంలో కులం, మతం భేదాలు లేవని, కట్న కానుకల సమస్యలే లేవని, అవనిగడ్డ కుటుంబాన్ని చూస్తే, నిజమైన భారతదేశాన్ని చూసినట్టు ఉంటుందని వర్మది వసుదైవిక కుటుంబం అని పేర్కొన్నారు. తనకు తెలిసిన మంచిని నలుగురికి చెప్పే తపన ఉన్న వ్యక్తి వీర వర్మాన్ని తెలిపారు. ఒకే దేశం ఒకే మతం ఒకే ఆహారం ఆఖరికి ఒకే బట్ట అనే విధంగా పాలకులు వ్యవహరించడం దారుణం అన్నారు. ప్రభుత్వ సంస్థలు సైతం ప్రైవేటు వారికి అప్పనంగా అప్పగించేస్తూ, దేశ ప్రజలకు కనీసం ఉపాధి భరోసా కూడా లేకుండా చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర రాజకీయాలను సైతం విచిత్రంగా ఉన్నాయని అధికారంలో ఉన్న టిడిపి, జనసేనలు మోడీ అడుగులకు మడుగులు ఒత్తుతున్నారని, ప్రతిపక్షంలో ఉన్న వైసిపి సైతం మోడీ వెంటే ఉన్నారని విమర్శించారు. దేశంలో 'సర్ల్ పేరుతో ఓట్లు మాయం చేసే తంతు జరుగుతుందన్నారు. ఇలాంటి సమయంలో ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత ప్రజాస్వామ్యవాదులపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు టి సుబ్రహ్మణ్యం, ఆర్‌పిఐ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడు అంజయ్య, ఐఎన్‌టియుసి నాయకులు రత్నకుమార్, కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# సునీల్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఆపండి

**● ప్రభుత్వానికి ఐపిఎస్ అధికారి భార్య పిటిషన్**

**విజయవాడ, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** రఘురామ కృష్ణంరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో సస్పెన్షన్‌లో ఉన్న సీనియర్ ఐపిఎస్ అధికారి పివి సునీల్ కుమార్ పదవీ విరమణ రోజే ఊహించని షాక్ తగిలింది. ఆయనకు అందాల్సిన పదవీ విరమణ ప్రయోజనాలను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ ఆయన భార్య పి.అరుణ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వయోపరిమితి కారణంగా సునీల్ కుమార్ మంగళవారం పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన భార్య ప్రభుత్వానికి ఒక పిటిషన్ సమర్పించారు. తమ మధ్య వైవాహిక వివాదాలు ఉన్నాయని, తన భర్తపై గృహ హింస, వరకట్న వేధింపుల ఆరోపణలు ఉన్నాయని అరుణ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ విషయమై 2017 జూన్‌లోనే కేసు నమోదైనట్లు ఆమె వివరించారు. ఒకవేళ ఇప్పుడు ఆయనకు రిటైర్మెంట్ ప్రయోజనాలు అందిస్తే, తన జీవనోపాధికి తీవ్ర ఇబ్బందులు కలుగుతాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

## తిరుపతిలో ఆరుగురు అరెస్ట్... గంజాయి సీజ్

**తిరుపతి, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతిలో గంజాయి అమ్మకాలు కలకలం రేపింది. నగరంలోని కోట కొమ్మల వీధి, దొడ్డపురం వీధి, పెద్దకాపు లే అవుట్, కట్టమంచికి చెందిన యువకులు ఈ గంజాయి వ్యాపారం చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. రెండు రోజుల క్రితం గంజాయి మత్తులో కోట కొమ్మల వీధిలో గొడవలు చోటుచేసుకున్నాయి. ఈ గొడవలకు కారణమైన వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేయడంతో అసలు నిందితులు వెలుగులోకి వచ్చారు. తిరుపతి దొడ్డాపురంవీధికి చెందిన హరికృష్ణ రెడ్డి, జ్ఞానచరణ్, కోట కొమ్మల వీధికి చెందిన ఉదయ్ కుమార్, కట్టమంచికి చెందిన వెంకట సాయి, జీవకోన అరుణోదయ కాలనీకి చెందిన ఆదినారాయణల వద్ద రెండు కిలోల గంజాయితో అలిపిరి పోలీసులకు పట్టుబడ్డారు. ఆరుగురిని రిమాండ్‌కు తరలించారు.

# మామిడి రైతులను ఆదుకోవాలి

**● చిత్తూరు- పుత్తూరు రహదారిపై వైసిపి ధర్నా**



**చిత్తూరు, జూన్ 30 ప్రభాతవార్త:** మామిడి రైతుకు ఈ సీజన్‌లో తీరని అన్యాయం జరిగిందని, మామిడి రైతుకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు మండలం జైన్ ఫ్యాక్టరీ ఆవరణలో చిత్తూరు- పుత్తూరు జాతీయ రహదారిపై మంగళవారం తోతాపురి మామిడికి మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ ధర్నాకు మాజీ డిప్యుటీ సిఎం నారాయణస్వామి, మాజీ ఎంపి రెడ్డప్ప, చిత్తూరు, పూతలపట్టు, జిడినెల్లూరు, చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు ఎంసి విజయానందరెడ్డి, డాక్టర్ సునీల్‌కుమార్, కృపాలక్ష్మి, చెవిరెడ్డి మోహిత్‌లు, పార్టీ పరిశీలకులు వల్లివేడు పృధ్వీరెడ్డి తదితరులు హాజరయ్యారు. రైతులతో కలసి ధర్నా నిర్వహిస్తున్న వైకాపా నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో కొంత ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది.

అంతరకు ముందు ధర్నానుద్దేశించి భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతుల పట్ల నిరంకుశంగా వ్యవహారిస్తుందని ధ్వజమెత్తారు. ఈ సీజన్‌లో తోతాపురి మామిడి రైతుకు ప్రభుత్వం వారం రోజుల క్రితం కేజీకి రూ.4 ప్రోత్సాహక ధర ప్రకటించి, ఫ్యాక్టరీలు రైతుల నుండి కేజీ తోతాపురి మామిడిని రూ.6 కొనుగోలు చేయాలని స్పష్టం చేసినప్పటికీ జిల్లాలోని ఏ ఒక్క ఫ్యాక్టరీ రైతు నుండి తోతాపురి రకం మామిడి కేజీకి రూ.2 నుండి రూ.4 మించి కొనుగోలు చేయడం లేదని ధ్వజమెత్తారు. మాజీ డిప్యుటీ సిఎం నారాయణస్వామి మాట్లాడుతూ జిల్లాలో తోతాపురి మామిడి రైతులు ట్రాక్టర్లను పల్ప్ ఫ్యాక్టరీ వద్దకు తీసుకువచ్చి రోజుల తరబడి పడిగాపులు పడుతున్నప్పటికీ ఫ్యాక్టరీలు మాత్రం మామిడి రైతుల నుండి కాయలు తీసకోవడం లేదని ధ్వజమెత్తారు. మాజీ ఎంపి రెడ్డప్ప మాట్లాడుతూ మామిడి మద్దతు ధర కోసం మామిడి రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుండి స్పందన రాకపోవడంతో మామిడి రైతుల కోసం వైకాపా రోడ్డెక్కిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తోతాపురి మామిడి కేజీకి రూ.15 మద్దతు ధర చెల్లించి మామిడి రైతును ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు, మామిడి రైతులు హాజరయ్యారు.

# మామిడి రైతులతో వైసిపి డ్రామాలు

**● చిత్తశుద్ధి వుంటే పెద్దిరెడ్డి ఫ్యాక్టరీ ఎదుట ధర్నా చేయాలి**

**● ఎమ్మెల్యేలు జగన్మోహన్‌నాయుడు, కలికిరి మురళీమోహన్**



**చిత్తూరు, జూన్ 30 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడంతో పాటు, తోతాపురి మామిడి కేజీకి రూ.4 ప్రోత్సాహక ధరను ముందుగానే ప్రకటించడంతో కూటమి ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని జీర్ణించుకోలేని వైకాపా నాయకులు మామిడి డ్రామాను ఆడుతున్నారని చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్ నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు పేర్కొన్నారు. చిత్తూరులోని ఎమ్మెల్యే గురజాల నివాసంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్రంలో మామిడి రైతులను ఆదుకోవాలని గత రెండేళ్ళుగా కూటమి ప్రభుత్వం తోతాపురి మామిడికి ప్రోత్సాహక ధర ఇస్తోందన్నారు. వైకాపా నాయకులు చిల్లర వేషాలు వేస్తూ రైతులను రెచ్చగొట్టడం మానుకోవాలన్నారు. రైతులు, ప్రజలకు మేలు చేస్తున్న కూటమి ప్రభుత్వంకు దిష్టి తగులుతుందని, ప్రభుత్వానికి దిష్టి తగలకుండా వుండటానికి తాము నల్లచొక్కాలు వేసుకుని విలేకరుల సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.

మామిడి రైతులకు అన్ని విధాలుగా అండగా నిలవాలని సిఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారని, ఆ మేరకు తాము మామిడి పల్ప్ ఫ్యాక్టరీలను సందర్శించి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వైకాపా నాయకులకు నిజంగా చిత్తశుద్ధి వుంటే మాజీ మంత్రి పెద్దిరెడ్డికి చెందిన మామిడి గుజ్జు ఫ్యాక్టరీ వద్ద ధర్నా చేయాలన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం నాయకులు వెంకటేష్ యాదవ్, నరేష్, మోహన్‌రాజ్, నీరజాక్షులు నాయుడు, ఈశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ రోజునే రిటైర్మెంట్ బెనిఫిట్స్

**- టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర**





**తిరుమల, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ టిటిడిలో సుదీర్ఘ కాలం సేవలందించి పదవీ విరమణ పొందిన వారికి రిటైర్డ్ బెనిఫిట్స్ వచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులను టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర ఆదేశించారు. టిటిడిలో వివిధ శాఖల్లో జూన్‌నెలలో రిటైర్డ్ అయిన 122 మంది ఉద్యోగులకు సామూహిక సన్మానం కార్యక్రమాన్ని మహతి ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించారు. టిటిడి ఉద్యోగుల సంక్షేమ విభాగం డిప్యూటీ ఇఒ ఆనంద రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇఒ రవిచంద్ర మాట్లాడుతూ టిటిడిలో వివిధ శాఖల్లో, పలు హోదాల్లో విధులు నిర్వహించి పదవీ విరమణ అయ్యాక వారిని గౌరవించి, వారికి అందే ఫలాలను అదే రోజు వారి ఖాతాల్లో జమ చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి రోజూ సరాసరి 75 వేల పైచిలుకు భక్తులకు సేవలందిస్తున్న ఉద్యోగులను ఇఒ రవిచంద్ర అభినందించారు. టిటిడి జెఇఒ డాక్టర్.ఎ.శరత్ మాట్లాడుతూ జూన్ 30న 122 మంది టిటిడి ఉద్యోగులు పదవి విరమణ పొందారని, వారిని సమిష్టిగా పండుగ వాతావరణంలో సన్మానించాలని టిటిడి ఇఒ ఆలోచనలు మేరకు సన్మాన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. టిటిడిలో పదవీ విరమణ పొందిన వారిని సన్మానించడం మహా సేవగా కొనియాడారు. టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి తదితరులు ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన 122 మందికి ఒక్కొక్కరికి శ్రీవారి లడ్డూ, వడ, అమ్మవారి కుంకుమ, పసుపు, రవికె, అక్షింతలు, తీర్థం, శాలువా ఇచ్చి సత్కరించారు.

## విద్యుత్ వినియోగదారులతో నేడు విడియో కాన్ఫరెన్స్

తిరుపతి, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి: ఎస్‌పిడిసిఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులతో బుధవారం(నేడు) వీడియోకాన్ఫరెన్స్ జరగనుంది. వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికి ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించనునట్లు ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి మంగళవారం పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనదలచిన పారిశ్రామిక వినియోగదారులు ప్రతి నెలా మొదటి బుధవారానికి 7 రోజుల ముందు నుంచి మొదటి మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు మొబైల్ నంబరు: 89777 79471కు కాల్ చేయడం ద్వారా వివరాలను నమోదు చేసుకోవాల్సి వుంటుందని తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యుత్ సమస్యపై చర్చించి, పరిష్కరించుకునేందుకు అవకాశం వుంటుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లింకును సంబంధిత వినియోగదారులకు పంపడం జరిగిందని తెలిపారు.

# విద్యుత్ భద్రతపై అవగాహన అవసరం

**● ప్రమాదాల నివారణపై వినియోగదారుల్లో చైతన్యం ● ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**



**తిరుపతి, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** నేటి సమాజంలో విద్యుత్ భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహనను పెంపొందించుకోవాలని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి సూచించారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ భద్రతపై ఎస్పీడిసిఎల్ విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను తిరుపతిలో ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ విద్యుత్ సామర్థ్యం, భద్రతా చర్యలు, నిబంధనల అమలు అంశాలపై ఈ యేడాది జూన్ 26న ప్రారంభమైన అవగాహనా కార్యక్రమాలు జులై 2వతేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడమే ధ్యేయంగా సంస్థ పరిధిలో సర్కిల్, డివిజన్, సబ్‌డివిజన్, సెక్షన్ల స్థాయిల్లో విద్యుత్ భద్రతపై వినియోగదారుల్లో అవగాహనను పెంపొందించేదుకు కృషి చేస్తున్నామని వివరించారు. విద్యుత్ భద్రతపై వినియోగదారుల్లో చైతన్యం తీసుకురావడం ద్వారానే ప్రమాదాలను నివారించేందుకు అవకాశం వుంటుందన్నారు. గృహోపకరణాల అంశంలో వినియోగదారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నాణ్యమైన విద్యుత్ పరికరాలనే వినియోగించాలని సూచించారు.

అంతేకాకుండా ఇంటి వైరింగును నిపుణుడైన ఎలక్ట్రీషియన్‌తో తరచూ తనిఖీ చేయిస్తూ, పాడైన పరికరాలను వెంటనే మార్చుకోవాలని, ఎర్తింగ్‌ను తప్పనిసరిగా అమర్చుకోవాలన్నారు. బలమైన గాలి వర్షం సందర్భాల్లో ప్రజలు విద్యుత్ లైన్ల కిందగానీ, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లకు దగ్గరగాగానీ నిల్చోవద్దని సూచించారు. తమ ప్రాంతంలో ఎక్కడైనా విద్యుత్ ప్రమాదాలు జరిగినట్లయితే వినియోగదారులు వెంటనే తమ సమీపంలోని విద్యుత్ సిబ్బందికిగానీ, అధికారులకుగానీ సమాచారం అందించాలని సూచించారు. సంస్థ పరిధిలో క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే సిబ్బందికి కూడా విద్యుత్ భద్రతపై ప్రత్యేకంగా శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్‌లు కె. గురవయ్య, పి.అయూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణాదేవి, సిహెచ్ రామచంద్రరావు, ఎన్.శోభా వాలెంటీనా, ఎస్.రమణ, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె.జనార్దన్ నాయుడు, తిరుపతి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ చంద్రశేఖర్ రావు, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెండుసార్లు మృత్యుంజయుడు..
# మూడోసారి మృత్యు కౌగిలికి

● ఆరు నెలల వ్యవధిలో మూడుసార్లు పాముకాటు



బల్లికురవ, జూన్ 30 ప్రభాతవార్త: పాములకు జ్ఞాపకశక్తి ఉండదు, మనుషులను గుర్తుపట్టేంత మేధస్సు ఉండదు, చెవులు ఉండవు, శబ్దాలు వినిపించవు, కేవలం భూమి ద్వారా వచ్చే ప్రకంపనలను మాత్రమే, అవి గుర్తిస్తాయి. మనుషులపై పగబట్టటం, ప్రతీకారం తీర్చుకోవడం లాంటి, సంఘటనలు కేవలం సినిమాలకు మాత్రమే పరిమితం అని శాస్త్రవేత్తలు నిరూపించా మంటారు. కానీ కొన్ని సంఘటనలు జరిగినప్పుడు పాములు, పగలు, నిజమేనా అని సందేహం కలుగక మానదు. అలాంటి సంఘటనలు నక్కబొక్కలపాడు గ్రామం మంగళవారం ఒక్కసారిగా తల్లడిల్లింది. గ్రామానికి చెందిన ధూళిపాల వీరాంజనేయులు(55) ఓ మధ్యతరగతి రైతు. గ్రామానికి మాజీ ఉపసర్పంచ్‌గా కూడా సేవలు అందించారు. వీరాంజనేయులకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. అలాంటి మంచి మనిషికి గత ఆరు నెలలుగా పాము రూపంలో మృత్యువు నీడలా వెంటాడుతోంది. తొలిసారిగా తన సుబాబుల్ తోటను సాగుచేసేందుకు పొలం వెళ్ళగా అక్కడ ఒకసారి పాముకాటుకు గురయ్యాడు. ప్రథమ చికిత్స, విశ్రాంతి అనంతరం రెండు నెలలలో కోలుకుని, తిరిగి దైనందిక కార్యక్రమాలలో మునిగిపోయాడు. ఈ క్రమంలోనే నివాస గృహం వద్ద కాలంలో చెత్త తొలగించే క్రమంలో రెండవసారి పాము కాటు గురయ్యాడు. తిరిగి వైద్యశాలలో చికిత్సలు, విశ్రాంతి అనంతరం మరల కోలుకొని రెండు రోజుల క్రితమే పాల కేంద్రం విధులలో నిమగ్నం అయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఐదున్నర గంటల ప్రాంతంలో ఇంటి ముందు పాము రెండుసార్లు కాటు వేసింది. పాము కరిచిన విషయాన్ని గుర్తించని వీరాంజనేయులు పాల కేంద్రం వద్దకు వెళ్లి తన పనులలో నిమగ్నమయ్యాడు. పాము కాటు గుర్తింపులో జరిగిన జాప్యం ఫలితంగా వీరాంజనేయులుకు శరీరంలో చేరిన విష ప్రభావం పనిచేయటం ఆరంభించింది. అప్పుడు గుర్తుకు వచ్చి పాము కరిసినట్టుందని అనటం, కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించటం క్షణాల్లో జరిగిపోయింది. ఈ లోపే విధి వక్రించింది. విషం శరీరం అంతా పాకటం, 108 వాహనంలోకి ఎక్కించే కొద్దిసేపటికే, వీరాంజనేయులు మృత్యుకౌగిలి చేరటం జరిగిపోయింది. మార్గమధ్య వైద్యశాలకు చేరే లోపే వీరాంజనేయులు మృతి చెందినట్లుగా ధ్రువీకరించారు. యాదృచ్ఛికంగా జరిగిన సంఘటనలను పాము పగ అనాలో, వీరాంజనేయులు కర్మఫలం అనాలో, విధి వక్రించింది అనాలో... పేరు ఏదైనా, వీరాంజనేయులు కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది.

## విజయవాడ పశ్చిమబైపాస్‌లో రోడ్డుప్రమాదం
# ముగ్గురు దుర్మరణం



గన్నవరం(కృష్ణా), జూన్ 30 ప్రభాతవార్త: రోడ్డుప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందిన ఘటన విజయవాడ పశ్చిమబైపాస్‌లో కృష్ణాజిల్లా గన్నవరం మండలం బిబి.గూడెం గ్రామం వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరుజిల్లా కైకలూరు మండలం పెంచికలపర్రు గ్రామానికి చెందిన జయమంగళ వెంకటరాజు, అతని సోదరుడు విజయకుమార్‌లు విజయవాడ వైద్యశాలలో చికిత్స పొందుతున్న తల్లిని చూసేందుకు మంగళవారం కుటుంబసభ్యులతో కలిసి కారులో విజయవాడ వచ్చారు. తిరుగు ప్రయాణంలో పశ్చిమబైపాస్ మీదుగా వెళుతుండగా ప్రయాణిస్తున్న కారు బిబి.గూడెం గ్రామం వద్దకు చేరుకునే సరికి వెనుక నుండి వేగంగా వస్తున్న కంటైనర్ లారీ అదుపుతప్పి ముందు వెళుతున్న ట్యాంకర్‌ను, వీరి కారును బలంగా ఢీకొట్టింది. ఈప్రమాదంలో రెండు లారీల మధ్య కారు నలిగిపోయింది. ఈప్రమాదంలో కారు వెనుకభాగం పూర్తిగా ధ్వంసం కాగా వెనుకసీట్లో కూర్చున్న విజయకుమార్ భార్య వెంకటనాగమణి(28), కుమారుడు కారుణ్యనాగసాయి(4) తీవ్రంగా గాయపడి ప్రమాదస్థలిలోనే మృతి చెందారు. ఇదే సమయంలో స్కూటీపై వస్తున్న విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన దాసరి వెంకటేశ్వరావు(49)ను ట్యాంకర్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలయ్యి మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న మిగిలిన వారికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం వైద్యశాలలకు తరలించారు. సమాచారం అందుకున్న గన్నవరం సిఐ బి.వి.శివప్రసాద్ ప్రమాదస్థలికి చేరుకుని కారులో చిక్కుక్కున్న మృతదేహాలను బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వవైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కంటైనర్ లారీ టైర్ పంక్చర్ కావటంతో ఈప్రమాదం జరిగినట్లు ప్రత్యక్షసాక్షులు తెలియచేసారు.

## అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్
### 10 కేసులలో రూ.57 లక్షల సొత్తు స్వాధీనం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్ 30 ప్రభాతవార్త: కాకినాడ జిల్లాలో రాత్రి వేళల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా ఎస్పీ బిందు మాధవ్ తెలిపిన వివరాల ప్రకారం తూర్పుగోదావరి, అనకాపల్లి జిల్లాల్లో ఇటీవల జరిగిన 10 రాత్రి ఇంటి చోరీ కేసులను ఛేదించి, నలుగురు అంతరజిల్లా నేరస్తులను అరెస్ట్ చేసి, ఒక బాలనేరస్తుడును అదుపులోకి తీసుకున్నారు. నిందితులు ధర్మాడి దుర్గాప్రసాద్(కాకినాడ), గొర్రిపూడి వెంకటరమణ (అనపర్తి), పాసి శేఖర్ (అనపర్తి), గేదెల మహేష్ (తాడేపల్లిగూడెం), మరియు ఒక బాలనేరస్తుడును అదుపులోకి తీసుకోగా, చుక్క ప్రశాంత్ పరారీలో ఉన్నాడు. వీరివద్ద నుండి 380.7 గ్రాముల బంగారం, 2.854 కిలోల వెండి, ఒక ల్యాప్‌టాప్ మొత్తం రూ.57 లక్షల విలువైన సొత్తు రికవరీ చేశారు. నిందితులు రాత్రి వేళల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ కేసును ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంలో విశేష కృషి చేసిన కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ పాటిల్ దేవ్ రాజ్ మనీష్, కాకినాడ రూరల్ సి.ఐ. కృష్ణ చైతన్య, ఇంద్రపాలెం ఎస్ఐ. ఎం. వీరబాబు, క్రైమ్ ఎస్.ఐ. బి. వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ అభినందించారు.

# పెట్టుబడుల హబ్ 'ఆంధ్రప్రదేశ్'

● 20లక్షల ఉద్యోగాల మిషన్ ఎలక్షన్ స్టంట్‌కాదు, ఒక చారిత్రక బాధ్యత ● పరిశ్రమల శాఖ మంత్రి టి.జి.భరత్




సచివాలయం, జూన్ 30 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పారిశ్రామిక ప్రగతిలో సరికొత్త రికార్డులను సృష్టిస్తుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఆహార శుద్ధి శాఖ మంత్రి టిజి భరత్ తెలిపారు. గత ఐదేళ్ళ ప్రభుత్వ కాలపు రెడ్-టేపిజంకు పారిశ్రామిక వేత్తలను వేధించే సంస్కృతికి కూటమి ప్రభుత్వం పూర్తిగా చరమగీతం పాడిందని ఆయన స్పష్టంచేశారు. రెండేళ్ళ స్వల్పకాలంలోనే రాష్ట్ర ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు ద్వారా ఏకంగా రూ.7.66 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను క్లీయర్ చేసి గ్రౌండింగ్‌కు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. మంగళవారం సెక్రటేరియేట్‌లో పరిశ్రమల శాఖ సెక్రటరీతో కలసి నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి భరత్ పారిశ్రామిక, గ్రీన్ ఎనర్జీ, ఆహార శుద్ధి రంగాల్లో సాధించిన చారిత్రక విజయాలను సుదీర్ఘ వివరణతో మీడియా ముందుంచారు. గతంలో ఒక పరిశ్రమ స్థాపించాలంటే అర ఎకరం భూమి కోసం కూడా నెలల తరబడి క్యాబినెట్ చుట్టూ, దళారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఆ దౌర్భాగ్య విధానాన్ని రద్దు చేస్తూ 50ఎకరాల లోపు ల్యాండ్ అలాట్‌మెంట్ ఫైల్స్ ఇకపై ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా ఏపిఐఐసి, ఎస్ఎల్డీసీ పరిధిలోనే డైరెక్ట్‌గా క్లియర్ అయ్యేలా విప్లవాత్మక జీవో తెచ్చామన్నారు. ఈ సరళీకరణ వల్లనే కేవలం ఈ రెండేళ్ళలోనే రికార్డుస్థాయిలో 2,876ఎంఎస్ఎంఈ లార్జ్ పరిశ్రమలకు విజయవంతంగా భూ కేటాయింపులు పూర్తిచేశామని తెలిపారు. గుడ్లపాడు, ఓర్వకల్లు నోడ్‌లో గతంలో ప్రపోజల్స్ ఇచ్చి పనులు చేయని బైక్ తయారీ కంపెనీ ల్యాండ్స్ రద్దు చేయడమే దీనికి నిదర్శనమన్నారు. దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజాలతో జరిపిన నిరంతర చర్చల వల్ల అంతర్జాతీయంగా రాష్ట్ర ప్రతిష్ట అమాంతం పెరిగిందని మంత్రి టి.జి.భరత్ పేర్కొన్నారు. ఆర్సెలర్ మిట్టల్ అధినేత ఆదిత్య మిట్టల్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ గ్లోబల్ ప్రెసిడెంట్, గూగూల్ సీఈఓల గ్లోబల్ లీడర్లు ఏపి లిడర్‌షిప్, పారదర్శక పాలసీలపై స్వచ్ఛందంగా ప్రశంసల వర్షం కురిపిస్తూ అధికారిక టెస్టిమోయల్స్ ఇవ్వడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. 'విజన్ 2047' లో భాగంగా వరల్డ్ బ్యాంక్ నీటి ఆయోగ్ సాయంతో విశాఖపట్టణం, అమరావతి, తిరుపతి ప్రాంతాలను 3మేజర్ ఎకనామిక్, రిజీయన్స్‌గా డెవలప్ చేస్తున్నామని, ఇందులో భాగంగా వైజాగ్ ఎకనామిక్ రీజియన్ కింద 200ఎకరాల విస్తీర్ణంలో 3భారి ఫుడ్ పార్కులను నెలకొల్పుతున్నామని, జెఎస్‌డబ్ల్యూ పార్కుల్లో కూడా మెగా యూనిట్ వచ్చేలా టాప్ బాసెస్‌తో చర్చలు జరిగాయని తెలిపారు. 100శాతం ఆహార దిగుమతులపై ఆధారపడే దుబాయ్ వంటి గల్ఫ్ దేశాలకు ఆంధ్రప్రదేశ్‌ను ప్రధాన సప్లయి హబ్‌గా మార్చేందుకు దుబాయ్ మంత్రులతో జరిపిన చర్యలు సఫలీకృతమయ్యాయని, దేశ రాజధానిలో జరిగిన వరల్డ్ ఫుడ్ ఇండియా లోనూ ఏపి స్టాల్‌కు అంతర్జాతీయంగా అద్భుత రెస్పాన్స్ వచ్చిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఇన్వెస్టర్లను ఒకే వేదికపైకి తె చ్చేందుకు ఈ ఏడాది నవంబర్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా గ్లోబల్ పార్టనర్‌షిప్ సమ్మిట్‌ను నిర్వహించబోతుందని దీని ప్రమోషన్ కోసం ముంబై, ఢిల్లీ, బెంగళూరు, కొల్‌కతా, అహ్మదాబాద్ లతోపాటు విదేశాల్లోనూ భారీ రోడ్ షోలు నిర్వహించబోతున్నామని మంత్రి వెల్లడించారు. అలాగే గిరిజన ప్రాంతాల వరప్రసాదమైన, అంతర్జాతీయంగా భౌగోళిక గుర్తింపు పొందిన అరకు కాఫీ క్రేజ్‌ను గ్లోబల్ మార్కెట్‌లో మరింత అగ్రెసివ్‌గా వాడుకుంటూ, గిరిజన రైతులకు గరిష్ట లబ్ధి చేకూర్చేలా దీని ఎంటైర్ వాల్యూ చైన్‌ను సరికొత్త గ్లోబల్ వింగ్ ద్వారా ముందుకు తీసుకెళ్తామని మంత్రి టి.జి.భరత్ స్పష్టం చేశారు.

# నేడు అనంతపురానికి రాష్ట్రపతి రాక

● సెంట్రల్ వర్సిటీ స్నాతకోత్సవానికి హాజరు ● పుట్టపర్తి వచ్చిన గవర్నర్ ● రానున్న మంత్రులు లోకేష్, కేశవ్



సెంట్రల్ యూనివర్సిటీ వద్ద రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జిల్లా అధికారులు

అనంతపురం, జూన్ 30 ప్రభాతవార్త బ్యూరో: అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం జంతలూరు వద్ద ఏర్పాటు చేసిన సెంట్రల్ యూనివర్సిటీ మొదటి స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. రాష్ట్ర పర్యటనకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఈ స్నాతకోత్సవానికి హాజరయ్యేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు ఇప్పటికే చేరుకున్నారు. సెంట్రల్ యూనివర్సిటీలో జరిగే స్నాతకోత్సవానికి రాష్ట్రపతి దౌపది ముర్ము బుధవారం వస్తున్న నేపథ్యంలో రాష్ట్రపతికి సెంట్రల్ యూనివర్సిటీ వద్ద రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, పయ్యావుల కేశవ్, కేంద్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్ఎ కోరి స్వాగతం పలకనున్నారు. ఈ నేపథ్యంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం ఉదయం 9:30 గంటలకు బెంగళూరు ఆర్ఎల్ విమానాశ్రయం నుంచి బయల్దేరి హెలీ క్యాప్టర్ ద్వారా కేంద్ర విశ్వవిద్యాలయం హెలీప్యాడ్ వద్దకు 10:30 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి సెంట్రల్ యూనివర్సిటీకి రాష్ట్రపతి చేరుకుని ఉదయం 11 నుంచి 12 గంటల మధ్యలో స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. మధ్యాహ్నం 12:10 గంటలకు సెంట్రల్ యూనివర్సిటీ వద్ద నుంచి హెలీక్యాప్టర్‌లో బయల్దేరి బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారని అధికార వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగతం పలికేందుకు రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ మంగళవారం సాయంత్రం పుట్టపర్తి చేరుకున్నారు. రాత్రికి ప్రశాంతి నిలయంలోని శ్రీనివాస గెస్ట్ హౌస్‌లో బస చేశారు. బుధవారం ఉదయం 8:50 గంటలకు రాష్ట్ర గవర్నర్ పుట్టపర్తి నుంచి రోడ్డు మార్గాన బయల్దేరి సెంట్రల్ యూనివర్సిటీకి చేరుకుని రాష్ట్రపతికి స్వాగతం పలక నున్నారు. ఇదే సమయంలో మంత్రి నారా లోకేష్ కూడా బుధవారం విజయవాడ విమానాశ్రయం నుంచి 7:20 గంటలకు బయల్దేరి పుట్టపర్తి ఎయిర్ పోర్టుకు 8:00 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయల్దేరి 10:00గంటలకు సెంట్రల్ యూనివర్సిటీకి చేరుకుని రాష్ట్రపతికి స్వాగతం పలికి స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12:30 గంటలకు వర్సిటీ నుంచి మంత్రి నారా లోకేష్ బయల్దేరి మధ్యాహ్నం 2:30 గంటలకు పుట్టపర్తి ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి తిరుపతికి వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆనంద్, జిల్లా ఎస్పీ జగదీష్ తదితర అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. జాయింట్ కలెక్టర్ బి.విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాస్‌కుమార్, తాడిపత్రి ఏఎస్పి రోహిత్‌కుమార్ చౌదరి, అడ్మిన్ ఏఎస్పి నాగభూషణం, ఏఆర్ అడిషనల్ ఎస్పి ఇలియాజ్‌బాషా, జిల్లా ఫారెస్ట్ సెటిల్ మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, ఆర్డీఓలు రామ్మోహన్, వసంతబాబు తదితరులు పాల్గొన్నారు.

## మల్లయ్యకొండలో మైనింగ్ వివాదం

● కూటమి ప్రభుత్వంపై పెద్దిరెడ్డి తీవ్ర ఆరోపణలు



తిరుపతిరూరల్, జూన్ 30 ప్రభాతవార్త: మల్లయ్యకొండలో ఇనుప ఖనిజం దోపిడికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని, దీనికి బాధ్యత వైసిపిపై మోపే ప్రయత్నం జరుగుతోందన్నారు. మంగళవారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైయస్సార్సీపి పాలనలో మల్లయ్యకొండ అభివృద్ధికి రూ.20కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. గతంలో కలినడక కూడా సరిగ్గా లేని పరిస్థితి నుండి ఆలయ జీర్ణోద్ధరణ, రహదారులు, విద్యుత్, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించామని చెప్పారు. టిడిపి హయాంలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు.

2022లో ఎర్రకొండలో మైనింగ్‌కు కేంద్ర అనుమతులు వచ్చినప్పటికీ భక్తుల మనో భావాలను గౌరవించి, ఆ ప్రక్రియను నిలిపివేశామని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం సాధుకొండ, శివపురం ప్రాంతాల్లో మైనింగ్‌కు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఆరోఫించారు. 2004 నుంచే జియో మైసూర్ సంస్థ మైనింగ్ ప్రతిపాదనలు తీసుకువచ్చిందని, అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు పాత్రను ప్రస్తావించారు. 2015లో ప్రాస్పెక్టింగ్ లైసెన్స్ ఇచ్చినట్లు తెలిపారు.

తాజాగా సాధుకొండ, శివపురం ప్రాంతాల్లో వందల హెక్టార్లలో మైనింగ్‌కు టెండర్లు పిలిచి, లైసెన్స్‌లు జారీ చేసింది కూటమి ప్రభుత్వమే అన్నారు. ఎర్రకొండలో కూడా ప్రవేట్ సంస్థలకు లైసెన్స్‌లు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. మల్లయ్యకొండను పవిత్ర ప్రాంతంగా భావించే భక్తుల మనోభావాలను గౌరవించాలని కోరారు. అక్కడ మైనింగ్‌కు యత్నిస్తే వైయస్.జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి ఉద్యమం చేపడుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో మామిడి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. పాలన కంటే కేసులు, వేధింపులకే ప్రాధాన్యం ఇస్తోందని మండిపడ్డారు.

## అయోధ్య రామాలయ అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

● సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు రాఘవులు




తిరుపతి, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి: రాముడు అందరికీ ఆదర్శనీయుడని నిత్యం పాలకులు ఒక పక్క వేదాలు వల్లిస్తుంటే, మరో పక్క రాముడు కొలువైన అయోధ్య ఆలయంలో కోట్లాది రూపాయలను నిర్వాహకులే అక్రమంగా దోచేశారని, ఈ అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బివి రాఘవులు డిమాండ్ చేశారు. తిరుపతిలో మంగళవారం జరిగిన అవనిగడ్డ వీరవర్మ జయంతి సభలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ అయోధ్య ఆలయంలో జరిగిన అక్రమాలపై తూతూ మంత్రంగా, ట్రస్టీలే విచారణ చెప్పడం సరైనది కాదని, ఈ విచారణ న్యాయ వ్యవస్థ కనుసన్నల్లో జరగాలన్నారు. నిత్యం మతతత్వంతో విరవేగా ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ ఈ ఘటనపై సమాధానం చెప్పాలన్నారు. తిరుపతి కేంద్రంగా పనిచేస్తున్న టిటిడి స్వతంత్రంగా వ్యవహరిస్తుంటే, దానిని కూడా అయోధ్య ఆలయం లాగే ప్రశ్నల ద్వారా నిర్వహించాలని ఇటీవల డిమాండ్ లేవనెత్తారని, అలాంటి అయోధ్య ఇప్పుడు ఏమైందో అందరికి అర్థం అవుతుందన్నారు. టిటిడి ప్రభుత్వ ఆధీనంలో ఉండడంతో కొంతైనా పారదర్శకత్వం ఉందని గుర్తు చేశారు. జూలై 1 నుంచి ఉపాధి పథకం కొత్తగా అమలు చేయనున్నారని, అది ఉపాధి కల్పన కాదు బక్షి ంచే పని, దీనివల్ల కూలీలకు ఇబ్బందులు తప్ప ఉన్నారు. ఇందులో రాష్ట్ర, కేంద్రల మధ్య 40-60 శాతం నిబంధనలు తొలగించకపోతే కూలీలు నష్టపోతారన్నారు. కేంద్రంలోని మోడీ నిర్ణయాల వల్ల రాష్ట్రంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, ఎన్డిఏ కూటమిలో ఉన్న చంద్రబాబు కనీసం విశించకపోవడం దారుణం అన్నారు. వైసిపి టిడిపిలు రెండు దొందు దుందులే అని, రాష్ట్రంలో బూతులు తిట్టుకుంటూ, కేంద్రంలో మాత్రం ఐక్యంగా మోడీకి జై కొడుతున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని లూటీ చేయడంలో వైసిపి టిడిపి ఇద్దరు సమానమేనని. కార్పొరేట్ శక్తులకు రాష్ట్ర సంపదను దోచి పెట్టడంలో ఇద్దరు పోటీపడుతున్నారని ధ్వజమెత్తారు.

# డంపింగ్ యార్డు రహిత మున్సిపాలిటిలే ప్రభుత్వ లక్ష్యం

● రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ




సచివాలయం, జూన్ 30 ప్రభాతవార్త: రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలను డంపింగ్ యార్డు రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం సమగ్ర కార్యాచరణను అమలుచేస్తుందని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. మున్సిపాలిటీల్లో ప్రతిరోజు ఉత్పత్తయ్యే ఘన వ్యర్థాలను అదేరోజు పూర్తిగా తరలించి శాస్త్రీయంగా ప్రాసెస్ చేసే విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై మంగళవారం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ అధికారులు, రాష్ట్రంలోని మున్సిపల్ కమీషనర్లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సమావేశానికి స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్‌కుమార్ రెడ్డి ప్రత్యక్షంగా హాజరుకాగా, డైరెక్టర్ సంపత్‌కుమార్, వివిధ మున్సిపాలిటీల కమీషనర్లు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. రాష్ట్రంలో ఘన వ్యర్థాల నిర్వహణ కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల పురోగతిని మంత్రి సమీక్షించారు. ఇప్పటికే విశాఖపట్నం, గుంటూరు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లకు పలు మున్సిపాలిటీల నుంచి చెత్తను తరలించి శాస్త్రీయంగా ప్రాసెస్ చేస్తున్నట్లు అధికారులు వివరించారు. మిగిని మున్సిపాలిటీల్లో ఉత్పత్తి అయ్యే తాజా చెత్తను శాస్త్రీయంగా ప్రాసెస్ చేసేందుకు ప్రభుత్వం ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టిందని సమావేశంలో వెల్లడించారు. ఈ ప్లాంట్ల నిర్మాణ పనుల పురోగతిపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. ఫ్రెష్ వెస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ల నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి వీలైనంత త్వరగా అందుబాటులోనికి తీసుకురావాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన స్థల సేకరణను వేగవంతం చేయడంతోపాటు విద్యుత్ సౌకర్యం కల్పించే చర్యలను తక్షణమే పూర్తి చేయాలని మున్సిపాల్ కమీషనర్లకు సూచించారు. ప్రతిరోజు ఉత్పత్తయ్యే చెత్తను ఎలాంటి జాప్యం లేకుండా తరలించేందుకు అవసరమైన వాహనాల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఘన వ్యర్థాల నిర్వహణలో శాశ్వత పరిష్కారాలను అమలు చేయడం ద్వారా రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలను డంపింగ్ యార్డు రహితంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి డాక్టర్ పి.నారాయణ తెలిపారు.

## మాల్దీవుల ప్రతినిధి బృందం పర్యటన

విజయవాడ, జూన్ 30 ప్రభాతవార్త: మాల్దీవుల ఐలాండ్ కౌన్సిళ్ళకు ఎన్నికైన 26మంది ప్రతినిధుల బృందం మంగళవారం ఎన్‌టిఆర్‌జిల్లా గుంటుపల్లిలో పర్యటించారు. మల్దీవుల ప్రతినిధులకు హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్సిటిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ శిక్షణ నిస్తుంది. ఈనేపథ్యంలో ఎన్‌టిఆర్‌జిల్లాలో అమలు అవుతున్న పలు ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ప్రతినిధుల బృందం గత రెండురోజులుగా జిల్లాలో పర్యటిస్తున్నారు. గుంటుపల్లిలో పర్యటించిన ఈబృందం స్వయం సహాయక సంఘాల మహిళల సాధికారతకు అమలు అవుతున్న పథకాలు, కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామసభ, మహిళాసభ, బాలసభలో పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. రైజ్‌కేంద్రం ద్వారా మహిళలకు ఇస్తున్న శిక్షణా కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికలను తెలుసుకున్నారు. అనంతరం విజయవాడలోని కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాస్థాయి అధికారుల సమావేశానికి హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా అమలు అవుతున్న పలు పథకాలను కలెక్టర్ లక్ష్మీశా మాల్దీవుల ప్రతినిధులకు వివరించారు. ఈసందర్భంగా మాల్దీవుల ప్రతినిధులు మాట్లాడుతూ చెత్తనుండి సంపద కేంద్రాల పనితీరు బాగుందని కితాబిచ్చారు. రైజ్ కేంద్రంలో శిక్షణ పొంది వ్యాపారాలు చేస్తున్న మహిళల విజయగాథలు తమకు స్ఫూర్తినిచ్చాయన్నారు.

## ఫుడ్ ప్రాసెసింగ్‌కు అపార అవకాశాలు

● కాంటినెంటల్ కాఫీ అధినేత చల్లా రాజేంద్ర ప్రసాద్




అనంతపురం, జూన్ 30 ప్రభాతవార్త బ్యూరో: రైతులు నాణ్యమైన ఆలోచనలతో దృఢ సంకల్పంతో ముందుకు సాగాలని, నాణ్యమైన ఉత్పత్తులను అందించడం ద్వారా అందరూ ప్రగతి పథంలో ముందుకు సాగవచ్చని కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ ప్రాడక్ట్ కార్యనిర్వహణ అధికారి చల్లా రాజేంద్ర ప్రసాద్ వెల్లడించారు. ఉద్యాన శాఖ, కాంటినెంటల్‌కాఫీ వారు సంయుక్తంగా అనంతపురంలో మంగళవారం ఉద్యాన పంటలు ఫుడ్ ప్రాసెసింగ్ అవకాశాలపై రైతు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఏపిఎంఐపి అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, అడిషనల్ డైరెక్టర్ బి.హరినాథరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఉద్యాన పంటల సాగు, ఫుడ్ ప్రాసెసింగ్ అవకాశాలు అనే అంశంపై రైతులతో ముఖాముఖి కార్యక్రమానికి కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ ప్రాజెక్టులు కార్యనిర్వహణ అధికారి చల్లా రాజేంద్ర ప్రసాద్ ఎక్కువ చొరవ చూపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు ఫుడ్ ప్రాసెసింగ్‌కు అనంతపురం జిల్లాలో ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న విషయంపై చల్లా రాజేంద్ర ప్రసాద్, ఏపి ఎంఐపి అధికారులు, ఉద్యానవన శాఖ అధికారులు అడిగిన మేరకు రైతులు ఎన్నో అభిప్రాయాలను, ప్రతిపాదనలను తీసుకొచ్చారు. ఉద్యానవన పంటల్లో మార్కెటింగ్ సమస్యను పరిష్కరించాలని, ఉపాధిహామీ పథకాన్ని రైతులకు అనుసందానించాలని, ఉద్యానవన పంట ఉత్పత్తులను వైన్ తయారు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించాలని సూచించారు. ఎంఐపి అడిషనల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, అడిషనల్ డైరెక్టర్ హరినాథ్‌రెడ్డితోపాటు ముఖ్యులు కెఎస్.రాజు, ఫకృతి వనం ఫౌండర్ ప్రసాద్, శంకర్ మానే, శంకర్‌నాయక్, కెఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మకి 26న తెలంగాణ బోనం


ఇంద్రకీలాద్రి, జూన్ 30 ప్రభాతవార్త: దుర్గమ్మకి జులై 26న తెలంగాణ బోనాలు సమర్పిస్తామని హైదరాబాద్ భాగ్యనగర్ శ్రీ మహంకాళీ జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ సభ్యుల బృందం తెలిపారు. వారు మంగళవారం శ్రీ కనకదుర్గమ్మని దర్శించుకున్నారు. అనంతరం బోనాలు కమిటీ చైర్మన్ మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణని కలిసి 16 సంవత్సరాల నుండి వస్తున్న ఆనవాయితీ ప్రకారం ఈ సంవత్సరం కూడా శ్రీ కనకదుర్గమ్మకి బోనాలు సమర్పిస్తామని, జులై 26న కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సమాచారం లేఖ అందజేశారు.

దుర్గమ్మ సేవలో విఐపిలు: దుర్గమ్మని ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి విజయ్ శర్మ తమ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అలాగే ఏపి దేవదాయ శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీ డా ఎం.హరిజవహర్ లాల్ మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు శంకర్ శాండిల్య మరియు ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం గావించారు.



# భక్తుల కోర్కెలు తీర్చే పవిత్ర స్థలం బారా షహీద్ దర్గా

**రొట్టెల పండుగ ముగింపు వేడుకల్లో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి**



నెల్లూరు(వైద్యం), జూన్ 30 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు అద్భుత ఏర్పాట్లు చేసిన మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి జిల్లా యంత్రాంగానికి అభినందనలు నెల్లూరు బారా షహీద్ దర్గాల ఐదు రోజుల రొట్టెల పండుగ మంగళవారం ముగిసింది. ఈ ముగింపు వేడుకలకు కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో ఉన్న బారా షహీద్ దర్గాలో జరిగే రొట్టెల పండుగ ఎంతో పవిత్రమైన పండుగని కొనియాడారు. ఈ పండుగకు దేశ, విదేశాల నుంచి, అలాగే రాష్ట్రం నలుమూలల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని చెప్పారు. భక్తులు తమ కోరికలు నెరవేరితే, లేదా ఏవైనా కోరికలు ఉంటే ఇక్కడ రొట్టెలు వదలడం, పట్టుకోవడం చేస్తుంటారని తెలిపారు. ఈ సంప్రదాయంపై ఉన్న బలమైన నమ్మకం వల్లే ఏటా లక్షల మంది భక్తులు ఈ పండుగకు వస్తున్నారని, తాను కూడా గత 20 సంవత్సరాలుగా ఇక్కడికి వచ్చి ఆశీస్సులు పొందుతున్నానని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి గుర్తుచేసుకున్నారు. వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్‌తో కలిసి తాను రొట్టెలు మార్చుకున్నట్లు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు.





# మరో సిరీస్‌కు సిద్ధమైన టీమిండియా

*** నేడు ఇంగ్లండ్‌తో తొలి టి20 మ్యాచ్ *వైభవ్‌కు ఛాన్స్? * రాత్రి 10 గం.కు ప్రారంభం**

**చెస్టర్లీస్ట్రీట్(లండన్), జూన్ 30:** టీ20 ఛాంపియన్స్ టీమిండియా మరో సిరీస్‌కు సిద్ధమైంది. ఐర్లాండ్‌తో టీ20 సిరీస్ ఓటమి నుంచి ఇంకా తేరుకోని శ్రేయాస్ సేన...ఇంగ్లాండ్‌తో 5మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది.ఇందులో భాగంగా నేడు చెస్టర్లీస్ట్రీట్‌లో జరిగే తొలి టీ20 మ్యాచ్‌లో తలపడనుంది. పసికూన ఐర్లాండ్ చేతిలో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలై విమర్శలు ఎదుర్కొంటున్న మెన్ ఇన్ బ్లూ.. ఇంగ్లాండ్‌ను దాని సొంతగడ్డపై నిలువరిస్తుందా? అన్నది క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

**శ్రేయాస్ శకం**

శ్రేయాస్ అయ్యర్ సారథ్యంలో టీమిండియా తొలి మేజర్ సిరీస్ ఆడబోతోంది. ఇది కెప్టెన్‌గా శ్రేయాస్‌కు అసలు సిసలు పరీక్ష. తొలి సిరీస్‌లోనే ఓటమి ఎదుర్కొన్న శ్రేయాస్.. ఇంగ్లాండ్‌పై గెలుపుతో విమర్శలకు చెక్ పెట్టాలని చూస్తున్నాడు. తుది జట్టులో ఒకటి రెండు మార్పులతో బరిలోకి దిగడంపై ఫోకస్ పెట్టింది.

**వైభవ్ అరంగేట్రం?**

ఐర్లాండ్‌పై యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం చేస్తాడని అంతా భావించినా అది జరగలేదు. వైభవ్‌కు అవకాశం ఇవ్వకుండా విమర్శలపాలైన టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ ఇంగ్లాండ్‌పై కచ్చితంగా బేబీ బాస్‌ను ఆడించే అవకాశాలున్నాయి.తొలి టీ20లోనే వైభవ్ అరంగేట్రం ఉండటం ఖాయంగా కనిపిస్తోంది. ఐర్లాండ్‌పై విఫలమైన సంజు శాంసన్, ఇషాన్ కిషన్‌లో ఒకరిని బెంచ్‌కే పరిమితం చేసి అబిషేక్‌తో కలిసి వైభవ్‌ను ఓపెనింగ్‌కు పంపే ఛాన్స్ ఉంది. పేస్‌కు అనుకూలించే ఇంగ్లాండ్ పిచ్‌లపై ఎలా ఆడతాడన్నది ఉత్కంఠ రేపుతోంది. మరోవైపు ఇంగ్లాండ్... సొంతగడ్డపై పటిష్టంగా ఉంది. హ్యారీ బ్రూక్, బట్లర్, జోర్డాన్ కాక్స్, బెతెల్, విల్ జాక్స్, ఫిల్ సాల్ట్, బాంటన్ వంటి ఆటగాళ్లతో ఇంగ్లాండ్ బ్యాటింగ్ ఆర్డర్ బలంగా కనిపిస్తోంది. వీరిని అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, శివమ్ దూబె, ప్రిన్స్ యాదవ్‌లతో కూడిన పేస్ దళం ఎంతవరకు కట్టడి చేస్తుందన్న దానిపైనే టీమిండియా విజయావకాశాలు ఉన్నాయి.

**బౌలింగ్‌కు అనుకూలంగా..**

తొలి టీ20 మ్యాచ్ జరిగే చెస్టర్లీస్ట్రీట్ రివర్‌సైడ్ పిచ్ బౌలర్లకు అనుకూలిస్తుంది. ఇక్కడ గత ఎనిమిది మ్యాచ్‌ల్లో బౌలర్లదే ఆధిపత్యం. సగటు స్కోరు 138 కాగా.. అత్యధిక స్కోరు 195. ఈ మ్యాచ్ భారతకాలమానం ప్రకారం రాత్రి 10 గంటలకు మొదలుకానుంది.

**భారత్:** శ్రేయస(కెప్టెన్), తిలక్(వైస్ కెప్టెన్), బిష్ణోయ్, అభిషేక్, సూర్యాంశ్, ప్రసిద్ధ్ కృష్ణ, శాంసన్, వైభవ్, అక్షర్, హర్షిత్, ఇషాన్ కిషన్, వాషింగ్టన్, అర్ష్‌దీప్, దూబె, ప్రిన్స్ యాదవ్.

## ఆసియా క్రీడలకు భారత్ ఉమెన్ టీమ్

**ముంబై, జూన్ 30:** జపాన్ వేదికగా సెప్టెంబర్‌లో జరిగే ఆసియా క్రీడల్లో పాల్గనే 15 మంది సభ్యుల భారత మహిళల క్రికెట్ జట్టును బిసిసిఐ ప్రకటించింది. కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన వ్యవహరిస్తారు. స్టార్ ప్లేయర్లు జెమీమా రోడ్రిగ్స్, షఫాలీ వర్మ, దీప్తి శర్మ, రిచా ఘోష్, రేణుకా సింగ్ తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. ఆల్‌రౌండర్ శ్రేయాంక ఫిట్‌నెస్ క్లియరెన్స్‌కు లోబడి ఎంపికైంది. యస్తికా భాటియా స్థానంలో 17 ఏళ్ల వికెట్ కీపర్ కమిలిని జట్టులోకి ఎంపికైంది. కమిలిని ఇటీవలి కాలంలో చక్కని ఆటతీరుతో ఆకట్టుకుంటోంది. తాజాగా టీ20 ప్రపంచకప్ నుంచి వైదొలిగిన భారత ఉమెన్ జట్టులో ఇదొక్కటే మార్పు. కాగా, ఆసియా క్రీడల్లో భారత్ మరోసారి టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. హాంగ్‌ఝౌ వేదికగా జరిగిన గత క్రీడల్లో టీమిండియా స్వర్ణం గెలుపొందింది.


**భారత్ జట్టు:** హర్మన్‌ప్రీత్(కెప్టెన్), స్మృతి మంధాన,షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్‌కీపర్), కమలిని, భారతీ ఫుల్మాలి, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డి, శ్రేయాంక పాటిల్, రాధా యాదవ్, నందిని శర్మ.



## నేటి నుంచి జాగ్రెబ్ ర్యాపిడ్ చెస్ టోర్నీ

**జాగ్రెబ్(క్రొయేషియా), జూన్ 30:** జాగ్రెబ్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నీలో భారత గ్రాండ్ మాస్టర్లు గుకేష్, ప్రజ్ఞానంద భారీ ఆశలతో బరిలోకి దిగుతున్నారు. నేడు జాగ్రెబ్‌లో ప్రారంభమయ్యే ఈ టోర్నీలో ప్రపంచ అత్యుత్తమ చెస్ ఆటగాళ్లు తలపడనున్నారు. ప్రపంచ నంబర్ వన్ మాగ్నస్ కార్ల్‌సెన్‌ను వెనక్కి నెట్టి నార్వే చెస్ టైటిల్ సాధించిన ప్రజ్ఞానంద... ఈ టోర్నీలోనూ హాట్ ఫేవరెట్‌గా ఉన్నాడు. ర్యాపిడ్ విభాగంలో 9 రౌండ్లు, బ్లిట్జ్‌లో 18 రౌండ్లు జరుగుతాయి. ర్యాపిడ్‌లో ప్రతి విజయానికి 2 పాయింట్లు, డ్రాకు ఒక పాయింట్ లభిస్తాయి. అదే బ్లిట్జ్‌లో విజయానికి ఒక పాయింట్, డ్రాకు అర పాయింట్ కేటాయిస్తారు. ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ గుకేష్ తిరిగి ఫామ్ చాటాలని చూస్తున్నాడు. విన్సెంట్ కీమర్(జర్మనీ), అనిష్ గిరి(హాలండ్), అలీరేజా ఫిరౌజా(ఫ్రాన్స్) రేటింగ్ పరంగా ఫేవరెట్లుగా బరిలోకి దిగుతున్నారు.

# తొలి రౌండ్ గట్టెక్కిన సిన్నర్, జోకోవిచ్




**లండన్, జూన్ 30:** వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో టాప్ సీడ్లకు ఆరంభంలోనే చుక్కలు కనిపిస్తున్నాయి. పురుషుల ప్రపంచ నంబర్‌వన్ జానిక్ సిన్నర్ తొలి రౌండ్‌లోనే అయిదు సెట్ల హోరాహోరీ పోరు ఎదుర్కొని ఊపిరిపీల్చుకున్నాడు. అలాగే మరో అగ్రశ్రేణి ప్లేయర్ నోవాక్ జోకోవిచ్ కూడా మూడు గంటల పోరులో గెలిచి రెండో రౌండ్ చేరాడు.

పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో సిన్నర్ 4-6, 6-3, 6-7, 6-2, 6-3తో సెర్బియాకు చెందిన అన్‌సీడెడ్ మియోమిర్ కెమనోవిక్‌పై చెమటోడ్చి నెగ్గాడు. మూడున్నర గంటల పాటు జరిగిన ఐదుసెట్ల మ్యాచ్‌లో సిన్నర్ ఓ దశలో వెనుకబడి ఓటమి వైపు సాగాడు. తొలి సెట్‌లోనే సిన్నర్‌కు కెమనోవిక్ షాకిచ్చాడు. 6-4తో నెగ్గి శుభారంభం చేశాడు. రెండో సెట్‌ను సిన్నర్ నెగ్గి సమవుజ్జీగా నిలిచాడు. ఇక మూడో సెట్‌ను టై బ్రేక్‌లో కెమనోవిక్ గెలుచుకోవడంతో మ్యాచ్ హోరాహోరీగా సాగింది.అయితే నాలుగో సెట్‌లో వెనుకబడ్డ కెమనోవిక్ ఐదో సెట్‌లో తొలి గేమ్ గెలిచినప్పటికీ ఆతర్వాత పుంజుకోలేకపోయాడు. అయితే ఐదు సెట్ల దాకా పోరాడిన కెమనోవిక్ మాత్రం సిన్నర్‌కు ముచ్చెమటలు పట్టించాడు. ఇక రెండో రౌండ్‌లో సిన్నర్ పోర్చుగల్‌కు చెందిన నూనో బోర్జెస్‌తో తలపడనున్నాడు.

**సిన్నర్ దారిలోనే జోకోవిచ్**

ఇక మిగిలిన మ్యాచ్‌ల్లో నొవాక్ జోకోవిచ్, డానిల్ మెద్వెదెవ్, సిట్సిపాస్ తొలి రౌండ్‌లో నెగ్గి ముందంజ వేశారు. ఏడుసార్లు వింబుల్డన్ ఛాంపియన్ జోకోవిచ్.. ఈసారి టైటిల్ అందుకుని అత్యధిక వయస్సులో వింబుల్డన్ నెగ్గి ప్లేయర్‌గా రికార్డుపై గురిపెట్టాడు. అయితే తొలి రౌండ్‌లో అతనికి చైనా ప్లేయర్ వు గట్టిపోటీ ఇచ్చాడు. మూడు గంటలకు పైగా సాగిన ఈ పోరులో జోకోవిచ్ 6-4, 5-7, 6-4, 6-4తో చైనా ప్లేయర్‌ను ఓడించాడు.

**రెండో రౌండ్‌లో సబలెంకా**

ఇక మహిళల సింగిల్స్‌లో సీడెడ్ ప్లేయర్ అలవోక విజయాలతో ముందంజ వేశారు. నాలుగుసార్లు గ్రాండ్ స్లామ్ విజేత సబలెంకా 65 నిమిషాల్లో సెర్బియా క్వాలిఫయర్ కొస్టావిక్‌ను 6-2, 6-3తో ఓడించింది. రెండో రౌండ్‌లో అమెరికన్ మెక్‌కార్టనీ కెస్లర్‌తో తలపడనుంది. ఫ్రెంచ్ ఓపెన్ ఫైనలిస్ట్ మజా చాలిస్కాకు తొలి రౌండ్‌లోనే షాక్ తగిలింది. ఆమెపై 2-6, 7-5, 6-2తో థాయిలాండ్ అన్‌సీడెడ్ మనంచాయ సంచలన విజయం అందుకుంది.

# జర్మనీ, నెదర్లాండ్స్ పెనాల్టీ షూటౌట్




## ప్రిక్వార్టర్స్‌లో బ్రెజిల్, మొరాకో, పరాగ్వే

**కాలిఫోర్నియా, జూన్ 30:** సాకర్ వరల్డ్‌కప్‌లో సంచలనాల మోత మోగుతోంది. నాకౌట్ మ్యాచ్‌లు చివరి నిమిషాల వరకు ఉత్కంఠ రేపుతున్నాయి. హాట్ ఫేవరెట్లు జర్మనీ, నెదర్లాండ్స్‌లు పెనాల్టీ షూటౌటయ్యాయి. జర్మనీపై పరాగ్వే, నెదర్లాండ్స్‌పై మొరాకో పెనాల్టీ షూటౌట్‌లో గెలుపొంది ప్రి క్వార్టర్ ఫైనల్ చేరాయి. నాకౌట్ మ్యాచ్‌లో జపాన్‌పై బ్రెజిల్ 96వ నిమిషంలో గోల్ సాధించి ముందంజ వేసింది.

**జర్మనీ ఇంటిదారి :** ఫిఫా కప్‌లో మాజీ చాంపియన్ జర్మనీ ఆట ముగిసింది. ఐదోసారి ఫిఫా చాంపియన్‌గా నిలవాలని భావించిన జర్మనీకి పరాగ్వే చెక్ పెట్టింది. పెనాల్టీ షూటౌట్‌లో 4-3తో పరాగ్వే గెలుపొందింది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన పోరులో నిర్ణీత సమయం ముగిసేలోపు ఇరుజట్లు 1-1తో సమంగా నిలిచాయి. జర్మనీ తరఫున ఆట 54వ నిమిషంలో కాయ్ హావెర్ట్జ్ గోల్ చేయగా, పరాగ్వే తరఫున 42వ నిమిషంలో జులియో ఎన్సియో గోల్ సాధించాడు. అదనపు సమయంలోనూ ఇరు జట్లు గోల్స్ చేయడంలో విఫలమవడంతో విజేతను తేల్చేందుకు పెనాల్టీ షూటౌట్ అనివార్యమైంది. 2018, 2022 ఫిఫా ప్రపంచకప్పుల్లో గ్రూప్ దశలోనే వెనుదిరిగిన జర్మనీ ఈసారి మాత్రం గ్రూప్ దశను దాటినప్పటికీ రౌండ్ ఆఫ్ 16ను దాటడంలో విఫలమయ్యింది.

**నెదర్లాండ్స్‌కు మొరాకో షాక్**

మరో మ్యాచ్‌లో మొరాకో సైతం నెదర్లాండ్స్‌కు అదే తరహాలో షాకిచ్చింది. నిర్ణీత సమయం, అదనపు సమయంలో ఇరు జట్లు చెరో గోల్ చేసి సమంగా నిలువగా.. పెనాల్టీ షూటౌట్‌లో మొరాకో పటిష్టమైన నెదర్లాండ్స్‌ను 3-2తో ఓడించి ప్రీక్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది.ఈ మ్యాచ్‌లో తొలుత ఆధిక్యం నెదర్లాండ్స్‌కే లభించింది. 72వ నిమిషంలో కోడి గాక్పో గోల్ చేసి తన జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు.ఇంజరీ టైమ్ (91వ నిమిషం)లో ఇస్సా డియోప్ హెడ్డర్‌తో గోల్ చేసి స్కోరును 1-1తో సమం చేశాడు.దీంతో పెనాల్టీ షూటౌట్ నిర్వహించగా.. కీలక సమయంలో మొరాకో గోల్‌కీపర్ యాస్సిన్ బౌనో నెదర్లాండ్స్ ఆటగాడు క్రిసెన్సియో సమ్మర్‌విల్లే పెనాల్టీని అద్భుతంగా అడ్డుకున్నాడు. అనంతరం ఇస్మాయిల్ సైబారి తన కిక్‌ను గోల్‌గా మలిచి మొరాకోకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.




# రెండునెలల్లో ఆర్థిక లోటు 1.62 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ, జూన్ 30:** దేశ ఆర్థిక వ్యవస్థపై అంతర్జాతీయ పరిణామాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో కేంద్ర ప్రభుత్వ ఆర్థికలోటు రూ.1.62 లక్షల కోట్లకు చేరింది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరల పెరుగుదల, ప్రభుత్వ వ్యయాలు పెరగడం ఇందుకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ విడుదల చేసిన డేటానుచూస్తే 2026-27 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన మొత్తం ఆర్థికలోటు లక్ష్యంలో ఇప్పటివరకు 9.6 శాతం నమోదైంది. మే నెలాఖరు నాటికి ఫిస్కల్ డెఫిసిట్ రూ.1.62 లక్షల కోట్లుగా ఉంది. ఏప్రిల్ నెలలో నమోదైన రూ.3.62 లక్షల కోట్లతో పోలిస్తే మేలో లోటు తగ్గడం కొంత ఊరటనిచ్చే అంశంగా భావిస్తున్నారు. ఏప్రిల్‌లో అది వార్షిక లక్ష్యంలో 21.4 శాతానికి చేరగా మే నాటికి 9.6 శాతానికి తగ్గింది.

ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడం ప్రభుత్వ ఆదాయం, వ్యయాల మధ్య అంతరాన్ని మరింత పెంచింది. ఈ పరిస్థితుల్లో విండ్‌ఫాల్ ట్యాక్స్ కింద విధించే స్పెషల్ అడిషనల్ ఎక్సైజ్ డ్యూటీని కేంద్ర ప్రభుత్వం తగ్గిస్తూ వస్తోంది.మే నెలలో నికర పన్నుల వసూళ్లు రూ.3.48 లక్షల కోట్లకు చేరాయి. ఇది వార్షిక లక్ష్యంలో 12 శాతం. మరోవైపు మౌలిక వసతుల అభివృద్ధికి చేసే మూలధన వ్యయం రూ.2.51 లక్షల కోట్లకు చేరి వార్షిక లక్ష్యంలో 20.5 శాతం నమోదైంది.ఏప్రిల్‌మే కాలంలో రెవెన్యూ డెఫిసిట్ కూడా గణనీయంగా తగ్గింది. ఏప్రిల్‌లో రూ.1.82 లక్షల కోట్లుగా ఉన్న రెవెన్యూ లోటు మే నాటికి రూ.68,985 కోట్లకు తగ్గింది. ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులు, సబ్సిడీలు వంటి ఖర్చులు రెవెన్యూ వ్యయంలో భాగంగా ఉంటాయి.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో కేంద్ర ప్రభుత్వ మొత్తం వ్యయం రూ.8.81 లక్షల కోట్లకు చేరింది. ఇది వార్షిక అంచనా వ్యయంలో 16.5 శాతం. ఇదే సమయంలో ప్రభుత్వ మొత్తం రాబడులు రూ.7.18 లక్షల కోట్లుగా నమోదై పూర్తి సంవత్సర లక్ష్యంలో 19.7 శాతానికి చేరుకున్నాయి. పన్నుల ద్వారా వచ్చే రెవెన్యూ ఆదాయం రూ.6.99 లక్షల కోట్లకు చేరగా పన్నేతర ఆదాయం ఇప్పటికే వార్షిక లక్ష్యంలో సగానికి పైగా చేరడం విశేషం. పన్నేతర ఆదాయం రూ.3.50 లక్షల కోట్లుగా నమోదైంది. ఇందులో డివిడెండ్లు, ప్రభుత్వ రంగ సంస్థల లాభాల రూపంలో వచ్చిన ఆదాయం రూ.2.89 లక్షల కోట్లుగా ఉంది.

# ఆర్ అండ్ డి కోసం కోల్ ఇండియా 1900 కోట్ల పెట్టుబడులు

**న్యూఢిల్లీ, జూన్ 30:** ప్రభుత్వ రంగ బొగ్గు దిగ్గజం కోల్ ఇండియా లిమిటెడ్ ఆర్‌అండ్‌డీ కార్యకలాపాలకు భారీగా పెట్టుబడులు పెడుతోంది. 2030 ఆర్థిక సంవత్సరం నాటికి సుమారు రూ.1,900 కోట్లను ఆర్‌అండ్‌డీ కోసం వెచ్చించనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు తెలిపింది. గనుల తవ్వకాలను ఆధునికీకరించడం, పర్యావరణహిత సాంకేతికతలను అభివృద్ధి చేయడం, భవిష్యత్ ఇంధన అవసరాలకు అనుగుణంగా కొత్త టెక్నాలజీలను రూపొందించడం ఈ పెట్టుబడి ప్రధాన లక్ష్యాలుగా పేర్కొంది.2025 ఆర్థిక సంవత్సరంలో నేషనల్ సెంటర్ ఫర్ కోల్ అండ్ ఎనర్జీ రీసెర్చ్ ఏర్పాటు ద్వారా కంపెనీ పరిశోధన కార్యక్రమాలకు కొత్త ఊపు లభించిందని తెలిపింది. ఈ కేంద్రం ద్వారా పరిశోధనలను ప్రాథమిక స్థాయి నుంచి సాంకేతిక నమూనాల అభివృద్ధి దశకు తీసుకెళ్తున్నట్లు వెల్లడించింది.కంపెనీ భవిష్యత్ వృద్ధి, సాంకేతిక పరివర్తనకు పరిశోధన, అభివృద్ధి కీలకమని కోల్ ఇండియా



సీనియర్ అధికారి తెలిపారు.2024 ఆర్థిక సంవత్సరంలో రూ.61 కోట్లుగా ఉన్న ఆర్‌అండ్‌డీ వ్యయం,2025లో నాలుగు రెట్లు పెరిగి రూ.245 కోట్లకు చేరిందని కంపెనీ వెల్లడించింది. పరిశోధనలకు మరింత ప్రాధాన్యం కల్పించేందుకు ప్రత్యేక ఆర్‌అండ్‌డీ విధానాన్ని కూడా అమల్లోకి తీసుకొచ్చింది.

పరిశ్రమ-విద్యాసంస్థల భాగస్వామ్యంలో భాగంగా ప్రముఖ ఐఐటీల్లో మూడు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఎన్‌సిసిఇ పర్యవేక్షణలో రూ.225 కోట్ల వ్యయంతో 19 పరిశోధనప్రాజెక్టులు కొనసాగుతున్నాయి.సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో మరో 13 పరిశోధన ప్రాజెక్టులు అమల్లో ఉన్నాయి. అంతర్జాతీయ సాంకేతిక భాగస్వామ్యాలను కూడా కోల్ ఇండియా విస్తరించింది. కెనడాకు చెందిన ఎర్గో ఎక్సెర్జీతో భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్, స్వీడన్‌కు చెందిన ఎరిక్సన్‌తో జాంగ్రూ భూగర్భ గనిలో 5జీసాంకేతికత అమలు,ఆస్ట్రేలియాకు చెందిన సీఎస్ఐఆర్ఓతో సంయుక్త పరిశోధన కార్యక్రమాలను చేపడుతోంది.




# గ్రీస్‌లో యుపిఐ సేవలు

## లాంఛనంగా ప్రారంభించిన పీయూష్ గోయల్

**ఏథెన్స్,జూన్ 30:** యూపీఐ తన ప్రపంచ విస్తరణలో యూరప్ దేశమైన గ్రీస్‌లో అధికారికంగా సేవలు ప్రారంభించింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. ఏథెన్స్‌లోని యూరోబ్యాంక్ ప్రధాన కార్యాలయంలో యూపీఐ ద్వారా లావాదేవీని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. పీయూష్ మాట్లాడుతూ గ్రీస్‌లో యూపీఐ సేవలు అందుబాటులోకి రావడంతో అర్హులైన వినియోగదారులు తక్షణమే, అత్యంత సురక్షితంగా నగదు బదిలీ చేసుకోవచ్చని తెలిపారు.లావాదేవీల ఖర్చు దాదాపు నామమాత్రంగా ఉంటుందన్నారు. సరిహద్దులు దాటి విలువను సృష్టించడం, ఉమ్మడి వృద్ధి కోసం భాగస్వామ్యాలను పెంపొందించడం లక్ష్యంగా సాంకేతిక పరిష్కారాలను నిర్మించాలన్న ప్రధాని మోడీ దార్శనికతకు ప్రపంచవ్యాప్తంగా యూపీఐకి లభిస్తున్న ఆదరణ నిదర్శనమని గోయల్ పేర్కొన్నారు. తన గ్రీస్ పర్యటనలో భాగంగా గోయల్ యూరోబ్యాంక్ సీఈఓ ఫోకియోన్ కరావియాస్‌తో సమావేశమయ్యారు. భారత్‌గ్రీస్ ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించడంపై ఫలవంతమైన చర్చలు జరిపారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని గ్రీక్ వ్యాపారవేత్తలను ప్రోత్సహించిన ఆయన, గ్రీస్‌లో తయారీ మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధిలో సహకారానికి ఉన్న అవకాశాలను అన్వేషించారు. యూరోబ్యాంక్, ఎన్ఐపీఎల్ భాగస్వామ్యంతో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఫెయిర్‌ఫాక్స్ డిజిటల్ సర్వీసెస్ సీఈఓ సంజయ్ తుగ్నైత్ కూడా పాల్గొన్నారు. భారత్‌ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వాణిజ్యం, పెట్టుబడులు,ఆర్థిక సహకారంలో కొత్త అవకాశాలను సృష్టిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత కంపెనీలతో చేతులు కలపాలని గ్రీక్ వ్యాపారవేత్తలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ పర్యటన రెండు దేశాల మధ్య బలమైన వ్యాపార సంబంధాలకు, ఉమ్మడి శ్రేయస్సుకు మార్గం సుగమం చేస్తుందని పియూష్ గోయల్ విశ్వాసం వ్యక్తం చేశారు.



# రెండోరోజూ నష్టాలకే పరిమితం

## సెన్సెక్స్, నిఫ్టీల్లో ఐటి షేర్ల ఒత్తిడి

**ముంబయి,జూన్ 30:** ఐటిరంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడితో మంగళవారం సెన్సెక్స్, నిఫ్టీలు నష్టాల్లోనే ముగిసాయి. ట్రేడింగ్‌లో బీఎస్ఈ సెన్సెక్స్ 249 పాయింట్లు పడిపోయి 76,478వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 80 పాయింట్లు క్షీణించి 23,865 వద్ద స్థిరపడింది. వరుసగా రెండో రోజు కూడా ప్రధాన సూచీలు నష్టాలను నమోదు చేశాయి.ఐటీ దిగ్గజాలు టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు మూడు శాతానికి చేరువలో పతనంకావడం మార్కెట్‌పై తీవ్రప్రభావం చూపింది. ఐసీఐసీఐ బ్యాంక్ షేరు కూడా క్షీణించింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.45 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.51 శాతం లాభపడగా మార్కెట్‌లో పెరిగిన షేర్ల సంఖ్య తగ్గిన షేర్ల కంటే ఎక్కువగా నమోదైంది. డాలరుతో రూపాయి మారకం విలువలు 94.65వద్ద నిలిచాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు రూ.1,42,532కి చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు జులై సెటిల్‌మెంట్‌దరలు పదిసెంట్లుపెరిగి బ్యారెల్‌కు 73.25గా నమోదయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్ల విషయానికి వస్తే యూరోపియన్ మార్కెట్లు లాభాల్లో ట్రేడయ్యాయి. చైనా తయారీ రంగం మళ్లీ వృద్ధి బాట పట్టడంతో ఆసియా మార్కెట్లు మిశ్రమ ధోరణి కనబర్చాయి. అమెరికా ఫ్యూచర్స్ కూడా సానుకూల సంకేతాలు ఇచ్చాయి. ఢిల్లీ ప్రభుత్వం ఈవీ పాలసీకి ఆమోదం తెలపడంతో ఐషర్ మోటార్స్ షేరు 4.38 శాతం పడిపోయింది. ఈ పాలసీతో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల వినియోగం వేగంగా పెరుగుతుందనే అంచనాల నేపథ్యంలో కంపెనీపై అమ్మకాల ఒత్తిడి కనిపించింది. మరోవైపు అదానీపోర్ట్స్ దాదాపు 2శాతం లాభపడింది.విజింజం పోర్టులో 49శాతం వాటాను ఎంఎస్‌సీ గ్రూప్‌కొనుగోలు చేయనున్న ఒప్పందం ఇందుకు కారణమైంది.శిల్పా మెడికేర్, గోద్రేజ్ ప్రాపర్టీస్, వారీ ఎనర్జీస్, కల్పతరు ప్రాజెక్ట్స్, కేఈసీ ఇంటర్నేషనల్, జాగ్సన్‌పాల్ ఫార్మాస్యూటికల్స్, గోదావరి బయోరిఫైనరీస్ కంపెనీల షేర్లు కూడా లాభాలతో ముగిశాయి. ఆస్థా స్పిన్‌టెక్స్ ఐపీఓకు మంచి స్పందన లభించింది.చివరి గణాంకాల ప్రకారం ఈ ఇష్యూ 1.48 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఈనెల 29న ప్రారంభమైన ఈ ఐపీఓ జూలై 1న ముగియనుంది.మొత్తంగా ఐటీ రంగంలో అమ్మకాల ఒత్తిడి కారణంగా ప్రధానసూచీలు నష్టాల్లోముగిసినా మిడ్,స్మాల్‌క్యాప్ కొనుగోళ్లు కొనసాగడం పెట్టుబడిదారుల్లో ఆసక్తిని సూచించింది.

### పెట్రోకెమికల్ దిగుమతులపై కస్టమ్స్ మినహాయింపు

# జూలై 15 వరకు పొడిగింపు

**న్యూఢిల్లీ,జూన్ 30:** పెట్రోకెమికల్ ముడి పదార్థాల దిగుమతులకు సంబంధించిన కస్టమ్స్ డ్యూటీ మినహాయింపును కేంద్ర ప్రభుత్వం జూలై 15 వరకు కొనసాగించాలని నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది.ఈ మినహాయింపును తొలుత ఏప్రిల్ 2న తాత్కాలిక చర్యగా అమల్లోకి తీసుకువచ్చారు.జూన్ 30తో ఈ గడువు ముగుస్తుండగా ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మరో 15 రోజుల పాటు పొడిగించారు. ఈ నిర్ణయంతో ప్యాకేజింగ్, ప్లాస్టిక్స్, వస్త్ర పరిశ్రమ, ఔషధ తయారీ, రసాయన పరిశ్రమ, ఆటోమొబైల్ విడిభాగాల తయారీతో పాటు పలు తయారీ రంగాలకు ఊరట లభించనుంది. పెట్రోకెమికల్ ముడి పదార్థాల సరఫరా అంతరాయం లేకుండా కొనసాగడంతో పాటు ఉత్పత్తి వ్యయాలపై ఒత్తిడి కూడా తగ్గే అవకాశం ఉంది.మినహాయింపు పొందిన ఉత్పత్తుల్లో మెథనాల్, అన్హైడ్రస్ అమోనియా, టోల్యూయిన్, స్టైరిన్, డైక్లోరోమీథేన్, వినైల్ క్లోరైడ్ మోనోమర్, పాలీబ్యూటాడైన్, స్టైరిన్‌బ్యూటాడైన్, అన్‌సాచ్యురేటెడ్ పాలిస్టర్ రెసిన్స్ వంటి కీలక పెట్రోకెమికల్ ఉత్పత్తులు ఉన్నాయి.దేశీయ పరిశ్రమలకు అవసరమైన ముడి పదార్థాలు నిరంతరంగా అందుబాటులో ఉండేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుంది.

# డాయిచ్ బ్యాంక్ వాటా కొనుగోలు చేసిన కోటక్




**ముంబయి,జూన్ 30:** జర్మనీకి చెందిన ప్రముఖ బ్యాంకింగ్ సంస్థ డాయిచ్ బ్యాంక్ భారత్‌లోని తన రిటైల్ బ్యాంకింగ్, వెల్త్ మేనేజ్‌మెంట్ వ్యాపారాన్ని కోటక్ మహీంద్రా బ్యాంక్‌కు విక్రయించనున్నట్లు ప్రకటించింది. కార్యకలాపాలను సరళీకృతం చేయడం, మూలధనాన్ని మరింతసమర్థవంతంగా వినియోగించుకోవడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు డాయిచ్ బ్యాంక్ తెలిపింది. డాయిచ్ బ్యాంక్ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ వ్యాపార విభాగంలో సుమారు వెయ్యి మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. దాదాపు 2.7 బిలియన్ యూరోల విలువైన రుణాల పోర్ట్‌ఫోలియో ఉండగా సుమారు లక్షా యాభై వేల మంది ఖాతాదారులకు సేవలు అందిస్తోంది.ఈ ఒప్పందంతో తమ వ్యాపారాన్ని మరింత సరళీకృతం చేసుకుని ప్రధాన బలాలపై దృష్టి సారించడం ద్వారా లాభదాయకతను పెంచుకోవచ్చని డాయిచ్ బ్యాంక్ బోర్డు సభ్యుడు క్లాడియో డి సాంక్టిస్ తెలిపారు. గత ఏడాదే భారత్‌లోని ఈ రిటైల్ బ్యాంకింగ్, వెల్త్ మేనేజ్‌మెంట్ వ్యాపారాన్ని విక్రయించేందుకు దేశీయ, విదేశీ బ్యాంకుల నుంచి డాయిచ్ బ్యాంక్ బిడ్లను ఆహ్వానించినట్లు వెల్లడించింది.ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలుస్తున్నప్పటికీ అధిక సంపన్నుల సంఖ్య పెరుగుతున్నా స్థానిక బ్యాంకుల నుంచి తీవ్రమైన పోటీ, నియంత్రణ పరమైన నిబంధనల కారణంగా విదేశీ బ్యాంకులు ఆశించిన స్థాయిలో ఆదాయాన్ని పెంచుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం
బుధవారం 01 జులై 2026
I


# కష్టపడిన నాయకులకు జనసేన పార్టీలో ఉన్నతస్థానం

## సామినేని ఉదయభాను




**యు.కొత్తపల్లి, జూన్ 30 (ప్రభాతవార్త) :** జనసేన పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడుతున్న ప్రతీ కార్యకర్త, నాయకులు, వీరమహిళలకు పార్టీలో ఉన్నత, సముచిత స్థానం కల్పిస్తుందని కాకినాడ పార్లమెంటు జనసేన పార్టీ సమాచార సేకరణ కమిటీ పరిశీలకులు సామినేని ఉదయభాను అన్నారు. కాకినాడ విచ్చేసిన ఆయనను కొత్తపల్లి మండల పలువురు జనసేన నాయకులు మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాల్సిన అంశాలపై చర్చించారు. పలు సూచనలను చేశారు. ఆయనను కలిసిన వారిలో మండల జనసేన పార్టీ అధ్యక్షులు రావు అక్షయ్, రాష్ట్ర ఆక్వా అభివృద్ధి కార్పోరేషన్ డైరెక్టర్ వంకా కొండబాబు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, వాడ్ర ధనబాబు తదితరులు ఉన్నారు.



# కన్నుల పండుగా ముగిసిన రేఖపల్లి కొర్రాజుల కొలుపుల జాతర

### వేలాదిగా తరలిచ్చి మొక్కులు చెల్లించుకున్న భక్తులు

### వరుణుడి కరుణతో జాతర విజయవంతం

**వి.ఆర్.పురం,జూన్ 30,ప్రభాతవార్త**

మండల కేంద్రం రేఖపల్లిలో గత పదకొండు రోజులుగా ఆదివాసీ నాయకపోడు గిరిజనులు, ఆదివాసీ కొండరెడ్లు రెండు గిరిజన తెగల జాతి సంస్కృతి, ఆచార సాంప్రదాయాల నడుమ అత్యంత వైభవంగా జరిగిన చిన్న సార్లమ్మ, పెద్ద సార్లమ్మ, కొర్రాజుల కొలుపు జాతర మంగళవారం స్వాముల అగ్నిగుండ ప్రవేశంతో కన్నుల పండువగా ముగిసింది. ఉదయం 6:30 గంటలకు ప్రధాన పూజారులు సారా పాండురాజు, సారా చిట్టెమ్మ, సూత్రు పోతిరెడ్డి, అందెల లచ్చిరెడ్డిల పర్యవేక్షణలో, మామిళ్ల చెరువుకు దేవతా మూర్తులను స్నానాలకు బాజా బజంత్రీలు, మేళ తాళాలు, మంగళవాయిద్యాల నడుమ తోడ్కొని వెళ్ళారు. స్నానాల ప్రక్రియ ముగించుకొని, దేవతా మూర్తులను ఆలయం ముందు ఏర్పాటు చేసిన అగ్నిగుండం ప్రాంతానికి ఊరేగింపుగా తోడ్కొని వచ్చారు.

నీళ్ళ బిందెలను నెత్తిన పెట్టుకొని దేవతా మూర్తులను అనుసరించిన మహిళలు....... దేవతా మూర్తుల ఊరేగింపులో, మహిళలు నీళ్ళ బిందెలను నెత్తిపై ఎత్తుకొని అగ్ని గుండం వరకు అనుసరించటం ఈ జాతరలో ఆనవాయితి. ఈ సన్నివేశం చూడముచ్చటగా ఉంటుంది. ఊరేగింపు సందర్భంగా పదుల సంఖ్యలో మహిళలు, పురుషులు పూనకాలతో ఊగిపోతు, ఊరేగింపు అగ్రభాగాన నడిచారు. సరిగ్గ 10:30 గంటలకు ఊరేగింపు ఆలయం వద్దకు చేరుకుంది.



**అపశృతులకు తావులేకుండా భక్తి పర్వశ్యంతో సాగిన అగ్నిగుండం ప్రవేశం..........**

కొర్రాజులు కొలువుల జాతరలో అత్యంత పవిత్ర, ప్రతిష్టాత్మక, ప్రమాదకరమైన కార్యక్రమం అగ్నిగుండ ప్రవేశం. వళ్లు గగుర్లు పొడిచే ఈ అరుదైన సన్నివేశం కనులారా వీక్షించేందుకు భక్తులు పోటీపడ్డారు. వేలాది మంది భక్త జనుల ఆహాకారాల నడుమ,దేవతా మూర్తులతో కణ కణ మండే అగ్నిగుండం గుండా ఆలయ ప్రవేశం జరిగింది. ఈ అరుదైన దృశ్యాన్ని దెగ్గరగా వీక్షించేందుకు ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల కమీషన్ సభ్యులు ఉండవల్లి గాంధీబాబు, ఇతర మండల స్థాయి అధికారులంతా భక్తి భావంతో నేలపై కూర్చొని వీక్షించడం కనిపించింది. ఈ తంతులో ఎలాంటి అపశృతులు చోటు చేసుకోకపోవటంతో, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, నిర్వాహకులు, అందరు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం భక్తులు దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.

**అనుకూలించిన వాతావరణం, ప్రశాంతంగా ముగిసిన జాతర..........**

కొలుపుల జాతర ముగింపు సందర్భంగా వర్షం ఆటంకం కలిగిస్తుందేమో నని అధికారులు, నిర్వాహకులు, భక్తులు ఒకింత ఆందోళన చెందారు. జాతర ఆసాంతం వర్షం కురవకపోగా, వాతావరణం పూర్తిగా చల్లబడి అనుకూలించింది. జాతర నేపద్యంలో





ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, ఎటపాక సిఐ కృష్ణ, స్థానిక ఎస్ఐ షేక్ సాదిక్, మోతుగూడెం ఎస్ఐ నజీర్ హుస్సేన్ ల పర్యవేక్షణలో భారీ పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేసి శాంతి భద్రతలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం లక్ష్మి, జడ్.పి.టి.సి సభ్యులు వాళ్ళ రంగారెడ్డి, తహసీల్దార్ సరస్వతి, ఎంపిటిసిలు పూనెం ప్రతీఫ్ కుమార్, బంధం విజయలక్ష్మి, ఎఫ్.ఆర్.ఒ కృష్ణ, స్థానిక వైద్యాధికారి షేక్ నిలూఫర్, సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, టిడిపి మండల అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్, వైసిపి మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ, బిజెపి మండల అధ్యక్షులు ముత్యాల రాంబాబు, సిపిఐ మండల కార్యదర్శి కర్నాటి యేసు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, సుమారు 6 వేలమంది భక్తులు పాల్గొన్నారు.

# జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ వితరణ.




**చింతూరు, జూన్ 30 ప్రభాత వార్త.** చింతూరు మండలం ముకునూరు గ్రామంలో 2022 వరదల్లో ఇళ్లు పూర్తిగా మునిగి కూలిపోవడంతో నిరాశ్రయులైన పూజారి భద్రమ్మ, పులి లక్ష్మయ్య, ముర్రం రాజమ్మ, ఆపికొండ దుర్గా, బీరబోయిన వెంకమ్మ, ఆకిశెట్టి బుల్లెమ్మ, పూజారి దుర్గా, మేడి మంగమ్మ, పచ్చిక రాములమ్మ కుటుంబాలకు జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ మానవత్వాన్ని చాటుతూ ఇంటి నిర్మాణానికి అవసరమైన రేకులు, పైపులను అందజేసింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుజారి పుల్లయ్య, మాజీ సర్పంచ్ బీరబోయిన సత్యకుమారి, గ్రామ పెద్ద బీరబోయిన కన్నారావు, స్థానిక నాయకులు బి. సత్యనారాయణ, జల్లి మల్లయ్య, కె. దుర్గారావు, బి. మున్నా, ట్రస్ట్ సభ్యులు బాబు, అజీజ్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్



**రంపచోడవరం జూన్ 30 ప్రభాతవార్త.** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా పోలవరం నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రంపచోడవరం గ్రామంలోని పోలింగ్ కేంద్రం నెం.204ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. తహశీల్దారుతో కలిసి పోలింగ్ కేంద్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఎన్యూమరేషన్ ఫారాల (జుఫీ) డిజిటైజేషన్ పనులను పరిశీలించి, సంబంధిత బీఎల్వోలు, సూపర్వైజర్లతో మాట్లాడారు. ఫారాల వివరాలను ఎటువంటి పొరపాట్లు లేకుండా, నాణ్యతతో, వేగవంతంగా డిజిటైజేషన్ చేయాలని సూచించారు. ప్రతి ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదు అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని, ఫీల్డ్ స్థాయిలో సేకరించిన సమాచారాన్ని సకాలంలో డిజిటైజేషన్ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఫారాల పరిశీలన, డేటా నమోదు ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. అలాగే బీఎల్వోలు, సూపర్వైజర్లు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా ఎన్యూమరేషన్, డిజిటైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. అవసరమైతే ఇంటింటికీ వెళ్లి ఓటర్లను సంప్రదించి ఫారాల సేకరణను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# మోడల్ స్కూల్ విద్యార్థి నీ సన్మానించిన మంత్రి లోకేష్



**శంఖవరం జూన్ 30 ప్రభాతవార్త** విజయవాడలోని మంగళగిరిలో జరిగిన షైనింగ్ స్టార్స్ కార్యక్రమంలో శంకవరం మోడల్ స్కూల్ విద్యార్థిని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సన్మానించారు. పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ చేతులమీదుగా విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. కాకినాడ జిల్లా శంఖవరం మండలం, శంఖవరం గ్రామం, ఏపీ మోడల్ స్కూల్ కి చెందిన సైపిరెడ్డి స్వాతి పదవ తరగతిలో 594 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో షైనింగ్ స్టార్ గా ఎన్నికయింది దీంతో విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా 30 వేల రూపాయలు, తామర పథకం, ధ్రువీకరణ పత్రం స్వీకరించింది. ఈ సందర్భంగా విద్యార్థిని సైపిరెడ్డి స్వాతినీ జిల్లా విద్యాశాఖ అధికారి పి. రమేష్ , శంఖవరం మండలం విద్యాశాఖ అధికారులు ఎస్వీ .రమణ , టి. గోవింద్ , స్కూల్ కమిటీ చైర్మన్ జి. లక్ష్మీ జ్యోతి , శంఖవరం గ్రామ పెద్దలు పర్వతసురేష్ ఏపీ మోడల్ స్కూల్ శంఖవరం ప్రిన్సిపల్. ఏ .వీర రాజు ఉపాధ్యాయ సిబ్బంది ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఒక విద్యార్థిని వల్ల శంఖవరం మోడల్ స్కూల్ రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించిందని ప్రతి ఒక్కరికి విద్య ద్వారానే మంచి గుర్తింపు లభిస్తుందని ప్రతి విద్యార్థి మంచి లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధనకై నిరంతరం తపించాలని పేర్కొన్నారు

# జిల్లాలో 48 వేల మంది ప్రభుత్వపాఠశాలల్లో విద్యాబ్యాసం..

## - జిల్లా విద్యాధికారి శ్రీరామమూర్తి



**రాజవొమ్మంగి, జూన్ 30, ప్రభాతవార్త** పోలవరం జిల్లాలో 952 పాఠశాలల్లో 48 వేల 559 మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్యాబ్యాసాన్ని చేస్తున్నారని జిల్లా విద్యాధికారి శ్రీరాములు అన్నారు. రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మార్పు చేసి అంతర్జాతీయ నమూనా పాఠశాలగా ఏర్పాటు చేయడానికి అవసరమైన స్థలం, ఇతర సౌకర్యాలు ఏర్పాటుకు పరిశీలనకు మంగళవారం వచ్చారు. 5 ఎకరాలు స్థల విస్తీర్ణం, 500 మంది విద్యార్థులకు అవసరమైన తరగతుల స్థలం, గ్రందాలయం,, ఇండోర్ స్టేడియం, ఆడిటోరియం, బహిరంగ క్రీడా సౌకర్యాలు, కిచెన్ గార్డెన్ ఇలా 20 రకాల ఏర్పాట్లకు పరిశీలన మాత్రమే చేసామన్నారు. జిల్లాలో 27 కాలేజీలు ఉన్నాయన్నారు. ఇంకా కె. జి. బి. వి., ఏకలవ్య, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో విద్యార్థులు వివరాలు రావాల్సి ఉందన్నారు. మధ్యాహ్న భోజనాన్ని డి. ఇ. ఓ. పరిశీలించారు.మధ్యాహ్న భోజన నిర్వాహకులకు జీతాలు పెంచి, ఏకరూప దుస్తులు, వర్కర్స్ అవసరమని మిడ్డే మీల్స్ వర్కర్స్ మిరియాల పార్వతి, సింహాచలం జిల్లా విద్యాధికారికి తెలిపారు. ఇంకో వర్కర్ ను ఏర్పాటుకు అవకాశం ఉందని ఎం. ఇ. ఓ. కె. వి. వి. సత్యనారాయణదొర అన్నారు. ఈకార్యక్రమంలో హెచ్. ఎం. ఆదిలక్ష్మి, ఎం. ఇ. ఓ లు కె. వి. వి. సత్యనారాయణదొర, టి. సూరయ్యరెడ్డి, సి. ఆర్పీ శ్రీనివాస్, మనబడి.. జిల్లా అధికారి ఎస్. అప్పారావు, సి. ఎం. ఓ. చినబాబు, బొజ్జయ్య, ఉదయ్, ఉపాధ్యాయులు అందరూ పాల్గొన్నారు.

## సమాచార సహాయ కార్య నిర్వాహక ఇంజనీర్ బాబూ రావు

# సేవలు ప్రశంసనీయం... : జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్



**ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్ 30 (ప్రభాతవార్త):** ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సహాయ కార్య నిర్వాహక సమాచార ఇంజనీరు సి.బాబూరావు సేవలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ ఎం. ఎన్ హరేంధిర ప్రసాద్ అభినందించారు. సమాచార పౌర సంబంధాల శాఖలో అత్యంత నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన అధికారిగా, అందరి మన్ననలు పొందుతూ 33 సంవత్సరాలుగా విశేష సేవలు అందించి మంగళవారం పదవీ విరమణ చేసిన సహాయ కార్యనిర్వాహక సమాచార ఇంజనీరు సి.బాబూరావును జిల్లా కలెక్టర్ తన ఛాంబరులో ప్రత్యేకంగా అభినందించి దుశ్శాలువాతో సత్కరించారు. అలాగే బాబూరావు సేవలను ప్రత్యేకంగా కొనియాడుతూ సమాచార శాఖ జోన్-2 జాయింట్ డైరెక్టర్ పి.తిమ్మప్ప ఆయనకి శుభాభినందనలు తెలియజేశారు. సమచార పౌర సంబంధాల శాఖలో మూడు దశాబ్దాల పాటు అంకిత బావంతో సేవలందించిన బాబూరావు 1994లో విజయవాడలో ఇన్ఫర్మేషన్ టెక్నీషియన్‌గా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1998 లో సహాయ సమాచార ఇంజనీర్ పదోన్నతి పొంది కాకినాడ, రాజమండ్రికి లలో పనిచేసారు. 2020 లో సహాయ కార్య నిర్వాహక సమాచార ఇంజనీరుగా పదోన్నతిపై ఏలూరులో బాధ్యతలు చేపట్టి, భీమవరం, కాకినాడలలో పనిచేసి, ప్రస్తుతం కాకినాడ జిల్లా డిఐపిఆర్ఓ కార్యాలయంలో మంగళవారం పదవీ విరమణ చేశారు. సమాచార శాఖలో ఆయన చూపిన ప్రతిభను, తోటి ఉద్యోగుల పట్ల ఆయన ఆత్మీయత, అనుబంధాలను సహచర అధికారులు, సిబ్బంది ఈ సందర్భంగా కొనియాడారు. పదవీ విరమణ చేసిన బాబూరావును డిఐపిఆర్ఓ కార్యాలయ అధికారులు సిబ్బంది ఘనంగా సన్మానించి, ఆయన రిటైర్మెంట్ అనంతర జీవితం శాంతి, సౌఖ్యాలతో సాగాలని ఆకాంక్షిస్తూ ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పీఆర్వో పి.రవి, ఏవీఎస్ జి.ధర్మరాజు, సీనియర్ అసిస్టెంట్లు సురేష్, కృష్ణ వేణి, పీఆర్వో ఎస్.అజయ్, ఐటి ఎన్. సూరయ్య, టైపిస్టు జె.భారతి, ఫోటోగ్రాఫర్ సిహెచ్ నరేష్ బాబు, వీడియో గ్రాఫర్ ఐ.నాగార్జున, కార్యాలయ సిబ్బంది కె.గోపీకృష్ణ, ఎం.మాధవకృష్ణ, కె.లక్ష్మీకాంతం, జె. సతీష్ బాబు, వై.వెంకట్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

# సమన్వయంతో కోనసీమ సమగ్రాభివృద్ధే లక్ష్యం.....

### జిల్లా అభివృద్ధి, కార్యకర్తల సంక్షేమం, పార్టీ బలోపేతంపై మంత్రి సుభాష్ ఆధ్వర్యంలో కీలక సమావేశం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్30,ప్రభాతవార్త.** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా సమగ్ర అభివృద్ధి, కూటమి పార్టీ బలోపేతం, కార్యకర్తల సంక్షేమంపై అమలాపురంలోని మంత్రి నివాసంలో కీలక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ముమ్మిడివరం ఎమ్మెల్యే బుచ్చిబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయి, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, టీడీపీ సీనియర్ నేత, గన్నవరం కో కన్వీనర్ మోకా ఆనందసాగర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఈ ఏడాది చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల విస్తరణ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే చర్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు, కూటమి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. అలాగే పార్టీ కార్యకర్తల సంక్షేమం, గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేసే అంశాలు, ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించే విధానం, కూటమి పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత పటిష్ఠం చేసే కార్యాచరణపై నేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.కోనసీమ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ, ప్రతి వర్గానికీ న్యాయం జరిగేలా సమిష్టిగా పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు.జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పార్టీ బలోపేతం అనే మూడు లక్ష్యాలతో కూటమి నాయకత్వం సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశంలో పాల్గొన్న నేతలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు.

# కోనసీమలో జనసేన దరఖాస్తుదారుల వెల్లువ




**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్30,ప్రభాతవార్త.** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పార్లమెంట్ పరిశీలకులు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో జనసేన పార్టీ నిర్మాణ సారథుల దరఖాస్తుల స్వీకరణకు జిల్లా వ్యాప్త జనసైనికుల్లో అనూహ్య స్పందన లభించింది. మంగళవారం అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని సంబంధించి జనసైనికుల నుండి దరఖాస్తుల సేకరించిన జనసేన పార్టీ అమలాపురం పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకులు, ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షులు,పెందుర్తి నియోజకవర్గం శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అమలాపురం ఎర్ర వంతెన వద్ద గల శ్రీ వెంకటరమణ ఫంక్షన్ హాల్ లో జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు వీర మహిళల నుండి దరఖాస్తులను స్వీకరించారు. అందరితోనూ మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ముందుగా పవన్ కళ్యాణ్ సంకల్పాన్ని, లక్ష్యాన్ని జన సైనికులకు వివరించిన రమేష్ బాబు. జన సైనికులుగా మీరు చేపట్టాల్సిన అంశాలను రాతపూర్వకంగా అందించాలని కోరారు. దీంతో భారీ ఎత్తున హాజరైన అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ జనసేన నాయకులు కార్యకర్తలు నుండి పార్టీలో అనుభవంతో కూడిన దరఖాస్తులను సమర్పించారు. సుమారు 50 మంది నుండి దరఖాస్తులను జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు నుండి స్వీకరించడం జరిగినది . అదేవిధంగా ఈ రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి మండపేట రామచంద్రపురం నియోజవర్గాలలో జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలతో జనసేన పార్టీ నిర్మాణ సాధకుల సమాచార సేకరణ సమావేశం నిర్వహించడం జరిగినది . ఈ కార్యక్రమంలో భాగంగా జూలై 3వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అమలాపురం పార్లమెంట్ అమలాపురం నియోజకవర్గం వెంకటరమణ కన్వెన్షన్ హాల్లో జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు వీర మహిళల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని అమలాపురం పార్లమెంట్ పరిశీలకులు పంచకర్ల రమేష్ బాబు తెలియజేశారు.

## వాడపల్లి వెంకన్నను దర్శించుకున్న

# శ్రీ విద్య నరసింహ భారతి స్వామి

### -భక్తుల గోవిందనామస్మరణతో మార్మోగిన వాడపల్లి క్షేత్రం..





**ఆత్రేయపురం, జూన్ 30,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారినిజగద్గురు శంకర దత్తాత్రేయ మహాసంస్థానం, శ్రీ శ్రీనగరి వీరూపాక్ష పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ విద్య నరసింహ భారతి స్వామి వారు, సినీ నటి పులి సీత, . టీడీపీ అధికార ప్రతినిధి ఉండవల్లి అనూష లు దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు .స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, జూనియర్ అసిస్టెంట్ వెంకటరాజు లు శ్రీ స్వామి వారి చిత్రపటం ప్రసాదాలను అందజేశారు. వేకువజామున మేల్కొలుపు అర్చన పంచామృత అభిషేకాలు ప్రత్యేక పూజలు , లక్ష్మి ఐశ్వర్య హోమం గోపూజ అష్టోత్తర శతనామావళి నిత్య కళ్యాణం బాల భోగం తదితర కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన శాలలో అన్నప్రసాదాలు స్వీకరించారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు లు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అర్చక స్వాములు, దేవస్థాన సిబ్బంది ఉన్నారు.

# ప్రతి పేద కుటుంబానికి అండగా సీఎం సహాయనిధి..

**-మండల టీడీపీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు.**



**ఆత్రేయపురం, జూన్ 30.(ప్రభాత వార్త)** కూటమి ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి కొండంత అండగా ముఖ్యమంత్రి సహాయనిధి నిలుస్తుందని మండల పార్టీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు (బాబు) అన్నారు. మండలంలోని తాడిపూడి గ్రామంలో టీడీపీ కార్యాలయం నందు మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మండల టీడీపీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ, ఇన్సూరెన్స్ కవర్ కాని వారికి ఆసుపత్రి ఖర్చులో కొంతభాగాన్ని అందిస్తూ.. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న తాడిపూడి గ్రామ టీడీపీ పార్టీ అధ్యక్షులు కూసంపూడి రమేష్ రాజు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన వ్యవసాయ విధానంతో అధిక దిగుబడులు సాధించవచ్చు..

**-ఇంచార్జ్ ఎ డి, ఎ, భార్గవ్ మహేష్,**



**ఆత్రేయపురం, జూన్ 30.(ప్రభాత వార్త)** మేలైన నూతన వ్యవసాయ విధానాలు పాటించడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చు అని ఇంచార్జ్ ఎ డి, ఎ, భార్గవ్ మహేష్, మండల వ్యవసాయ అధికారి జె. వి. పట్నాకి రామయ్య లు అన్నారు. మండలంలోని మెర్లపాలెం లో ఆత్మ సౌజన్యం తో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నారుమడిలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతుల మీద వ్యవసాయ అధికారి జె వి పట్నాకి రామయ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు పంటల మార్పిడి విధానం, నూతన వంగడాల వినియోగం, ఎరువుల వినియోగాన్ని తగ్గించే పద్ధతులు, సేంద్రియ వ్యవసాయం, ఆధునిక వ్యవసాయ యంత్రాల వినియోగం, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే శాస్త్రీయ సాగు విధానాలు, వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించి సమగ్ర ఎరువుల వాడకం, పచ్చి రొట్ట ఎరువులు, నానో, జీవన ఎరువులు వాడకం, వాటి ఉపయోగాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఎ ఓ మనోహర్ కృష్ణ,జిల్లా ఆత్మ డైరెక్టర్ కుదప కృష్ణమూర్తి,ఆత్మ ఎ. టి. ఎ. ఎం. నాగేశ్వరావు, బి. ఎ. ఎ. శశి ప్రియ , రైతులు పాల్గొన్నారు.

# అడ్డతీగల ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విస్తృత అవగాహన సదస్సు: సీఐ గజేంద్రకుమార్



**అడ్డతీగల, జూన్ 30, ప్రభాతవార్త** అడ్డతీగల మంగళవారం సంత కావడంతో ఆర్టీసీ కాంప్లెక్స్ నందు ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండి, నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ గజేంద్ర కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం అడ్డతీగల ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో ప్రజలకు, ప్రయాణికులకు సైబర్ నేరాలు, మహిళల రక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణ మరియు గంజాయి,సారా నిర్మూలనపై విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గజేంద్రకుమార్ మాట్లాడుతూ.. బాధ్యతారాహిత్యంగా సైబర్ లింకులు క్లిక్ చేసి, ఓటీపీలు చెప్పి మోసపోవద్దని, సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. మహిళల రక్షణకు అత్యవసర సమయాల్లో 100, 112 నెంబర్లు ఉపయోగపడుతాయని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. అలాగే యువత జీవితాలను నాశనం చేస్తున్న గంజాయి మరియు సారా, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి రవాణాపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేసి గంజాయి రహిత సమాజ స్థాపనకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్, ఆర్టీసీ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు, ప్రయాణికులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త సలాది శ్రీను అకాల మృతి నివాళులర్పించిన ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి



**అడ్డతీగల, జూన్ 30, ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త సలాది శ్రీను అకాల మృతి పార్టీకి తీరని లోటని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. అడ్డతీగలలో మంగళవారం మండల పార్టీ అధ్యక్షులు జర్తా వెంకట రమణారెడ్డి సౌజన్యంతో సలాది శ్రీను మృతదేహంపై పార్టీ జెండా, పుష్పగుచ్ఛం ఉంచి ఆమె ఘనంగా నివాళులర్పించారు.?సలాది శ్రీను ఇటీవల కాలంలో స్వల్ప అనారోగ్యానికి గురై కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శిరీషాదేవి హుటాహుటీన ఆయన గృహానికి చేరుకుని, శ్రీను మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీలో సలాది శ్రీను అత్యంత క్రమశిక్షణ గల కార్యకర్తగా సేవలందించారని కొనియాడారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే.. పార్టీ పరంగా, వ్యక్తిగతంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. శ్రీను మృతితో అడ్డతీగల తెలుగుదేశం పార్టీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.?మరణించిన సలాది శ్రీను గంగవరం మండలం సొసైటీ అధ్యక్షులు పాము అర్జున్‌కు మేనల్లుడు కావడంతో ఇటు అడ్డతీగల, అటు మొల్లేరు వాసులు ఆయన మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సలాది శ్రీను భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, గంగవరం సొసైటీ అధ్యక్షులు పాము అర్జున్, గంగవరం మండలం మాజీ జడ్పీటీసీ పాము సూర్యకాంతం, రాష్ట్ర రైతు విభాగ నాయకులు కనిగిరి రాంబాబు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఈరోజు స్వప్న కుమారి, కాంగ్రెస్ నాయకులు దశీగేటి సత్తిబాబు, అలాగే ఆడారి నాగబాబు, జారగెడ్డ మాణిక్యాల రావు, బీరా బాలయోగి, చెక్క వీరలక్ష్మి, చిట్టోజి బాపనమ్మ, కింగు మహంతి సురేష్, బీర వెంకటలక్ష్మి తదితరులు ఉన్నారు.

# పోలవరం పి డి ఎఫ్ అప్షన్ మార్పుకు నిర్వసితులకు మరో అవకాశం.




**చింతూరు జూన్ 30 ప్రభాత వార్త.** చింతూరు, కూనవరం మరియు వి.ఆర్. పురం మండలాల గిరిజనయేతర ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు పి డి ఎఫ్ ఆప్షన్ మార్పునకు మరో రెండు రెండు రోజుల అవకాశం ఇస్తున్నట్టు చింతూరు ఐ టీ డి ఏ ప్రాజెక్ట్ అధికారి శుభం నొక్వాల్ ఒక ప్రకటనలో తెలిపారు.పోలవరం ప్రాజెక్టు పునరావాసం మరియు పునరస్థాపన అర్ అండ్ అర్ కార్యక్రమం కింద చింతూరు, కూనవరం మరియు వి.ఆర్. పురం మండలాల అర్హులైన గిరిజనయేతర ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు పి డి ఎఫ్ ప్రస్తుతం ఎంపిక చేసిన ఆప్షన్-1 లేదా ఆప్షన్-2 నుండి ఆప్షన్-3 (వన్ టైమ్ సెటిల్‌మెంట్ -- ఒకేసారి నగదు పరిహారం) కు మార్పు చేసుకునేందుకు బుధవారం మరియు గురువారం మాత్రమే చివరి రెండు రోజుల అవకాశం కల్పించబడింది.ఇప్పటికే ఆప్షన్-1 లేదా ఆప్షన్-2 ఎంచుకున్న అర్హులైన గిరిజనయేతర ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు ఆప్షన్-3 (వన్ టైమ్ సెటిల్‌మెంట్ -- ఒకేసారి నగదు పరిహారం)ను ఎంచుకోవాలనుకుంటే, తమ సవరించిన ఆప్షన్ ఫారాన్ని సంబంధిత ఆర్ ఒ ఆర్ అధికారికి స్వయంగా సమర్పించాలని,లబ్ధిదారుల సౌకర్యార్థం ఐటీడీఏ, చింతూరులో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు.అవసరమైన పత్రాలతో హెల్ప్ డెస్క్‌కు హాజరై తమ ఆప్షన్ మార్పు ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు అని,ఈ అవకాశం కేవలం ఆప్షన్-1 లేదా ఆప్షన్-2 నుండి ఆప్షన్-3 (వన్ టైమ్ సెటిల్‌మెంట్) కు మార్పు చేసుకోవడానికి మాత్రమే వర్తిస్తుంది. ఇతర ఏ విధమైన ఆప్షన్ మార్పులను పరిగణనలోకి తీసుకోబడవు అని,సవరించిన ఆప్షన్ ఫారాలు గురువారం సాయంత్రం 6:00 గంటల వరకు మాత్రమే స్వీకరించబడతాయని,ఆ తర్వాత అందిన ఏ దరఖాస్తు గానీ, ఆప్షన్ మార్పు అభ్యర్థన గానీ ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోబడదు అని,కావున, అర్హులైన గిరిజనయేతర ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలందరూ ఈ చివరి రెండు రోజుల అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, గురువారం సాయంత్రం 6:00 గంటలలోపు తమ సవరించిన ఆప్షన్ ఫారాలను సంబంధిత ఆర్ ఒ ఆర్ అధికారికి లేదా ఐటీడీఏ, చింతూరులో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ వద్ద స్వయంగా సమర్పించవలసిందిగా ప్రాజెక్ట్ అధికారి కోరారు

# వ్యాదుల వ్యాప్తికి దోమలే ప్రధాన కారణం



**మామిడికుదురు.జూన్ 30(ప్రభాతవార్త)** మలేరియాతో పాటు పలు వ్యాదుల వ్యాప్తికి దోమలే ప్రధాన కారణమని నగరం పీహెచ్సీ వైద్యాధికారిణి ఆర్.పావని తెలిపారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా మంగళవారం అప్పనపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.మలేరియా రహిత సమాజంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆమె పిలుపు నిచ్చారు.ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగర్తలు తీసుకోవాలని,పరిసరాలు పరి శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.ఈ సందర్భంగా దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ జి.యజ్ఞేశ్వరరావు,ఏఎన్ఎంలు జి.శ్రీదేవి, జె.లక్ష్మి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# సోసైటీ మాజీ చైర్మన్ మృతి



**మామిడికుదురు.జూన్ 30(ప్రభాతవార్త)** మామిడికుదురు మండలం పూర్వపు పెదపట్నంలంక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)మాజీ చైర్మన్ సుందరనీడి ఉమామహేశ్వరరావు అలియాస్ బాబులు(76)మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు.గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు.బాబులుకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. బాబులు సోసైటీ చైర్మన్ గా రైతులకు పలు సేవలు అందించారని ప్రముఖులు కొనియాడారు.పలువురు ఆయన మృత దేహన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

# మందేశ్వరుని దర్శించుకున్నఎమ్మెల్యే కన్నా




**కొత్తపేట, జూన్ 30,(ప్రభాతవార్త)** మండల పరిధిలోని మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానంనకు మంగళవారం సత్తెనపల్లి శాసనసభ్యులు మాజీ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీ నారాయణ దర్శించుకున్నారు తైలాభిషేకం తదితర పూజలు నిర్వహించారు స్వామివారిని అమ్మవార్లను దర్శించుకున్నారు అనంతరం వీరికి దేవస్థానం అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి స్వామి వారి శేషవస్త్రం చిత్రపటం ప్రసాదం అందజేశారు దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు గంధం సత్య వెంకట నాగాజీ గవర వీర వెంకట సత్యనారాయణ దంగేటి సాయి నాగ భూషణం నేరేడిమిల్లి మహాలక్ష్మి ఏడుకొండలు చిలకమర్తి అనంతలక్ష్మి సావిత్రి శ్రీనివాస్ తణుకు వీరభద్రరావు కోటిపల్లి సుబ్బలక్ష్మి సుబ్రమణ్యం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం మందపల్లి గ్రామ మాజీ సర్పంచ్ దేవస్థాన మాజీ చైర్మన్ చింతం విజయ కృష్ణమోహన్ రావు తదితరులు పాల్గొనియున్నారు

# రైతులకు సబ్సిడీ పై వ్యవసాయ యంత్రాంగాలు



**రంపచోడవరం,జూన్ 30:-** రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజన రైతులు వ్యవసాయ యాంత్రికరణ కొరకు సబ్సిటిపై దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి నరేంద్ర కుమార్ మాట్లాడుతూ పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సురపాటి ప్రశాంత్ కుమార్ ఆదేశాల మేరకు రంపచోడవరం ఐటీడీఏలో వ్యవసాయ యాంత్రీకరణ కొరకు దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుంది అదేవిధంగా తైవాన్ స్ప్రేయర్స్, బ్యాటరీస్ప్రేయర్స్, పాలిథిలిన్ షీట్స్, పవర్ టెల్లర్స్,పవర్ విడర్స్ వీటన్నిటికీ దరఖాస్తులు కోరడం జరుగుతుందనీ కావున కావలసిన రైతులందరూ సంబంధిత ఆర్ఎస్కే సెంటర్లో గానీ మండల వ్యవసాయ శాఖ అధికారిని గాని సంప్రదించి దరఖాస్తు సమర్పించవచ్చని అదేవిధంగా దరఖాస్తు తోపాటు పాస్ బుక్ జిరాక్స్ వన్ బి అడంగల్ ఆర్ఓఎఫ్ ఆర్ పట్టా ఆధార్ కార్డ్ బ్యాంక్ అకౌంట్ నెంబర్ పాస్ పోర్ట్ సైజ్ ఫోటో 3 తప్పనిసరిగా సమర్పించాలని ఆయన అన్నారు.

# దేవీపట్నం తాసిల్దార్ కు వినతి పత్రం అందజేసిన ఆదివాసి జేఏసీ నాయకులు



**దేవీపట్నం, జూన్ 30 ప్రభాతవార్త :** దేవీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అనుబంధంగా పోస్ట్ మెట్రిక్ హాస్టల్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని ఏపీ ఆదివాసీ జేఏసీ నాయకులు దేవీపట్నం తహసిల్దార్ కె. సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రభావంతో హాస్టల్ భవనం అవసరమైందని వారు పేర్కొన్నారు. అలాగే దండంగి, గంగంపాలెం, మూలపాడు, తొయ్యేరు గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, పోలవరం నిర్వాసితుల భూములను ఆన్‌లైన్ చేయాలని కోరారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తహసిల్దార్ హామీ ఇచ్చారు. నిర్వాసిత రైతులు ప్రొసీడింగ్ ఆర్డర్, ఆధార్ ప్రతులతో వస్తే వరి విత్తనాల కోసం అనుమతి ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# .పిల్లలు ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**-జాయింట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్.**



**రంపచోడవరం,జూన్ 30. ప్రభాతవార్త.** ప్రతి గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు విద్యతోపాటు ఈ సీజన్లో ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ జాయింట్ కలెక్టర్,ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సురపాటి ప్రశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రంపచోడవరం మండలం ఇర్లపల్లి గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ పోలవరం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలలో చదువుతున్న బాల బాలికలకు ఈ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఒకటికి రెండుసార్లు విద్యార్థులకు విద్యను బోధించాలని సంబంధిత ఉపాధ్యాయులను ఆయన ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతిరోజు మెనూ పక్కాగా అమలు చేయాలని ఆయన అన్నారు. ఎప్పటికప్పుడు ఆశ్రమ పాఠశాలల ప్రాంగణాలలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన అన్నారు. ప్రతి ఆశ్రమ పాఠశాలల్లో చదువుచున్న విద్యార్థులు ఎవరికైనా అనారోగ్యంగా ఉన్న ఎడల వెంటనే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకొని వెళ్లి వైద్యం చేయించాలని ఆయన అన్నారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యార్థులందరికీ పుస్తకాలు బట్టలు, తదితర విద్య సామాగ్రి విద్యార్థులకు అందజేసింది లేనిది ఆయన ఆరా తీశారు. అదేవిధంగా పాఠశాలలోనే భోజనశాలను, స్టోర్ రూమ్ లో ఉన్న గుడ్లను, కూరగాయలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, తాసిల్దార్ సిహెచ్.బాలాజీ, ప్రధానోపాధ్యాయురాలు యస్.రాజేశ్వరి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థుల మౌళిక సౌకర్యాలకు రూ. 50 కోట్లు



**రాజవొమ్మంగి, జూన్ 30, ప్రభాతవార్త** గిరిజన సంక్షేమ అశ్రమ పాఠశాలల్లో విద్యా బ్యాసం చేస్తున్న గిరిజన విద్యార్థినీ, విద్యార్థుల మౌళిక సౌకర్యాల కల్పనకు రూ. 50 కోట్లు నిధులు వెచ్చిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాంగదయ్య అన్నారు. మంగళవారం జడ్డంగి గిరిజన సంక్షేమ బాలికొన్నత అశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థినుల పఠనా సామర్థ్యంను పరిశీలించారు. అనంతరం ప్రభాతవార్తతో అయన మాట్లాడుతూ పి. ఎం. జన్మన్ పథకంలో 15 హాస్టల్ బ్లాక్ లు నిర్మాణానికి రూ. 45 కోట్లు నిధులు కేటాయింపు జరిగిందన్నారు. 10 వేల మంది విద్యార్థినులకు ఒక్కోరికి రూ. 400 లు విలువైన కాస్మోటిక్స్ కిట్లు ఇవ్వడం జరిగిందన్నారు. 55 ఆశ్రమ పాఠశాలల్లో ఒక్కో పాఠశాలలో రూ. 3 లక్షలు వ్యయంతో ఆర్వో ప్లాంట్లు నూతనంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతీ 15 రోజులకు ఒకసారి నీటి పరీక్షలను చేస్తారన్నారు. 71 అశ్రమ పాఠశాలల్లో 17, 846 మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్యాబ్యాసం చేస్తున్నారని తెలిపారు. వాతంగి, లోదొడ్డి, దాకోడు, పుల్లంగి, కల్లేరు, టేకులోద్ది అశ్రమ పాఠశాలలు ప్రాథమిక పాఠశాలలు గా మాత్రమే కొనసాగుతాయన్నారు. 55 ఆశ్రమోన్నత పాఠశాలల్లో పదోతరగతి లో ప్రతిభ గల 100 మంది విద్యార్థులు, 60 మంది విద్యార్థినిలను ఎంపిక చేసి వారి కోసం ప్రత్యేకంగా కేటాయించిన ముసురుమిల్లి, నర్సింహాపురం, బొడ్డగూడెం, ఎర్రంపాలెం లో వారికి బోధన జరుగుతుందన్నారు. 13 కళాశాల హాస్టల్స్ లో 1,300 మంది విద్యార్థులు ఉంటూ చదువుకొంటున్నారన్నారు. ఇప్పుడు నూతన విధానంలో 5 తరగతి నుండి పదోతరగతి, మూడో తరగతి నుండి ఏడో తరగతి వరకూ మాత్రమే ఆశ్రమ పాఠశాలలు కొనసాగుతాయని వివరించారు. ఈకార్యక్రమంలో డి. డి. రుక్మాంగదయ్య, పి. ఎం. ఆర్. సి. ఏ. టి. ఓ. బి. చినబాబు, హెచ్. ఎం. బి. లక్ష్మమ్మ, వార్డెన్ సత్యనారాయణమ్మ, శ్రీదేవి, సత్యవతి, రితూ విన్నయ, ఆశ, వెంకటరత్నం, పద్మ వతి, హైమ, దుర్గాదేవి పాల్గొన్నారు.


# హోప్ ఐలాండ్ చిన్నారులకు పోలియో చుక్కలు.

**తాళ్ళరేవు, జూన్ 30 (ప్రభాతవార్త):** జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ హోప్ ఐలాండ్ గ్రామంలో చిన్నారులకు సోమవారం వైద్య బృందం పోలియో చుక్కలు వేశారు. అదేవిధంగా గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి 70 మందికి బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. తాళ్ళరేవు లోకేటెడ్ పిహెచ్సి మెడికల్ ఆఫీసర్ ఈశ్వర్, హెచ్ వి నెహ్రూ రాణి, ఏ డి ఐ ఓ సెక్టార్ నుంచి వెంకట్, పీఎంవివై నుంచి నరేష్, ఏఎన్ఎంలు వీ జ్యోతి, డి స్రవంతి, సిహెచ్ఓ డబ్ల్యు ఎన్. ప్రసాద్, కే. ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్లు బాలకృష్ణ, గోవిందు, ఆంజనేయులు, ఆశ వర్కర్లు ఎల్ .విమలాదేవి, ఎం. దుర్గ పాల్గొన్నారు.



# పోలియో రహిత దేశంగా భారత్ కొనసాగాలి..

**-డిఎంహెచ్ఓ దుర్గారావు దొర..**



**అంబాజీపేట,జూన్ 30,(ప్రభాతవార్త):** పోలియో రహిత దేశంగా భారత్ కొనసాగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైద్యాధికారి ఎం.దుర్గారావు దొర అన్నారు.పోలియో చుక్కల కార్యక్రమంలో భాగంగా ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక బస్టాఫ్ వద్ద నిర్వహిస్తున్న ట్రాన్సిట్ బూత్ ను దుర్గారావు దొర మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా దుర్గారావు దొర మాట్లాడుతూ పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం జిల్లా అంతట 98.5 శాతం పూర్తయిందన్నారు. ఇప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలన్నారు. పోలియో రహిత సమాజానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పోలియో వేసిన చిన్నారులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యాధికారులు ఎం.సిద్దార్థరాయ్, టి.దివ్యశ్రీ, సీహెచ్వో రవికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# లైన్మెన్ శ్రీనుకి న్యాయంచెయ్యాలి



**గోపాలపురం, జూన్ 30 (ప్రభాతవార్త)** గోపాలపురం విద్యుత్ లైన్మెన్ చింతలపూడి శ్రీనివాసరావు విషయంలోఅధికారులు న్యాయం చేయాలని నిడదవోలు డివిజన్లోని ఎస్సీ ఎస్టీ విద్యుత్తు ఉద్యోగులసంఘం డిమాండ్ చేశారు. ఈ మేరకు గోపాలపురం ఏడీఏ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళనకు దిగారు.ఈ సందర్భంగా డివిజన్ అసోసియేషన్ అధ్యక్షులు కేవీ సుబ్బారావు మాట్లాడుతూ ఫిబ్రవరి 18వ తేదీన గోపాలపురం లోవిద్యుత్తు లైన్లో మరమ్మత్తుల నిమిత్తంలైన్మెన్ శ్రీను నాలుగు ఫీడర్లకు ఎల్ సి తీసుకున్నాడని అన్నారు.అయితే పనిచేస్తుండగా మధ్యలో సామానులు అవసరమై లైన్మెన్ శ్రీను ఆఫీసుకు వెళ్లిన సమయంలో ఓ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ సిహెచ్ శ్రీనివాసరావుఅనే వ్యక్తి విద్యుత్ స్తంభంఎక్కడంతో విద్యుత్ షాక్కు గురై స్తంభంపైనే మరణించాడని తెలిపారు .దీనికి ప్రధానంగా షిఫ్ట్ ఆపరేటర్ నిర్లక్ష్యమేనని అన్నారు. లైన్ మాన్ శ్రీనునాలుగు ఫీడర్లకు ఎల్ సి అడిగినప్పటికీమూడు ఫీడర్లకు ఎల్సి ఇచ్చి నాలుగో ఫీడర్ కు షిఫ్ట్ ఆపరేటర్ఎల్సి ఇవ్వకపోవడం కారణంగానే ఒక నిండు ప్రాణం బలైపోయిందని సుబ్బారావు అన్నారు. దీనికి లైన్మెన్ చింతలపూడి శ్రీనివాసరావుని బాధ్యుడిని చేయడం ఎంతవరకు సమంజసం అని యూనియన్ నాయకులు ప్రశ్నించారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకొని లైన్మెన్ చింతలపూడి శ్రీనుకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు.దీనిపై ఏడి ఈ వి రవిశంకర్ ను విలేకరులువివరణ అడగ్గా ఈ సంఘటనపై ఉన్నతాధికారులత్రీ మెన్ కమిటీ విచారణ జరిగిందని లైన్మెన్, షిఫ్ట్ ఆపరేటర్ కు, జేఎల్ఎం, లకు నోటీసులు జారీ చేశారని తెలిపారు. ప్రస్తుతం డిఈఈ స్థాయిలో విచారణలో ఉందని అన్నారు.ఉద్యోగుల ఆందోళన కార్యక్రమంలో ఎం చంద్రావు బి వాసుదేవరావు బంగారు రాజు మీసాల నాగేశ్వరరావు పి రాంబాబు భీమయ్య తదితర యూనియన్ నాయకులు సభ్యులు పాల్గొన్నారు

# యర్రంశెట్టి సూరిబాబు మాస్టార్‌కు ఘన వీడ్కోలు

**- కడియంలో ఘన సత్కారం**



**కడియం ,జూన్ 30 (ప్రభాతవార్త)**మూడు దశాబ్దాలకు పైగా విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో విశేష సేవలందించిన యర్రంశెట్టి సూరిబాబు మాస్టారు మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. 31 సంవత్సరాల క్రితం అనపర్తిలో ఎస్జీటీగా ఉపాధ్యాయ జీవితాన్ని ప్రారంభించిన ఆయన, అనంతరం ప్రమోషన్‌పై కడియం ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టారు. అనంతర కాలంలో మండపేట, కడియం ప్రాంతాల్లోనూ సేవలందిస్తూ వేలాది మంది విద్యార్థులకు తనదైన బోధనా శైలితో విజ్ఞానాన్ని అందించారు. ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. సత్యనారాయణ నేతృత్వంలో స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో సూరిబాబు దంపతులకు ఘన అభినందన సత్కార కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ ఎలుగుబంటి సత్యప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా సూరిబాబు మాస్టారు జీవితాంతం అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. తన బోధనా నైపుణ్యంతో ఎందరో విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చిన ఆదర్శ ఉపాధ్యాయుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. పదవీ విరమణ ఉద్యోగానికి మాత్రమేనని, సమాజ సేవకు కాదని, భవిష్యత్తులోనూ ఆయన విద్యా రంగానికి మార్గదర్శకత్వం అందించాలని ఆకాంక్షించారు.ఎంఈఓ మణికుమార్, ఎంఈఓ వై. నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని మాట్లాడుతూ సూరిబాబు సేవలను ప్రశంసించారు. ప్రధానోపాధ్యాయులు టి. సత్యనారాయణ మాట్లాడుతూ గత ఏడాది సూరిబాబు మాస్టారు ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకోవడం పాఠశాలకు గర్వకారణమని, విద్యార్థులకు క్లిష్టమైన ఫిజిక్స్ అంశాలను సైతం సులభంగా అర్థమయ్యేలా బోధించడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. సహచర ఉపాధ్యాయులకు సైతం ఆదర్శంగా నిలిచారని తెలిపారు.ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కే. రమేష్, శాస్త్రి, చోడిశెట్టి బాలాజీ, ఉపాధ్యాయులు చిలుకూరి శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు ఉలిశెట్టి సత్తిబాబు, బీజేపీ నాయకులు గారపాటి తాతబ్బాయి, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ గారపాటి సత్యదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సూరిబాబు దంపతులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు.

# వైసీపీ నాయకులు ఎమ్మెల్యే బండారు పై చవక బారు ఆరోపణలు మానుకోవాలి

**-బట్టి యజమానులు చెల్లించే లైసెన్సు రుసుము ప్రభుత్వానికి వెళ్తుందని కూడా తెలియని వాళ్లు నాయకులా?-ఆలమూరు ఇటుక బట్టి యజమానులు విమర్శ**

**ఆలమూరు, జూన్ 30, (ప్రభాతవార్త)** ఇటుక బట్టీల యజమానులు మట్టిని



నిల్వ చేయడానికి ప్రభుత్వానికి ఏడాదికి పన్నుల రూపేణా చెల్లించే రూ.10వేలు ఎమ్మెల్యే బండారుకు వెళుతుందని వైసీపీ నాయకులు చౌకబారు ఆరోపణలు చేయడం సిగ్గుచేటని ఆలమూరు ఇటుక బట్టి సంఘం నాయకులు ఎద్దేవా చేశారు. మంగళవారం ఆలమూరు శ్రీకృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటుక బట్టి యజమానులు మట్టి నిల్వ చేసుకోవడానికి పడుతున్న ఇబ్బందులు, మైనింగ్ అధికారులు దాడులు చేసి జరిమానాలు విధించడం మొదలైన ఇబ్బందులను ఎమ్మెల్యే బండారుకు బట్టి యజమానులు తెలియజేస్తే, ఆయన జిల్లా గనులు భూగర్భ శాఖాధికారి బి అశోక్ కుమార్ తో చర్చించి ప్రభుత్వానికి ప్రతి ఏడాది లైసెన్స్ చెల్లించేలా ఒక విధానాన్ని ఏర్పాటు చేశారని తద్వారా బట్టి యజమానులకు ఎంతో మేలు చేశారని వారు వివరించారు. తాము చెల్లించే రూ.10వేలు భూగర్భ గనుల శాఖకు వెళుతుందని, వారు రసీదులు సైతం అందజేశారని, ఈ అంశాలన్నీ పత్రికల్లో వచ్చాయని అన్నారు. వైసీపీ నాయకులు రాజకీయంగా ఎమ్మెల్యే బండారుని ఎదుర్కోలేక, తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని లైసెన్స్ రుసుము ప్రభుత్వానికి వెళుతుంది కానీ ఎక్కడైనా ఎమ్మెల్యే కు వెళ్తుందా? అని ప్రశ్నించారు. ఈ మాత్రం కూడా తెలియని వాళ్ళు నాయకులుగా చలామణి కావడం వైసీపీ పార్టీలో మాత్రమే చెల్లుబాటు అవుతుందన్నారు. తాము చెల్లించిన రుసుముకు భూగర్భ ఘనుల శాఖ వారు ఇచ్చిన రసీదులను సైతం వారు ప్రదర్శించారు. ఇకనైనా ఎమ్మెల్యే బండారు పై వైసీపీ నేతలు తప్పుడు ఆరోపణలు మానుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బట్టి యూనియన్ నాయకులు సలాది నాగేశ్వరరావు, వంటిపల్లి సతీష్, ఈదల నల్ల బాబు, తాడి శ్రీనివాసరెడ్డి, నల్లా వెంకన్న, మానేపల్లి శ్రీనివాస్, చీపురుపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు 6లో

# గ్రామదేవత పుట్టినరోజు వేడుక..



**అంబాజీపేట,జూన్ 30, (ప్రభాతవార్త):** మండలంలోని ఇరుసుమండ గ్రామ దేవత శ్రీ మురుగులమ్మ తల్లి పుట్టినరోజు వేడుకను మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారి పుట్టినరోజు వేడుకను పురస్కరించుకుని అమ్మవారికి వేకువజాము నుండి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు చేపట్టారు. గ్రామ ఆడపడుచులు అమ్మవారికి ముడుపులు, మొక్కుబడులు, పలివిడి-పొంగళ్ళు, నైవేద్యాలు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన చేపట్టారు.

# ఫీడ్ ధరలు తగ్గించాలి.

### -రొయ్యల కౌంట్ ధర పెంచాలి.-ఆక్వా రైతాంగం ఆందోళన.



**తాళ్లరేవు జూన్ 30 (ప్రభాతవార్త):** పెంచిన ఫీడ్ ధరలు వెంటనే తగ్గించాలని, రొయ్యల కౌంట్ ధరలు పెంచాలని ఆక్వా రైతులు తాళ్లరేవులో ఆందోళన చేపట్టారు. ఇప్పటికే ఆక్వా రంగం లోని రైతాంగం పెట్టుబడులు అధికం కావడంతో ఆక్వా రైతులు అనేక ఇబ్బందులు పడుతుండగా ఫీడు ధరలు పెంచడం తో తాళ్ళరేవు మండలంలోని పలు ఆక్వా దుకాణాల వద్ద రైతాంగం నిరసన వ్యక్తం చేశారు ఈ మేరకు పలు షాపులను ఆక్వా రైతులు మూసి వేయించారు. రాష్ట్ర ఆక్వా రైతు సంఘం నాయకులు నాగ భూషణం ,దాట్ల వృద్ధి రాజు పిలుపుతో రైతాంగం కదిలారు. రొయ్యల కౌంట్ ధరలు పెంచాలని, పెంచిన ఫీడ్ ధరలు తగ్గించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కట్ట అప్పారావు, వసవర్ల శ్రీను, గాదిరాజు కృష్ణంరాజు, లంకె శ్రీను, గాది రాజు సతీష్ , అయినంపూడి జోగిరాజు, పోలిశెట్టి వెంకన్న, నల్లకుల సత్యనారాయణ, పైడికొండల శ్రీనివాస్, ముప్పిడి శ్రీను, గుంటముక్కల శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ ఎంపీడీవో విద్యాసాగర్ సేవలు ప్రశంసనీయం

### -పదవీ విరమణ సన్మాన సభలో జడ్పీటీసీ లోవరాజు




**గొల్లప్రోలు, జూన్ 30,(ప్రభాత వార్త)** సుదీర్ఘ కాలం పాటు వివిధ హోదాలలో పనిచేసి ఉద్యోగ విరమణ చేస్తున్న డిప్యూటీ ఎంపీడీవో విద్యాసాగర్ కుమార్ ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు తెలిపారు.డిప్యూటీ ఎంపీడీవో విద్యాసాగర్ కుమార్ ఉద్యోగ విరమణ సన్మాన సభను మంగళవారం గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.సన్మాన సభకు ఎంపీపీ అరిగెల అచ్చియమ్మ రామయ్య దొర అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా జడ్పీటీసీ లోవరాజు విచ్చేశారు.ఈ సమావేశంలో లోవరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితం ప్రారంభించిన విద్యాసాగర్ గ్రూప్ 2 ఉద్యోగిగా ఎంపికై పలు హోదాలలో పనిచేసి ప్రజలకు విశేషమైన సేవలు అందించారని కొనియాడారు.ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు,కార్యాలయ సిబ్బంది డిప్యూటీ ఎంపీడీవో విద్యాసాగర్ దంపతులను శాలువలు కప్పి పూల మాలలతో ఘనంగా సన్మానించారు. అలాగే మండల పరిధిలోని ఆయా గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు పని చేస్తూ పదోన్నతి పొందిన ఉద్యోగులను పలువురు ప్రజా ప్రతినిధులు,అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాలట్ రాజు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## 15 తేదీ లోపు రేషన్ కార్డుదారునికి సరుకులు ఇవ్వాలి. జి. ఎం. బేబీరాణి



**రాజవొమ్మంగి, జూన్ 30, ప్రభాతవార్త** ఒకటో తేదీ నుండి 15 తేదీ లోపు ప్రతీ రేషన్ కార్డుదారునికి ఉచిత బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు ప్రభుత్వ ధరలకు అందించాలని రాజవొమ్మంగి జి. సి. సి. బ్రాంచ్ మేనేజర్ బేబీరాణి డిపోల నిర్వాహకులకు సూచించారు. మంగళవారం రాజవొమ్మంగి జి. సి. సి. బ్రాంచ్ కార్యాలయంలో సేల్స్ మెన్లు, సేల్స్ ఉమెన్లు, కాంట్రాక్ట్ సేల్స్ మెన్లు, డీలర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నుండి వచ్చే ఐ. వి. ఆర్. ఎస్. ఫోన్ కాల్స్ కు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ నెలా 25 నుండి 30 తేదీ లోపు వృద్ధులకు సరుకులను ఇంటికి ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో బేబీరాణి, మాతయ్యమ్మ, ప్రమీలారాణి, శ్రీనివాసరావు, వెంకటరమణ, అబ్బాయిరెడ్డి, లక్ష్మి, సుభాషిణి, చిన్నయ్య, వై. వి. సూరిబాబు, డీలర్లు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ కు పాటుపడదాం.. జె వి వి పిలుపు.



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్ 30,ప్రభాతవార్త.** ప్రపంచ పర్యావరణ దినం పురస్కరించుకొని జూన్ నెలలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర వ్యాప్తంగా పర్యావరణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నదని జె వి వి జిల్లా గౌరవాధ్యక్షులు, చెకుముకి పత్రిక సంపాదక వర్గ సభ్యులు డాక్టర్ ఇ. ఆర్. సుబ్రహ్మణ్యం చెప్పారు. జిల్లాలో ఈ మాసంపు కార్యక్రమం ను స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. సభకు ఇంచార్జి ప్రిన్సిపాల్ కె. శిరీష అధ్యక్షత వహించారు. డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సూపర్ ఎల్ నినో కారణంగా విపరీతమైన వాతావరణ మార్పులు, వడగాలులు, వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. భూతాపం క్రమేపీ పెరిగిపోవడం, దీనికి అడ్డుకట్ట వేయడానికి ప్రజలందరిదీ బాధ్యత అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, మోటార్ వాహనాల వాడకం తగ్గిస్తూ, తక్కువ దూరాలకు సైకిల్ వాడాలని, మొక్కలు విరివిగా నాటాలని చెప్పారు. జె వి వి జిల్లా ఉపాధ్యక్షులు కోలా వెంకటేశ్వర రావు మాట్లాడుతూ భూతాపం పెరిగి పోడానికి మనుషుల చర్యలే కారణం అన్నారు. గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గార రాలను అదుపులో ఉంచేందుకు శిలాజ ఇంధనాల వాడకం తగ్గించాలన్నారు.జె వి వి జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ లో ప్రజలకు అవగాహన కలిగించేందుకు గ్రామస్థాయిలో కార్యక్రమాలు చేపడుతున్నా మన్నారు. జిల్లా ట్రెజరర్ కెవివి సత్యనారాయణ,సీనియర్ ఇంటర్ విద్యార్థిని షారోన్ ప్రసంగించారు. పర్యావరణ పరిరక్షణ లో తాము భాగస్వాములు అవుతామని, ప్లాస్టిక్ బ్యాగ్ లు, గ్లాస్ లు వాడమని , గుడ్డ సంచులు, జ్యూట్ సంచులు వాడతామని, మొక్కలు నాటడం చే పడ తామని విద్యార్థులచేత ప్రమాణం చేయించారు.

# 31 సం. విద్యాబోధన చేసిన రాజ్ దినకర్ సేవలు ప్రశంసనీయం డి. డి. రుక్మాంగదయ్య



**రాజవొమ్మంగి, జూన్ 30, ప్రభాతవార్త** 31 సం. పాటు గిరిజన విద్యార్థులకు చక్కటి విద్యాబోధన చేసిన ప్రధానోపాధ్యాయులు రాజ్ దినకర్ సేవలు ప్రశంసనీయమని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాంగదయ్య అన్నారు. రాజవొమ్మంగి గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. రాజ దినకర్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు మొల్ల కృష్ణ అధ్యక్షతన జరిగింది. రాజ్ దినకర్ దంపతులను డి డి రుక్మాంగదయ్య, ఏ. టి. డబ్ల్యూ. ఓ. కృష్ణమోహన్, జిల్లా విద్యాధికారి శ్రీరాములు, ఎం. ఇ. ఓ లు, అన్ని ప్రాంతాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానం చేశారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని వెల్లడించారు. బోర్నగూడెం ఆశ్రమోన్నత పాఠశాల 2000..2001 సం. పదోతరగతి విద్యార్థులు రాజ్ దినకరన్ ను పూలమాలలు వేసి సన్మానం చేసారు. బహుమతిని ఇచ్చి గురుదంపతులు నుండి ఆశీస్సులు తీసుకొన్నారు. ఒక పండుగ వాతావరణంలా సన్మానం జరిగింది. ఈకార్యక్రమంలో డి. డి. రుక్మాంగదయ్య, డి. ఇ. ఓ శ్రీరాములు,ఏ. టి. డబ్ల్యూ. ఓ కృష్ణమోహన్, ఎం. ఇ. ఓలు కె. వి. వి. సత్యనారాయణదొర, టి. సూరయ్యరెడ్డి, నాగసుశీల, ఆదిలక్ష్మి, లక్ష్మమ్మ, లోతా రామారావు, సత్యవేణి, బేబీరాణి, దాసరి నాగేశ్వరరావు, సుబ్రమన్యేశ్వరి, అన్ని బారీగా ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## కస్తూరిబా గాంధీ విద్యాలయం ఆకస్మిక తనిఖీ



**శంఖవరం జూన్ 30 ప్రభాతవార్త** మండల కేంద్రమైన శంఖవరం లో గల కె. జి. బి.వి పాఠశాల కు సమగ్ర శిక్షా జిల్లా అడిషనల్ ప్రోజెక్ట్ కో ఆర్డినేటర్ వి .వి.వి. సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు.తరగతి గదిలో విద్యార్థుల విద్యాప్రమాణాలును, నోట్ బుక్స్ క్లాస్ నిర్వహణ తరగతిపై విద్యార్థులకు ఉన్న పరిజ్ఞానాన్నిప్రశ్నించారు అనంతరం ప్రిన్సిపల్ ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి బాలికల సర్వతో ముఖాభివృద్ధికి కేజీబీవీ విద్యాలయాలను ఏర్పాటు చేయడం జరిగిందని విద్యార్థులకు విద్యతో పాటు స్వయం ప్రతిపత్తి గల అంశాలపై అవగాహన కల్పించాలన్నారు 100 పర్సెంట్ రిజల్ట్ తీసుకురావాలని తెలియజేశారు. ఉపాధ్యాయునిలు విద్యార్థులు పట్ల వ్యక్తిగత బాధ్యత కలిగి ఉండాలని సూచించారు.నిర్మాణం లో ఉన్న సైన్స్ లాబ్స్ పనులను పరిశీలించి పాఠశాల కు అవసరమైన వసతులను అడిగి తెలుసుకున్నారు.వసతిగృహాన్ని సందర్శించి మెనూ,రిజిస్టరలు స్టాక్ ను పరిశీలించి, మధ్యాహ్నం భోజనాన్ని రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు.కెమిస్ట్రీ, ఫిజిక్స్, పాల్ లాబ్, వొకేషనల్ లాబ్ లను సందర్శించడం జరిగింది. ఆయన వెంట జి సి డి ఓ కే వెంకటలక్ష్మిఅసిస్టెంట్ ఇంజన్ మాణిక్యాలరావు తదితరులు ఉన్నారు .

## మెగా రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా పాల్గొన్న యువత



**కాకినాడ రూరల్, జూన్ 30 (ప్రభాతవార్త):** కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం వెంకటేశ్వరరావు తనయుడు సందీప్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని చల్లా ఫంక్షన్ హాల్ లో శ్రీ యువసేన బ్లడ్ బ్యాంక్ వారిచే మెగా రక్తదాన శిబిరాన్ని జనసేన పార్టీ నాయకులు ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరంలో సుమారు 300 మంది యువకులు, మహిళలు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు ఆపదలో ఉన్నవారికి రక్తం అందక ప్రాణాలు కోల్పోయే పరిస్థితి లోఈ రక్తదాన శిబిరం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చని, రక్తదాతలందరినీ జనసేన పార్టీ నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అభిమానులు, వీర మహిళలు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలు పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి




**అనపర్తి జూన్ 30 (ప్రభాత వార్త)**అనపర్తిలోని జి.బి.ఆర్. డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని అనపర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ వి.ఎల్.వి.కే. సుమంత్ , ఎస్సైబి. వినయ్ ప్రతాప్, జిల్లా సైబర్ ల్యాబ్ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా సైబర్ ల్యాబ్ పోలీసులు మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని, వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఓ టి పి లు, పాస్‌వర్డ్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు.తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయంటూ వచ్చే పెట్టుబడి ఆఫర్లు, ఆన్‌లైన్ పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, లాటరీలు, గిఫ్ట్‌లు, కస్టమర్ కేర్ పేరుతో వచ్చే కాల్స్ వంటి మోసాలను నమ్మవద్దని తెలిపారు. సులభంగా డబ్బు సంపాదించాలని ఆశపడి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని అనేక మంది ఆర్థికంగా నష్టపోతున్నారని వివరించారు.వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల్లో అపరిచితులతో చాటింగ్ చేయడం, వారు పంపే లింకులు, యాప్‌లు, ఈ-మెయిల్స్‌ను క్లిక్ చేయడం వల్ల వ్యక్తిగత సమాచారం దొంగిలించబడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.సైబర్ మోసాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా వెబ్‌సైట్‌లో వెంటనే ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పై శ్రీ బి. దుర్గా ప్రసాద్ , కళాశాల ప్రిన్సిపల్ ఎన్.పి. అబ్బాయి రెడ్డి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన దేవీపట్నం ఎస్ఐ షరీఫ్



**దేవీపట్నం, జూన్ 30 ప్రభాతవార్త:** పోతుకొండ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, రహదారి భద్రతా నిబంధనలు, మహిళల భద్రత, ఎన్డీపీఎస్ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, మాదకద్రవ్యాల వినియోగం మరియు అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. చట్టవిరుద్ధ చర్యల్లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అందరికీ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం.



**రౌతులపూడి,జూన్30.(ప్రభాత వార్త)**అందరికీ మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వం కృషిచేస్తుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ అన్నారు.మంగళవారం స్థానిక సి హెచ్ సీ ఆసుపత్రిలో వివిధ వైద్య పరికరాలను ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికి ఆరోగ్యం అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.ప్రజలందరూ వైద్య సిబ్బంది కి సహకరించాలని కోరారు. ఎల్లపుడు వైద్యులు,సిబ్బంది అందుబాటులో ఉండి సహకరించాలని తెలిపారు. ఈ కార్య క్రమంలో మండల టి డి పి అధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, రౌతులపూడి మండల మాజీ ఎంపీపి భాస్కరబాబు, మాజీ సర్పంచ్ పైలా సాంబ శివరావు, ఆసుపత్రి సూపర్ డెంట్ ఉమామహేశ్వరరెడ్డి, వైద్య సిబ్బంది, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## అడిషనల్ ఎస్సైగా విప్పర్తి బాధ్యతల స్వీకారం



**కాత్రేనికోన, జూన్ 30(ప్రభాతవార్త)** కాత్రేనికోన పోలీస్ స్టేషన్ అడిషనల్ ఎస్ఐగా విప్పర్తి సత్యనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనగతంలో కాత్రేనికోన పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహించి ప్రజలకు చేరువైన అధికారిగా గుర్తింపు పొందారు. అనంతరం ఎస్ఐగా పదోన్నతి పొందిన పాలకొల్లు టౌన్ పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు.ప్రజల అభ్యర్థన మేరకు ఉన్నతాధికారులు తిరిగి కాత్రేనికోన పోలీస్ స్టేషన్‌కు అడిషనల్ ఎస్ఐగా నియమించారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా స్టేషన్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంతో పాటు చట్ట పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

## సొంత పనులకు ఉపాధి కూలీలు!

**సీతానగరం, జూన్ 30, (ప్రభాతవార్త) :** మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో ఉపాధి హామీ కూలీలను నిబంధనలకు విరుద్ధంగా ఫీల్డ్ అసిస్టెంట్ తన సొంత పనులకు వినియోగిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గ్రామానికి చెందిన చల్లమల్ల సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి పిజిఆర్ఎస్ లో ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో ఉపాధి హామీ పథకం పర్యవేక్షణలో అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై ఎంపీడీవో ఎం. భారతిని వివరణ కోరగా.. ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన ఫిర్యాదుపై విచారణ జరుపుతున్నామని, విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆమె తెలిపారు.



## విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : సీఐ బి సూర్య అప్పారావు



**ప్రత్తిపాడు, జూన్ 30 (ప్రభాత వార్త)** విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. సూర్య అప్పారావు, సబ్ ఇన్స్పెక్టర్ ఎస్ లక్ష్మీకాంతం పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు అఖిల్ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు 'గంజాయి, డ్రగ్స్ మహమ్మారి - దుష్పరిణామాలు' అనే అంశంపై మంగళవారం విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.?ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ, క్షణికానందం కోసం అలవాటు పడే మత్తు పదార్థాలు జీవితాలను చీకట్లోకి నెట్టేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో ఉంటూ లక్ష్యాల వైపు అడుగులు వేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్ రవాణా లేదా వినియోగానికి సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా భయం లేకుండా పోలీసులకు తెలియజేయాలని కోరారు.ఫిర్యాదుల కోసం సమాచారం అందించేందుకు క్రింది నంబర్లను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.యాంటీ నార్కోటిక్స్ టోల్ ఫ్రీ నెంబర్: 1972?పోలీస్ అత్యవసర నెంబర్: 112సమాచారం ఇచ్చిన వారి పేర్లు, వివరాలను అత్యంత రహస్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల్ విద్యాసంస్థల చైర్మన్ ఇనకోటి గంగాధర్, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, ఇంటర్మీడియట్ విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మద్దతు తెలియజేసిన నరసాపురం పార్లమెంటరీ పరిశీలికులు ముదునూరి మురళీ కృష్ణంరాజు



**ప్రత్తిపాడు, జూన్ 30 ( ప్రభాతవార్త)** అనకాపల్లి జిల్లా అధ్యక్షులు,మాజీ మంత్రి,ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రీజినల్ కో-ఆర్డినేటర్ గుడివాడ అమర్నాథ్‌కు మద్దతు తెలియజేసిన ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ నాయకులు,నరసాపురం పార్లమెంటు పరిశీలకులుముదునూరి మురళీ కృష్ణంరాజు పాల్గొని కీలక నేతలతో కలిసి అమర్నాథ్‌కు తమ మద్దతు ప్రకటించారు.రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరై గుడివాడ అమర్నాథ్‌కు సంఘీభావం తెలిపారు.హోం మంత్రి అనితపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర మహిళా కమిషన్ పిలుపు మేరకు అమర్నాథ్ విచారణకు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయనకు మద్దతుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

## జాతీయ స్థాయి ఈక్విప్డ్ పవర్లిఫ్టింగ్ ఛాంపియన్షిప్లో గొల్లపాలెం యువకునికి సిల్వర్ మెడల్ పలువురి అభినందన



**కాజులూరు, జూన్ 30(ప్రభాత వార్త)** ఇటీవల హైద్రాబాద్ లో జరిగిన జాతీయ స్థాయి ఈక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ డెడ్ లిఫ్ట్ విభాగంలో గొల్లపాలెం ఐరన్ ఫిట్నెస్ జిమ్ లో శిక్షణ పొందుతున్న కెడిఎస్ కుమార్ వెండి పథకం (సిల్వర్ మెడల్) సాధించారు. ఈ మేరకు మంగళవారం జిమ్లో అబినందన సభనిర్వహించి జిమ్ నిర్వాహకులు, స్థానికులు కెడిఎస్ కుమార్ ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డిఎన్ఎఫ్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షురాలు, బందనపూడి మాజీ సర్పంచ్ దేగల తిరుమలవేణి తదితరులు విజేతను సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ శారీరక దృఢత్వంతోపాటు మానశిక ఉల్లాసానికి వ్యాయామం ఎంతగానో దోహదపడుతుందన్నారు. పవర్ లిఫ్టింగ్ లో సత్తా చాటిన కుమార్ ను, కోచ్ ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రిటైడ్ ఆర్మీ ఉద్యోగి మేడిశెట్టి రామకృష్ణయ్య, వైఎస్సార్సీపీ మేధావులఫోరం నియోజకవర్గ కన్వీనర్ తాడి వాసురెడ్డి, పార్టీ మండల బూత్ కమిటీల కన్వీనర్ పోతురాజు బాబురావు, జగతా నాగబాబు. జిమ్ కోచ్ లు షారుణ్, బాల సాయి శరన్, మహేష్ , కృష్ణ తదితరులు విజేత రెడిఎస్ కుమార్ అభినందించారు.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# మెడికవర్ హాస్పిటల్స్ లో డయాలిసిస్, నాలెడ్జ్ స్టూడియోను ప్రారంభించిన పీవీఎన్ మాధవ్



**కాకినాడ రూరల్ ,జూన్30 (ప్రభాతవార్త):** స్థానిక అచ్చంపేట జంక్షన్ సమీపంలో అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్న మెడికవర్ హాస్పిటల్లో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలిసిస్ విభాగాన్ని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పీవీఎన్ మాధవ్ మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ ప్రజలకు నాణ్యమైన ఆధునిక వైద్య సేవలను అందిస్తూ విశ్వాసాన్ని సంపాదించుకుందని అన్నారు. ముఖ్యంగా ట్రాన్స్‌ప్లాంట్ సేవలు, అరుదైన వ్యాధులకు చికిత్సలు, అత్యాధునిక వైద్య సదుపాయాలను తక్కువ ఖర్చుతో అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.కాకినాడ జిల్లా ప్రజలకు డా. ఎన్టీఆర్ వైద్య సేవ , ఆయుష్మాన్ భారత్ పథకాల ద్వారా నాణ్యమైన వైద్య సేవలను అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలకు కూడా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమని అన్నారు. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ సెంటర్ హెడ్ ఎన్. అంజిబాబు మాట్లాడుతూ, ప్రజలకు ముఖ్యంగా కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు నాణ్యమైన డయాలిసిస్ సేవలను అందించేందుకు నూతన డయాలిసిస్ విభాగాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వర రావు , బీజేపీ నాయకులు తుమ్మలపల్లి నారాయణరావు, మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు, హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు

## భారీగా రేషన్ బియ్యం పట్టుకున్న పోలీసులు

**యు.కొత్తపల్లి, జూన్ 30 (ప్రభాతవార్త) :** మండలంలోని రమణక్కపేటలో అక్రమంగా నిల్వ ఉంచిన వెయ్యి కేజీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రమణక్కపేటలో ఉన్న ఒక మకాంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారన్న సమాచారంతో ఎస్సై వెంకటేష్ తన సిబ్బందితో దాడి చేసారు. నిల్వ ఉంచిన సుమారు టన్ను రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచిన వి.త్రిమూర్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పిఠాపురం పౌరసరఫరాల గొడౌనుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## పామర హైస్కూల్ సందర్శించిన ఉన్నతాధికారులు

**కె. గంగవరం, జూన్ 30, (ప్రభాతవార్త):** రామచంద్రపురం నియోజకవర్గానికి ఒక ఆదర్శ ఉన్నత పాఠశాల రూపొందించాలని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో రామచంద్రపురం నియోజకవర్గం గంగవరం మండలం పామర్రు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసినట్లు సమగ్ర శిక్ష డి ఈ నాగ మనోహర్, ఏ ఈ సూర్యనారాయణ లు తెలిపారు. అనంతరం డిఈ,ఏఈ లు పామర్రు హై స్కూల్ ను సందర్శించి ప్రస్తుతం ఉన్న వసతులను వనరులను నమోదు చేసుకుని కావలసిన మౌలిక వసతులు కలిపిస్తారని, సుమారు 10 నుండి 15 కోట్ల రూపాయలతో వెచ్చించి ఇండోర్ స్టేడియం, అదనపు తరగతి గదులు, భోజనశాల, ప్రయోగశాల, డిజిటల్ లైబ్రరీ, గార్డెనింగ్, అంతర్గతదారులు, విద్యార్థుల ఆటపాటల పరికరాలు మొదలైన నిర్మాణం చేపట్టనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లు నాగరాజు, ఆంజనేయులు, పీడీ గణేష్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు నండూరి భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ గిరిజనుల ఐక మత్యానికి నిదర్శనం రాజులు కొలుపు జాతర

### -బాలల హక్కుల కమీషన్ సభ్యులు గాంధీబాబు



**వి.ఆర్.పురం,జూన్ 30,ప్రభాతవార్త** మండల కేంద్రం రేఖపల్లిలో ప్రతీ రెండేళ్ల కు ఒకసారి జరుగుతున్న చిన్న సార్లమ్మ, పెద్ద సార్లమ్మ, కొర్రాజుల కొలుపు జాతర, ఆదివాసీ నాయకపోడు గిరిజనులు, ఆదివాసీ కొండరెడ్ల గిరిజనుల ఐక మత్యానికి నిదర్శనమని, ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల కమీషన్ సభ్యులు ఉండవల్లి గాంధీబాబు అన్నారు. మంగళవారం రేఖపల్లిలో ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, ఆచార సాంప్రదాయాల నడుమ జరిగిన కొర్రాజుల కొలుపు జాతరలో గాంధీబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడారు. తర తరాలుగా రెండు గిరిజన తెగల నడుమ భక్తి పర్వశంతో, ఎలాంటి భావా జాలాలకు తావులేకుండా, జాతరలు నిర్వహించటం సామాన్యమైన విషయం కాదన్నారు. ఇది ఆ రెండు తెగల ప్రజల భక్తి, విశ్వాసం, నీతి, నిజాయితీకి నిదర్శనం అన్నారు. ఇదే ఐకమత్యం భావితరాల్లో కొనసాగాలని ఆయన కోరారు. ఎటపాక సిఐ వి కృష్ణ మాట్లాడారు. పదకొండు రోజులపాటు జాతర ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.ఆర్.పురం ఎస్ఐ షేక్ సాదిక్, కూనవరం ఎస్ఐ రామకృష్ణ, మోతుగూడెం ఎస్ఐ నజీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps